Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 254 మేడ్చల్ మల్కాజ్‌గిరి 3 అక్టోబర్ 2023 మంగళవారం పేజీలు : 4

## పాక్ సంక్షోభం.. కనిష్ఠ స్థాయికి పడిపోయిన రూపాయి

ఇస్లామాబాద్: తీవ్ర ఆర్థిక సంక్షోభం నుంచి గట్టెక్కేం దుకు వీలుగా అంతర్జాతీయ ద్రవ్య నిధి నుంచి రుణాలు పొం దేందుకు పాక్ తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. తాజా పాకిస్థాన్ రూపా యి మారకపు రేటుపై నిబంధనను సరళతరం చేసింది. దీంతో డాలరుతో పాక్ రూపాయి మారకపు విలువ 255కి పడిపోయింది. పాక్ చరిత్రలో ఇంత పెద్దమొత్తంలో రూపాయి పతనం కావడం ఇదే తొలిసారి. ఐఎంఎఫ్ సూచన మేరకు పాకిస్థాన్ ద్రవ్యమారకపు రేటుపై నిబంధనలను సడలించింది. దీంతో ఒక్క రోజులోనే పాక్ రూపాయి రూ. 24 మేర క్షీణించినట్లు ట్రిబ్యూన్ వెల్లడించింది. రూపాయిపై పాక్ ప్రభుత్వం నియంత్రణలను సరళీకరించాలని, రూపాయి మారకపు విలువను మార్కెట్ నిర్ణయించేలా చూడాలని ఐఎంఎఫ్ పాకిస్థాన్‌ను కోరింది.

## బరాబర్ మాది వారసత్వ రాజకీయమే

# నీదే రాజకీయం మోదీ

### సూర్యాపేట బహిరంగ సభలో నిలదీసిన మంత్రి కేటీఆర్



సూర్యాపేట : మా మీద మాట్లాడే మోదీది ఏ వారసత్వం అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మాది జాతిపిత మహాత్మాగాంధీ వారసత్వం. నీది గాంధీని చంపిన గాడ్సే వారసత్వం. దిక్కుమాలిన పార్టీ నీది. మా మీద మాట్లాడే ముందు ఒకటికి రెండు సార్లు ఒళ్లు దగ్గర పెట్టుకోని మాట్లాడితే కాంగ్రెసోళ్లకైనా, బీజేపోళ్లకైనా మంచిది. చేతనైతే ఏం చేస్తారో చెప్పండి.. ఏం చేశారో చెప్పండి అని కేటీఆర్ సూచించారు. సూర్యాపేటలో ఐటీ హబ్‌ను ప్రారంభించిన అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. నిన్న ప్రధాని పాలమూరుకు వచ్చి నోటికొచ్చినట్లు మాట్లాడారని కేటీఆర్ ధ్వజమెత్తారు. మాట్లాడితే చేతగాని మాటలు. కేసీఆర్‌ది కుటుంబ పాలన అని అంటున్నాడు. బరాబర్ కుటుంబ పాలనే అందులో అనుమానమే లేదు. ఎందుకంటే.. కేసీఆర్ 4 కోట్ల మందికి కుటుంబ పెద్ద. 70 లక్షల మంది రైతులకు, వారి కుటుంబాలకు రైతుబంధు ఇచ్చి ఆదుకుంటున్నాడు. 5 లక్షల మంది దివ్యాంగులకు నెలకు రూ. 4 వేలు పెన్షన్లు ఇచ్చి ఆసరాగా నిలబడి ఊతకర్ర అయ్యారు. 13 లక్షల మంది ఆడపిల్లలకు కళ్యాణలక్ష్మి కింద లక్షా నూట పదహారు ఇచ్చి మేనమామ అయ్యారు. కేసీఆర్ కిట్ ఇచ్చి అన్నగా నిలబడ్డాడు. దళితబంధు ఇచ్చి దళితులను ఆదుకుంటున్నారు. ఇన్ని రకాలుగా అండగా నిలబడ్డ కేసీఆర్‌ది కుటుంబ పాలనే. 4 కోట్ల మంది తెలంగాణ ప్రజలది వసుదైక కుటుంబం. ఈ కుటుంబానికి కేసీఆర్‌నే పెద్ద. ఇందులో నాకెలాంటి అనుమానం లేదు అని కేటీఆర్ తేల్చిచెప్పారు.

**బీఆర్ఎస్ పార్టీది బరాబర్ వారసత్వ రాజకీయమే..** ఊసులేనోడు వచ్చి వారసత్వ రాజకీయం అని అంటున్నాడని కేటీఆర్ మండిపడ్డారు. పక్కా రాజకీయ వారసత్వమే. బీఆర్ఎస్ పార్టీది బరాబర్ రాజకీయ వారసత్వమే. రాణి రుద్రమ్మ రాజసంతో వెలిగిన కాకతీయుల వారసత్వం మాది. మాకున్నది తెలంగాణ తెగువ.. తెలంగాణ పౌరుషం. రాణి రుద్రమ్మ వారసత్వం కాబట్టే.. గొలుసుకట్టు చెరువులు అభివృద్ధి చేసుకున్నాం. గొప్ప గొప్ప ఆలయాలు.. యాదాద్రి వంటి ఆలయాలను కట్టుకున్నాం. ఆనాడు కాకతీయులు చేసిన పనిని ఈనాడు మళ్లీ కేసీఆర్ చేస్తున్నారు. ఆదివాసీ యోధుడు కుమ్రం భీం వారసత్వం మాది. అందుకే ఆనాడు కుమ్రం భీం జల్ జంగల్ జమీన్ అంటే.. ఈ రోజు అదే జల్ జంగల్ జమీన్ నినాదాన్ని అమలు చేస్తున్న ప్రభుత్వం కేసీఆర్‌ది. పక్కా మాది కుమ్రం భీం వారసత్వమే. బహుజన వీరుడు సర్వాయి పాపన్న వారసత్వం మాది. బడుగు వర్గాలకు బలమిచ్చేలాగా, చేతి, కుల వృత్తులకు కొత్త ఊపిరినిచ్చిన ప్రభుత్వం ఇది. దళిత జాతి వైతాళికుడు భాగ్యరెడ్డి వర్మ వారసత్వం మాది. గురుకుల విప్లవంతో అణగారిన బిడ్డల్లో అక్షర వెలుగులు నింపుతున్న ప్రభుత్వం మాది. వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలు పెట్టి అద్భుతాలు చేస్తున్న ప్రభుత్వం మాది. 1952, 1969, 2001, 2014 ఉద్యమాల్లో అసువులుబాసిన అమరుల ఆశయాల వారసత్వం మాది. శ్రీకాంతాచారి ఆశయాల వారసత్వం మాది. నీళ్లు, నిధులు, నియామకాలు అనే నినాదాన్ని ఇవాళ విధానంగా మార్చుకొని, సమర్థవంతంగా అమలు చేస్తున్న రాజకీయ వారసత్వం మాది. నా తెలంగాణ తల్లి కంజాత వల్లి అని చెప్పిన దాశరథి, కాళోజీల సాంస్కృతిక వారసత్వం మాది. తల్లి తెలంగాణకు జన్మనిచ్చి, అస్థిత్వాన్ని ఆకాశమంత ఎత్తుకు నిలబెట్టిన తనయుడి ప్రభుత్వం, వారసత్వం, కేసీఆర్ నాయకత్వం మా సొంతం అని కేటీఆర్ ఉద్ఘాటించారు.

**మోదీది ఏ వారసత్వం..?...** మా మీద మాట్లాడే మోదీది ఏ వారసత్వం అని కేటీఆర్ ప్రశ్నించారు. మాది జాతిపిత మహాత్మాగాంధీ వారసత్వం. నీది గాంధీని చంపిన గాడ్సే వారసత్వం. దిక్కుమాలిన పార్టీ నీది. మా మీద మాట్లాడే ముందు ఒకటికి రెండు సార్లు ఒళ్లు దగ్గర పెట్టుకోని మాట్లాడితే కాంగ్రెసోళ్లకైనా, బీజేపోళ్లకైనా మంచిది. చేతనైతే ఏం చేస్తారో చెప్పండి.. ఏం చేశారో చెప్పండి అని కేటీఆర్ సూచించారు.

## ఎన్ని ట్రిక్కులు చేసినా.. హ్యాట్రిక్ సీఎం కేసీఆరే : మంత్రి హరీశ్‌రావు



సిద్దిపేట : తెలంగాణలో ప్రతిపక్ష పార్టీలు ఎన్ని ట్రిక్కులు చేసినా.. హ్యాట్రిక్ ముఖ్యమంత్రి కేసీఆరే అని రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు స్పష్టం చేశారు. తెలంగాణలో బీజేపీ లేచేది లేదు.. కాంగ్రెస్ గెలిచేది లేదు అని మంత్రి తేల్చిచెప్పారు. దుబ్బాక పట్టణంలో డబుల్ బెడ్రూమ్ ఇండ్ల వద్ద స్వర్గీయ ఎమ్మెల్యే సోలిపేట రామలింగారెడ్డి విగ్రహాన్ని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డితో కలిసి మంత్రి హరీశ్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్ రావు మాట్లాడుతూ.. రామలింగారెడ్డి విగ్రహాన్ని తన చేతుల మీదుగా ఆవిష్కరిస్తానని ఊహించలేదు. ఇలా జరుగుతుందని అనుకోలేదన్నారు. రామలింగారెడ్డి అంటే వైవిధ్యాల సమ్మేళనం అని పేర్కొన్నారు. గన్నుతో, పెన్నుతో పోరాటం చేసిన వ్యక్తి ఆయన.. అందరి కంటే భిన్నంగా ఉండేవారని మంత్రి గుర్తు చేశారు. రామలింగారెడ్డి ఆత్మ శాంతి చేకూరాలంటే దుబ్బాక గడ్డమీద గులాబీ జెండా ఎగరాలన్నారు. ఉద్యమ స్ఫూర్తితో కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ఉద్యమంలో జోడెడ్లుగా రామలింగారెడ్డి తాను కలిసి పని చేశాం. మానుకోట, మనోహరాబాద్ రైల్వే రోకో, హైదరాబాద్ ఇందిరా పార్కు వద్ద ధర్నా, రాస్తారోకో, నిరసనలు, 48 గంటలు నిద్రాహారాలు మానుకుని చేసిన జ్ఞాపకాలను హరీశ్‌రావు గుర్తు చేసుకున్నారు. తన ఆరోగ్యం లెక్క చేయకుండా పని చేసి లింగన్న ప్రాణాలు కోల్పోయారు. రామలింగారెడ్డి శంకుస్థాపన చేసిన పనులకే బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ రిబ్బన్ కట్ చేస్తున్నారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్ గెలిచాక మూడేళ్లలో చేసిందేమీ లేదు. కానీ, చీరలు, సారెలు ఇస్తుండట. బీజేపీ రఘునందన్ రావు మాయ మాటలు నమ్మి సోలిపేట సుజాత అక్కకు అన్యాయం చేశారు. రఘునందన్ అరచేతిలో వైకుంఠం చూపితే దుబ్బాక ప్రజలుగా నమ్మి మోసపోయాం. ఈ ఎన్నికల్లో మాయ మాటలు నమ్మి మోసపోవద్దు. సోలిపేట కుటుంబానికి అండగా ఉంటా.. రాజకీయంగా నిలబెడతానని మంత్రి హరీశ్ రావు స్పష్టం చేశారు.

## కడియం శ్రీహరిపై మరోసారి రాజయ్య వ్యాఖ్యలు



### ఏమన్నారంటే..?

జనగామ: కడియం శ్రీహరిపై మరోసారి స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. సోమవారం నాడు రాజయ్య బీఆర్ఎస్ పార్టీ కార్యాయలంలో సమావేశ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...“ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను సమన్వయం చేయకుండానే కడియం శ్రీహరి నియోజకవర్గంలో ప్రచారం చేయడం సరికాదు. ఈనెల 6వ తేదీ తర్వాత పార్టీ శ్రేణులను సమన్వయ పరిచే మీటింగ్ పెడతామని మంత్రి కేటీఆర్ చెప్పారు. ఆ మీటింగ్ జరగకుండానే కడియం శ్రీహరి ప్రచారం చేస్తున్నారు. సంక్షేమ పథకాలన్నీ ఎమ్మెల్యే చేతుల మీదుగానే జరగాలి. అభివృద్ధిని అడ్డుకోవడం మంచిది కాదు” అని తాటికొండ రాజయ్య పేర్కొన్నారు.



గాంధీ జయంతి సందర్భంగా గాంధీ భవన్‌లో జాతిపిత మహాత్మా గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న టిపిసిసి ప్రెసిడెంట్ రేవంత్‌రెడ్డి తదితరులు

## అంతా అయిపోయాక

# మేలుకుంటే ఎట్లా!?

హైదరాబాద్ : దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గురించి ఏ మాత్రం అవగాహన ఉన్నా.. ఆయన ఎప్పుడు ఎలా రియాక్టు అవుతారన్న విషయంపై అందరికి అవగాహన ఉండనే ఉంటుంది. గుజరాత్ ముఖ్యమంత్రిగా ఆయన తీరు.. ప్రత్యర్థుల విషయంలో ఎ లా వ్యవహరిస్తారన్న దానిపై పెద్దగా తెలీని వాళ్లు సైతం.. గడిచిన తొమ్మిదిన్నరేళ్లుగా దేశ ప్రధానిగా ఆయన తీరు దేశ ప్రజలకు సుప రిచితం. ఎప్పుడు ఎలా రియాక్టు అవుతారు? అధికారం కోసం ఏదైనా రాష్ట్రాన్ని టార్గెట్ చేస్తే ఏం చేస్తారు? ఎలా చేస్తారన్న విషయాలు అం దరికి తెలిసినవే. మరి.. అందరికి తెలిసిన విషయాల్ని ఎవరికీ తెలీద న్నట్లుగా వ్యవహరిస్తున్న మోడీ తీరు ఇప్పుడు చర్చగా మారింది. తెలంగాణలో బీజేపీ జోరు పెరిగి.. ఈసారి ఎన్నికల్లో సంచలనాలు చోటు చేసుకుంటాయన్న ప్రచారం జోరుగా సాగుతున్న వేళ.. తెలంగాణ రాష్ట్ర బీజేపీ నాయకత్వ విషయంలో మోడీషాలు తీసుకున్న నిర్ణయాలతో పాటు.. అధికార బీఆర్ఎస్ పై సాగించే పోరు విషయంలోనూ వారి తీరు రోటీన్ కు భిన్నంగా ఉండటం తెలిసిందే. బీజేపీ – బీఆర్ఎస్ మధ్య తెర వెనుక డీల్ కుదిరిందన్న ప్రచారం భారీగా సాగటమే కా దు.. సొంత పార్టీ నేతలు సైతం సందేహాలు వ్యక్తం చేసే వరకు విష యం వెళ్లటం తెలిసిందే. దీంతో.. సామాన్యులు సైతం బీజేపీని నమ్మని పరిస్థితి తెలంగాణలో ప్రస్తుతం నెలకొంది. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ కు అధికారం దక్కకుండా ఉండేందుకు కేసీఆర్ తో తెర వెనుక ఒప్పందం జరిగినట్లుగా ప్రచారం సాగుతోంది. ఆ మధ్య వరకు ఢీ అంటే ఢీ అన్నట్లుగా వ్యవహరించి.. కాంగ్రెస్ చేతికి పవర్ రాకూడదన్న ఏకైక ఎజెండాతో బీఆర్ఎస్.. బీజేపీలు వ్యూహరచన చేస్తున్నాయన్న అభిప్రాయం తెలంగాణ వ్యాప్తంగా గడపగడపకు వెళ్లిపోవటంతో.. బీఆర్ఎస్ గ్రాఫ్ ఎలా ఉన్నా.. బీజేపీ గ్రాఫ్ మాత్రం దారుణంగా దెబ్బ తిందన్న మాట బలంగా వినిపిస్తోంది. మరో వారంలో ఎన్నికల నోటిఫికేషన్ కు సంబంధించిన కీలక ప్రకటన వెలువడుతుందన్న వేళలో.. రెండు రోజుల వ్యవధిలో తెలంగాణలోని రెండు ప్రాంతాల్లో ప్రధాని మోడీ పర్యటన చేపట్టటం ఆసక్తికరంగా మారింది. తాజాగా మహబూబన్ నగర్




### తెలంగాణపై మోదీ వరాల జల్లును సెటైరికల్‌గా ట్రీట్ చేస్తున్న నెటిజన్లు

జిల్లాలో ఏర్పాటు చేసిన సభలో పాల్గొన్న ఆయన బోలెడన్ని వరాల్ని ప్రకటించారు. గత ఎన్నికల సమయంలో తెలంగా ణకు పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామన్న హామీని ఐదేళ్లుగా నెరవేర్చని కేంద్రం..తాజాగా తెలంగాణకు వరంగా ప్రకటించటం ఆసక్తికరంగా మారింది. తెలంగాణలో పసుపు బోర్డుతో పాటు.. మహబూబ్ నగర్ లో జాతీయ రహదారులు.. రైల్వే తదితర శాఖలకు సంబంధించిన డెవలప్ మెంట్ పనులకు సంబంధించిన వరాల్ని ప్రకటించారు. అంతేకాదు.. దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న కేంద్ర గిరిజన విశ్వవిద్యాలయాన్ని మంజూరు చేస్తున్నట్లుగా ప్రకటించిన మోడీ.. రూ. 900 కోట్లతో ములుగు జిల్లాలో సమ్మక్క – సారక్క ట్రైబర్ వర్సిటీ పేరుతో ఏర్పాటు చేయనున్నట్లుగా వెల్లడించారు. తెలంగాణలో రూ. 13500 కోట్లతో డెవలప్ మెంట్ పనులకు శ్రీకారం చుట్టినట్లుగా చెప్పిన ప్రదాని.. తెలంగాణలో ఎన్నో జాతీయ రహదారుల నిర్మాణాన్ని చేపట్టినట్లుగా చెప్పారు. తాజాగా చేపట్టిన ప్రాజెక్టులతో మహారాష్ట్ర.. తెలంగాణ.. ఏపీ మధ్య అనుసంధానం మరింత పెరుగుతుందని చెప్పారు. ఇదంతా చూస్తే.. మొత్తం కాలి బూడిదైన తర్వాత ఇన్ని వరాలు కురిపిస్తే మాత్రం ఏమైనా లాభం ఉంటుందా మోడీ? అన్న ప్రశ్న పలువురి నోట వినిపిస్తూ ఉండటం గమనార్హం. దీనిపై నెటిజన్లు సైతం సెటైర్లు వేస్తూ లైకుల ప్రవాహంలో మునిగి తేలుతున్నారు.

## సంపాదకీయం

# జమిలి ఎన్నికలు 2029

జమిలి ఎన్నికలు అన్న మాట 2014 నుంచి వినిపిస్తోంది. కానీ అది అమలు జరగడానికి మాత్రం పుష్కర కాలం పైగా పట్టేట్లు ఉంది. ఇందుకోసం కేంద్రం గతంలో లా కమిషన్ అభిప్రాయాలను తీసుకుంది. లేటెస్ట్ గా దేశంలో ఒకే ఎన్నిక ఒకే విధానం అన్నది అమలు చేస్తారని పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో పూర్వ రాష్ట్రపతి రామ్ నాథ్ కోవింద్ అధ్యక్షతన జమిలి ఎన్నికల మీద ఒక కమిటీని కేంద్రం నియమించింది. ఈ కమిటీ తొలి సమావేశం జరిగింది. ఇక ఇపుడు రంగంలోకి లా కమిషన్ దిగింది. జమిలి ఎన్నికలు 2024లో జరిగేందుకు ఏ విధంగా అవకాశాలు లేవు అని లా కమిషన్ అభిప్రాయపడింది. ఎందుకంటే చూస్తూండగానే ఆరేడు నెలలలోనే ఎన్నికలు ఉన్నాయి. దాంతో ఇంత తక్కువ సమయంలో దేశంలోని అన్ని రాష్ట్రాలు కేంద్ర పాలిత ప్రాంతాలు పంచాయతీ రాజ్ నుంచి పార్లమెంట్ వరకూ ఒకేసారి ఎన్నికలు జరిపించడం అన్నది అసాధ్యం అని లా కమిషన్ పేర్కొంది. నిజానికి జమిలి ఎన్నికలు అంటే రాజ్యాంగ సవరణలు అయిదు చేయాల్సి ఉంది దాంతో పాటు ముందూ వెనకా ఉన్న అనేక రాష్ట్రాల అసెంబ్లీలను ఒకే త్రాటిపైకి తీసుకుని వచ్చి ఎన్నికలు పెట్టాలి. ఆ విధంగా చేయాలి అంటే తప్పనిసరిగా 356 వంటి అధికరణలను కూడా సవరణ చేయాల్సి ఉంటుంది. అలాగే ఫిరాయింపుల చట్టంలోనూ కీలక సవరణలు ఉంటాయి. ఈ విధంగా అనేక రకాలుగా కసరత్తు చేయాలి. వీటికంటే ముందు దేశంలో వివిధ పార్టీలు ఉన్న నేపథ్యంలో అన్ని పార్టీల మధ్య ఏకాభిప్రాయాన్ని సాధించాల్సిన అవసరం ఉంది. రామ్ నాథ్ కోవింద్ నాయకత్వంలోని కమిటీ అందరితో చర్చించాల్సి ఉంది. ఉన్న తక్కువ సమయం ఏ కోశానా సరిపోదు అన్న భావన ఉంది. అందువల్లనే జమిలి ఎన్నికల మీద లా కమిషన్ ఇపుడు అయ్యేది కాదు అని నిక్కచ్చిగా అభిప్రాయం చెప్పింది అని అంటున్నారు. అదే విధంగా 2029 నుంచి జమిలి ఎన్నికలను దేశంలో నిర్వహించడానికి ఒక ఫార్ములాను రూపొందించడానికి కూడా లా కమిషన్ రూపొందిస్తున్నట్లుగా తెలుస్తోంది. ఏది ఏమైనా చూసుకుంటే మాత్రం జమిలి ఎన్నికలు అన్నవి అయితే ఇప్పట్లో జరిగేవి కావు అని అంతా అంటున్నదే. దేశంలో ఎక్కడో ఒక చోట రాష్ట్రాలకు ఏడాదిలో మూడు నాలుగు సార్లు ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అంతా గందరగోళంగా ఉంటోంది. ఇక అసెంబ్లీలో సింపుల్ మెజారిటీ రాని వాతావరణం ఇటీవల కాలంలో చూస్తున్నరు. ఎందుకంటే అనేక పార్టీలు పుట్టుకుని రావడం తీర్పు రెండు మూడుగా విభజింపబడడం వంటి కారణాలే అంటున్నారు. గతంలో అంటే 1952 నుంచి 1968 దాకా పదహారేళ్ల పాటు మూడు నాలుగు ఎన్నికలు జమిలి విధానంలో జరిగాయి అంటే ఏక పాలన దేశంలో రాష్ట్రాలలో ఉంది అన్నది గుర్తు తెచ్చుకోవాలి. ఇక 1968 తరువతనే దేశ రాజకీయాల్లో ఇతర పార్టీల హవా మొదలైంది. దాంతోనే జమిలి ఎన్నికలకు అడ్డుకట్ట పడింది. దీంతో పాటు ఇపుడు కుప్పలు తెప్పలుగా పార్టీలు పుట్టుకుని వస్తున్నాయి. దాంతో మెజారిటీ ఎవరికీ రాకపోతే ఏమి చేయాలి, మధ్యలో అసెంబ్లీ రద్దు అయితే ఏమి చేయాలి, అలాగే ఎన్నికల సభ్యులు పార్టీ మారితే ఏ విధానం అనుసరించాలి. రాష్ట్రపతిపాలన ఎపుడు పెట్టాలి, అయిదేళ్ళకు ఒక మారు ఎన్నికలు జరిగేంతవరకూ ఆయా చోట్ల అసెంబ్లీలు కూలిపోతే మిగిలిన కాలం ఏమి చేయాలన్న దాని మీద లా కమిషన్ ఇపుడు పూర్తి స్థాయిలో అధ్యయనం చేస్తోంది అని అంటున్నారు. మంచి సూచనలు విలువైన సలహాలతో లా కమిషన్ సిఫార్సులు చేస్తూ ముందుకు వస్తుందని ఆ విధంగా మరో అయిదేళ్ళకు అంటే 2029 నాటికి దేశంలో జమీలి ఎన్నికల దిశగా వాతావరణాన్ని ఈ రోజు నుంచే తయారు చేసుకుంటూ వస్తుంది అని అంటున్నారు. సో జమిలి కథ ఇపుడు కాదని అంతా అంటున్నారు.

# కొరవడిన నిర్వహణ.. నీటికి వేదన



మెదక్ : ప్రజల దాహార్తిని తీర్చేందుకు ప్రభుత్వం కోట్లాది రూపాయలు వెచ్చించి పరిష్కారం చూపింది. ఇందుకోసం ప్రతి గ్రామంలో ట్యాంకు నిర్మించి, పైప్‌లైన్ వేసి, కుళాయిలను బిగించారు. అయినా ఇంకా పల్లెల్లో ఎద్దడి నెలకొంది. లీకేజీలతో సరఫరాకు అంతరాయం ఏర్పడుతోంది. జిల్లాలో ఎదురవుతున్న ఇబ్బందులను బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా వెలుగులోకి వచ్చిన అంశాలు ఇలా.. జిల్లాకు సింగూర్ ప్రాజెక్టు నుంచి నీటిని సరఫరా చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా పుల్కల్ మండలం పెద్దారెడ్డిపేట వద్ద మిషన్ భగీరథలో రూ.857.42 కోట్లు వెచ్చించి, ఫిల్టర్‌బెడ్ నిర్మించారు. అయితే తరుచూ సాంకేతిక సమస్యలతో తలెత్తుతున్నాయి. చక్రియాల ఇన్‌టెక్‌వెల్ వద్ద విద్యుత్తు సమస్యతో నర్సాపూర్ నియోజకవర్గంలోని కొన్ని గ్రామాలకు రెండూ, మూడు రోజుల పాటు సరఫరా నిలిపివేస్తున్నారు.

ట్యాంకు నిరుపయోగం : నర్సాపూర్ మండలం జగ్యాతండాలో ట్యాంకు వృథాగా ఉంది. దీనిని వినియోగంలోకి తీసుకువస్తే విద్యుత్తు, సాంకేతిక సమస్యలు తలెత్తితే వినియోగించుకోవచ్చు. దీని పక్కనే ఉన్న బోరు నుంచి ట్యాంకుకు కనెక్షన్ ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. మంజీరా సరఫరా నిలిచిపోయినప్పుడు వ్యవసాయ బోర్లే దిక్కవుతున్నాయి.

మరమ్మతుకు నోచక : శివ్వంపేట మండలం నానుతండాకు సాంకేతిక కారణాలతో మంజీరా నీరు నిలిచిపోయింది. దీంతో స్థానికంగా ఉన్న మూడు బోర్లే ఆధారమయ్యాయి. అయితే వీటిలో రెండు పనిచేయడంలేదు. కొల్చారం, కౌడిపల్లి, వెల్దుర్తి మండలాల్లో మంజీరా నీటి సరఫరా లేని సమయాల్లో అవస్థలు తప్పడంలేదు. ఈ విషయమై డీఈఈ కిషన్ మాట్లాడుతూ.. మంజీరా సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు ఇబ్బందులు తలెత్తుతున్న మాట వాస్తవమేనని పేర్కొన్నారు. టేక్మాల్ మండలం వెంకటాపూర్‌లో ఒకే ట్యాంకు ద్వారా సరఫరా చేయడంతో సరిపోవడం లేదు. గతంలో నిర్మించిన ట్యాంకు ఉపయోగంలో లేదు. మరమ్మతు చేస్తే ప్రయోజనం ఉంటుంది.

పగిలిన పైపులైన్లు : పాపన్నపేట మండలం డాక్య, రాజ్య, అమ్రియా తండాలకు నీటి సరఫరా కావడంలేదు. అధికారులకు విన్నవించినా, స్పందించడం లేదని ప్రజాప్రతినిధులు వాపోతున్నారు. పాపన్నపేట, కొడపాక, కొత్తపల్లి గ్రామాల్లోని పలు కాలనీల్లో సరిపోను రావడంలేదని వాపోతున్నారు. కొన్ని చోట్ల పైపులైన్లు పగిలాయి. మరమ్మతు చేపట్టడంలేదు.

బోర్లే దిక్కు : అల్లాదుర్గం మండలం రాంపూర్ శివారు పెద్దమ్మ ఆలయ సమీపంలో పైపులు లీకై నీళ్ల నిలుస్తున్నాయి. దీంతో కలుషితమవుతున్నాయి. మండలంలోని వెంకటారావుపేట్‌లో బోరు బావుల వద్దకు వెళ్తున్నారు. పెద్దశంకరంపేట తిరుమలపురం కాలనీ, అంబేడ్కర్ చౌక్ వద్ద ఇదే పరిస్థితి. రేగోడ్ మండలం పోచారంలోనూ పదిహేనురోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా, అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం

సింగూర్ ప్రాజెక్టు నుంచి నీటిసరఫరా అవుతోంది. కలుషితమయ్యేందుకు ఆస్కారం లేదు.

సమస్యలున్నా, లీకేజీ గురించి తెలిసినా వెంటనే పరిష్కరిస్తున్నాం. చక్రియాల్ ఉపకేంద్రం నుంచి పరిశ్రమలకు కనెక్షన్లు ఉండడం వల్ల లోడు పెరిగి విద్యుత్తు నిలిచిపోతోంది. ప్రత్యేక హెచ్‌టీ లైన్ వేయనున్నాం.దినేశ్, కిషన్, డీఈఈలు, మిషన్ భగీరథ

# కేంద్రాల్లో ఆహ్లాదం.. చిన్నారుల వికాసం




మెదక్ : జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన అంగన్వాడీ కేంద్రాల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పిస్తున్నారు. ఇందుకోసం 11 ఎంపిక చేశారు. ఒక్కో దానికి రూ.3.50 లక్షల చొప్పున సీఎస్ఆర్ నిధులు మంజూరు చేశారు. జిల్లాలోని సమగ్ర శిశు అభివృద్ధి పథకం(ఐసీడీఎస్) ద్వారా నాలుగు ప్రాజెక్టుల పరిధిలో నర్సాపూర్-5, అల్లాదుర్గం-1, రామాయంపేట-2, మెదక్-3 ఎంపిక చేశారు. నర్సాపూర్ పరిధి రెడ్డిపల్లి, చిన్నచింతకుంట, జక్కపల్లి, నర్సాపూర్-2, మల్కాపూర్ ఉన్నాయి. ఎంపిక చేసిన కేంద్రాలకు రంగులు వేయించడం, ప్రహరీ నిర్మాణం, గోడలపై ఆకట్టుకునేలా బొమ్మలు వేయించడం చేస్తున్నారు. మూడేళ్ల లోపు చిన్నారులకు, గర్భిణులకు, పాలిచ్చే తల్లులకు అవసరమైన పౌష్టికాహారం చిత్రాలను ప్రదర్శిస్తున్నారు. పరిశుభ్రంగా ఉంచి, ఆట వస్తువులను సమకూరుస్తున్నారు. గోడలపై ఆంగ్ల ఉచ్ఛరణకు సంబంధించిన పదాలు, తెలుగు, ఆంగ్లం అక్షరాలు, సీతాకోకచిలుకల బొమ్మలు, అక్షరాలను సూచించే చిత్రాలు, పండ్లు, కూరగాయలు, పూల మొక్కలు, పాలిచ్చే తల్లుల, చిన్నారుల చిత్రాలు ఆకర్షిస్తున్నాయి.

పిల్లల సంఖ్య పెరిగేలా

చిన్నారుల సంరక్షణకు చర్యలు తీసుకోవడం ద్వారా కేంద్రాలకు వచ్చే పిల్లల సంఖ్య పెరిగే అవకాశాలున్నాయి. గర్భిణులు, పాలిచ్చే తల్లులు కేంద్రాలకు వచ్చినప్పుడు కొంత సమయాన్ని వెచ్చించేలా చర్యలు తీసుకుంటున్నారు. చిన్నారుల పరిస్థితిపై సీడీపీవోలు, పర్యవేక్షకులు, అంగన్వాడీ ఉపాధ్యాయినులు ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. పోషణ్ అభియాన్, ఆరోగ్యలక్ష్మీ పథకం అమలు చేస్తున్నారు. ఆరు నెలల నుంచి ఏడాది లోపు పిల్లలు తీసుకోవాల్సిన ఆహార పదార్థాలు, కేంద్రాల్లో ఇచ్చే బాలామృతాన్ని బిడ్డకు ఎలా అలవాటు చేయాలో కూడా చైతన్యపరుస్తున్నారు. పిల్లల బరువు ఎత్తు కొలతలు, తక్కువ బరువు ఉన్నవారి పోషణ ఆరోగ్యం, విద్యపై అవగాహన కల్పిస్తున్నారు. కేంద్రాల ఆవరణలో పెరటి తోటల పెంపకం చేపడుతున్నారు.

ఆకర్షణీయంగా ఉండాలన్నదే లక్ష్యం

కొన్ని కేంద్రాలను ఎంపిక చేసుకుని ఆదర్శంగా తీర్చిదిద్దుతున్నాం. తద్వారా సాధించిన ఫలితాలను గమనించి భవిష్యత్తులో అన్ని కేంద్రాలను ఇదే విధంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తాం. వీటిని నిరంతరం పర్యవేక్షిస్తున్నాం. వసతుల్లో ఆదర్శంగా ఉంచడంతోపాటు, సేవల్లోనూ మెరుగుగా నిలిపేందుకు ప్రయత్నిస్తున్నాం.బ్రహ్మాజీ, జిల్లా అధికారిణి

# మద్నూర్-బోధన్ జాతీయ రహదారి పనులకు గ్రీన్ సిగ్నల్

కామారెడ్డి : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో మరో జాతీయ రహదారి నిర్మాణ పనులకు కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఎన్‌హెచ్ 161 జాతీయ రహదారి పనులు చేపట్టెందుకు పరిపాలన అనుమతులను ఇస్తూ జీవోను జారీ చేసింది. అంతేకాకుండా ఈ పనులు చేపట్టేందుకు రూ.429కోట్లను సైతం మంజూరు చేసింది. నిజామాబాద్ జిల్లాలోని బోధన్ నుంచి మద్నూర్ వరకు ఉన్న రెండు లైన్ల ప్రధాన రహదారిని నాలుగు లైన్ల జాతీయ రహదారిగా మార్చనున్నారు. ఇటీవల జహీరాబాద్ ఎంపీ బీబీ పాటిల్ మద్నూర్-బోధన్ జాతీయ రహదారి పనులు చేపట్టాలని కేంద్రమంత్రి నితిన్‌గడ్కరికి పలుమార్లు విన్నవిస్తూ వచ్చారు. దీంతో కేంద్రం ఈ రహదారి పనులకు అనుమతులు జారీ చేయడంపై ఎంపీ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. నాలుగులైన్ల జాతీయ రహదారి పనులు పూర్తయితే రవాణా సౌకర్యం మరింత మెరుగుపడనుంది. ఎన్నో ఏళ్ల నుంచి ఉమ్మడి జిల్లాల స్థానిక ప్రజలు ఎదురుచూస్తున్న మద్నూర్-బోధన్ జాతీయ రహదారి కల త్వరలోనే నెరవేరనుంది.

గతంలోనే ఎన్‌హెచ్ 166 జాతీయ రహదారికి శంకుస్థాపన

భైంసా-బాసర-బోధన్-మద్నూర్ వరకు జాతీయ రహదారిని ఏర్పాటు చేయాలని గతంలోనే కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ 166 బీబీ నామకరణం చేసి మంజూరు చేసింది. అయితే ఏడాది కిందట మొదటి విడత కింద భైంసా-బాసర-బోధన్ వరకు ఎన్‌హెచ్ 161 జాతీయ రహదారి విస్తరణ పనులకు ప్రధాని నరేంద్రమోదీ శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఈ పనులు కొనసాగుతున్నాయి. ఇప్పటికే సర్వే పూర్తిచేసి భూ సేకరణలో ఉన్నారు. దీంతో పాటు మద్నూర్ వరకు సైతం ఇదివరకే సర్వే పూర్తి చేశారు. బోధన్ నుంచి మద్నూర్ వరకు ప్రస్తుతం రెండు లైన్ల రహదారి ఉంది. ప్రస్తుతం ఈ రహదారి విస్తరణకు పరిపాలన అనుమతులు రావడంతో ఆయా మండలాల స్థానిక గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. దీంతో మద్నూర్ ప్రజలు



తమ రోడ్డు కూడా పూర్తవుతుందని ఎదురుచూస్తూ వచ్చారు. బోధన్ నుంచి మద్నూర్ వరకు 161 జాతీయ రహదారి పనులకు సైతం కేంద్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేశారు.

76 కి.మీ.ల వరకు నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల పరిధిలోని జుక్కల్, బాన్సువాడ, బోధన్ నియోజకవర్గాలను కలుపుతూ కేంద్ర ప్రభుత్వం ఎన్‌హెచ్ 161 బీబీ జాతీయ రహదారిని గతంలోనే మంజూరు చేసింది. ఈ జాతీయ రహదారి ఉమ్మడి జిల్లాల పరిధిలో బోధన్, కోటగిరి, మద్నూర్ మండలాల పరిధిలోని పలు గ్రామాలను కలుపుతూ నిర్మాణం చేపట్టనున్నారు. సుమారు 76 కి.మీల మేర ఈ జాతీయ రహదారి పనులు కొనసాగనున్నాయి. ఉమ్మడి జిల్లాల పరిధిలో 5 మండలాలైన బోధన్, కోటగిరి, రూద్రుర్, పొతంగల్, బీర్కూర్, డీంగ్లి, మద్నూర్ వరకు ఈ జాతీయ రహదారి నిర్మాణ పనులు జరగనున్నాయి. అయితే 2018లోనే ఈ జాతీయ రహదారి పనులకై సర్వే సైతం పూర్తి చేయడమే కాకుండా హద్దురాళ్లను సైతం ఏర్పాటు చేశారు. ప్రస్తుతం బోధన్, మద్నూర్ వరకు జాతీయ రహదారి పనులకై కేంద్ర ప్రభుత్వం పరిపాలన అనుమతులు జారీ చేయడమే కాకుండా రూ.429 కోట్ల నిధులను మంజూరు చేయడంతో పనులు పుంజుకునే అవకాశాలు ఉన్నాయి. అయితే రోడ్డు విస్తరణకు భూ సేకరణ చేపట్టాల్సి ఉంది.

# కష్టం విలువ సున్నా

యాదాద్రి : గడ్డం ఎల్లారెడ్డి. మోత్కూరు మునిసిపాలిటీలో నివసిస్తున్న కౌలు రైతు గడ్డం ఎల్లారెడ్డి మోత్కూరు సమీపంలో 13 ఎకరాల భూమి కౌలుకు తీసుకుని వరి సాగుచేస్తున్నాడు. ఎకరాకు రూ.27వేల వరకు పెట్టుబడి పెట్టాడు. మొత్తం 13 ఎకరాలకు రూ.3,51,000 పెట్టుబడి వ్యయం అయింది. వరి పంట ఏపుగా పెరిగి కోతకు వచ్చింది. మార్కెట్లలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం కాకపోవడంతో ఉగాది పండుగ తరువాత పంట నూర్పిడి చేద్దామనుకున్నాడు. ఈ నెల 19న రాత్రి కురిసిన వడగళ్ల వర్షానికి సగానికి పైగా ధాన్యం రాలింది. అయితే ప్రభుత్వం తాజాగా, ఎకరాకు రూ.10వేలు పంట నష్టపరిహారం ప్రకటించింది. దీంతో అతడికి రూ.1,30,000 పరిహారంగా అందనుంది. అయితే పెట్టుబడిలో సగం కూడా రావడం లేదని, చేసిన కష్టం వృథా అయిందని అతడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

అకాల వర్షాలు రైతుల ఆశలపై నీళ్లు చల్లాయి. ఆరుగాలం శ్రమించిన రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చాయి. ఈనెల 18, 19న ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వానలు కురిశాయి. దీంతో వరితో పాటు పండ్ల తోటలకు నష్టం వాటిల్లింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 22,858 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. యాదాద్రి జిల్లాలో 8,275 ఎకరాలు, సూర్యాపేట జిల్లాలో 12,873, నల్లగొండ జిల్లాలో 1,710 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది.

యాదాద్రి జిల్లాలో ఆత్మకూరు మండలంలోని 15 గ్రామాలు, గుండాలలో తొమ్మిది, అడ్డగూడూరులో మూడు, మోత్కురులో మూడు, వలిగొండ ఐదు, రాజపేటలో రెండు, మోటకొండూరులో ఐదు, రామన్నపేటలో మూడు, చౌటుప్పల్‌లో 10 గ్రామాల్లో వడగళ్లు కురిశాయి. ఈ నెల 18న కురిసిన వర్షానికి 4,343 ఎకరాల్లో, రెండోరోజు కురిసిన వర్షానికి 3,800 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి పంట నష్టాన్ని అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా 3,755 మంది రైతులకు చెందిన 8,275 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయని, దీంతో రూ.17.13కోట్ల మేర నష్టం వాటిల్లిందని వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు అంచనా వేశారు. ఈ మేరకు నివేదికను ప్రభుత్వానికి నివేదించారు.

సూర్యాపేట జిల్లాలో తుంగతుర్తి, తిరుమలగిరి మండలాల్లోని తొమ్మిది గ్రామాల్లో అధికంగా పంట నష్టం వాటిల్లింది. తుంగతుర్తి, తిరుమలగిరి మండలాల్లోని వెలిశాల, నెలిగొండతండా, కోకియాతండా, బొల్లికుంటతండా, మామిడాల, గొట్టిపర్తి, జలాల్‌పుర్, తాటిపాముల గ్రామాల్లో అధికంగా పంటలు దెబ్బతిన్నాయి. గొట్టిపర్తి గ్రామంలో అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు పర్యటించి పంట నష్టాన్ని పరిశీలించారు. సూర్యాపేట ఆర్డీవో రాజేంద్రప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి డి.రామారావునాయక్ తిరుమలగిరి మండలంలో పర్యటించి పంట నష్టాన్ని అంచనా వేశారు. జిల్లా వ్యాప్తంగా వరి 11,495 ఎకరాలు, మొక్కజొన్న 42 ఎకరాలు, మామిడి 1,120 ఎకరాలు, మిరప 216 ఎకరాల్లో దెబ్బతిన్నట్టు అధికారులు ప్రాథమికంగా అంచనావేశారు.

నల్లగొండ జిల్లాలో మర్రిగూడ, నాంపల్లి మండలాల్లో భారీగా వడగళు కురవడంతో రైతులు అధికంగా పంట నష్టపోయారు. జిల్లా వ్యాప్తంగా 1,060 ఎకరాల్లో వరి, 650 ఎకరాల్లో మామిడి, పుచ్చ, మిర్చి, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి.

పరిహారం ఇంతేనా?

అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలకు ప్రభుత్వం ప్రకటించిన పరిహారంపై రైతులు పెదవి విరుస్తున్నారు. ఎకరా వరి సాగు చేయాలంటే దున్నకం, విత్తనాలు, నాట్లు, కలుపుతీత మొదలు పంట చేతికొచ్చేవరకు సుమారు రూ.27వేల వరకు పెట్టుబడి వ్యయం అవుతోంది. అయితే ప్రభుత్వం మాత్రం ఎకరాకు రూ.10వేలు ప్రకటించటంతో పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట నష్టాన్ని వ్యవసాయ, రెవెన్యూ అధికారులు తక్కువ చూపి అన్యాయం చేశారని చాలామంది రైతులు వాపోతున్నారు. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకుండా ఫోన్ల ద్వారానే సమాచారాన్ని సేకరించారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు హడావుడిగా అంచనావేయడం వల్ల పూర్తిస్థాయిలో పరిహారం దక్కేలా లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 33శాతం మేర పంట నష్టం వాటిల్లితేనే అధికారులు లెక్కలోకి తీసుకుంటారు. అయితే 33శాతం లోపు నష్టపోయిన తమకు దిక్కెవరని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.10వేలు ఏమాత్రం సరిపోవని, పెట్టుబడులకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

22,858 ఎకరాల్లో దెబ్బతిన్న పంటలు

అకాల వర్షాలకు ఉమ్మడి జిల్లాలో 22,858 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. యాదాద్రి జిల్లాలో యాసంగిలో 2,90,527 ఎకరాల్లో రైతులు వరి సాగు చేశారు. అకాల వర్షాలకు 8,148ఎకరాల్లో వరి పంటలు దెబ్బతిన్నాయి. దీంతో రైతులకు రూ.16.62కోట్ల మేర నష్టం వాటిల్లింది. ఇక కూరగాయలు, ఇతర పంటలు 182.38ఎకరాల్లో దెబ్బతినగా, రూ.51లక్షల మేర నష్టం వాటిల్లినట్టు అధికారులు గుర్తించారు. మామిడి 154 ఎకరాలు, పచ్చి మిర్చి 3, ఎర్రమిర్చి 2, నిమ్మ 8.75, టమాటా 1.63, బొప్పడి 1.5, వంకాయ 0.5, సొరకాయ 1.5, బీరకాయ 0.5, పుచ్చకాయ 7ఎకరాల్లో పంటనష్టం వాట్లిల్లింది. ఈ నెల 18న జిల్లాలో 9.4మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా భువనగిరి మండలంలో 43.1మి.మీ, యాదగిరిగుట్టలో 37.78మి.మీ, బొమ్మలరామారంలో 25.8మి.మీ, అత్యల్పంగా గుండాలలో 0.8మి.మీ వర్షపాతం నమోదైంది. అదేవిధంగా 19న జిల్లాలో 28.8మి.మీ సగటు వర్షపాతం నమోదైంది. అత్యధికంగా యాదగిరిగుట్ట మండలంలో 76.8మి.మీ, భువనగిరిలో 71.4మి.మీ, బొమ్మలరామారంలో 66.4మి.మీ, బీబీనగర్‌లో 45.6మి.మీ, అత్యల్పంగా రామన్నపేట మండలంలో 0.8మి.మీ వర్షపాతం నమోదైంది.

సూర్యాపేట జిల్లాలో తుంగతుర్తి, తిరుమలగిరి మండలాల్లో 7,859 మంది రైతులు 12,873 ఎకరాల్లో పంట నష్టపోయినట్టు అధికారులు గుర్తించారు. 7,474 మంది రైతులు 11,495 ఎకరాల్లో వరి, 42 మంది రైతులు 42 ఎకరాల్లో మొక్కజొన్న, 202 మంది రైతులు 1,120 ఎకరాల్లో మామిడి, 141 మంది రైతులు 216 ఎకరాల్లో మిరప పంటను నష్ట పోయారు. ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఎకరాకు రూ.10వేల చొప్పున పరిహారం విడుదల చేస్తే జిల్లాకు రూ.12,87,30,000 మంజూరు కానున్నాయి.

నల్లగొండ జిల్లాలో మర్రిగూడ, నాంపల్లి, చిట్యాల మండలాల్లో వడగళు కరవడంతో రైతులు నష్టపోయారు. జిల్లా వ్యాప్తంగా 1,710 ఎకరాల్లో పంట నష్టం వాటిల్లింది. 1,060 ఎకరాల్లో వరి, 650 ఎకరాల్లో మామిడి, పుచ్చ, మిర్చి, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి.

పంటనష్టం ప్రభుత్వానికి నివేదించాం : కె.అనురాధ, జిల్లా వ్యవసాయాధికారిజిల్లాలో ఇటీవల కురిసిన వర్షాలకు 33శాతానికి పైగా దెబ్బతిన పంటలను పరిగణనలోకి తీసుకున్నాం. అవి 8,275ఎకరాల వరకు ఉంటుందని అంచనా. ఈ మేరకు వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారు లు పంటనష్టంపై సర్వే నిర్వహించారు. పంట నష్టం రూ.17.13కోట్ల మేర వాటిల్లిందని ప్రాథమిక అంచనా వేసి పంటల వారీగా ప్రభుత్వానికి నివేదిక పంపించాం.

# రహదారుల విస్తరణ.. వసతులకు పెద్దపీట

ధర్మారం : దినాదినాభివృద్ధి చెందుతున్న ధర్మారం మండలకేంద్రం క్రమంగా పట్టణ రూపును సంతరించుకుంటోంది. ఇప్పటికే ధర్మారం–పెద్దపల్లి రహదారి విస్తరణ పనులు జరుగుతుండగా తాజాగా కరీంనగర్ మార్గం విస్తరణకు నిధులు మంజూరయ్యాయి. ప్రయాణ ప్రాంగణం అభివృద్ధికి నిధులు వచ్చాయి. ఈ పనులన్నీ పూర్తయితే ధర్మారం పట్టణానికి కొత్త శోభ రానుంది.

ప్రధాన మార్గాల్లో తొలగనున్న కష్టాలు

రెండు వరుసలుగా ఉన్న ధర్మారం–పెద్దపల్లి మార్గంలో పట్టణంలోని ప్రధాన కూడలి నుంచి ఎస్సారెస్పీ డి 83బి కాలువ వరకు నాలుగు వరుసలుగా విస్తరణ, విభాగిని నిర్మాణం, సెంట్రల్ లైటింగ్, ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నుంచి ఒకసారి రూ. 2 కోట్లు, రెండో విడతలో రూ. 3.10 కోట్లు కేటాయించారు. ప్రస్తుతం పనులు తుది దశలో ఉన్నాయి. కాగా వరంగల్–రాయట్నం రాష్ట్ర రహదారిని ధర్మారంలో ఇరువైపులా విస్తరించేందుకు ఎస్‌డీఎఫ్ నిధులు రూ. 14.50 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో పట్టణంలో 2.4 కిలోమీటర్ల మేర రహదారిని నాలుగు వరుసలుగా విస్తరించడంతో పాటు ఇరువైపులా మురుగు కాలువలు, మధ్యలో డివైడరు నిర్మించనున్నారు. కరీంనగర్–రాయపట్నం రహదారి రెండు వరుసలుగా ఉన్నప్పటికీ పట్టణ పరిధిలో స్థానిక వాహనాల రద్దీ కారణంగా, ఇతర ప్రాంతాలకు వెళ్లే వాహనాల రాకపోకలకు ఇబ్బందిగా ఉండేది. రహదారి విస్తరణతో ట్రాఫిక్ సమస్యలు తొలగనున్నాయి.

శాశ్వత భవనాలు



పట్టణంలో చేపల మార్కెట్ నిర్మాణానికి రూ. 50 లక్షలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.56 కోట్లు, గ్రంథాలయ భవన నిర్మాణానికి డీఎంఎఫ్‌టీ నిధులు రూ. 25 లక్షలు మంజూరయ్యాయి. పట్టణంలోని అంతర్గత రహదారులపై సీసీ నిర్మాణం దాదాపు పూర్తయింది. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో ‘మన ఊరు–మనబడి’లో భాగంగా వసతులు అందుబాటులోకి వచ్చాయి. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారి కోసం అంబేద్కర్ స్టడీ సర్కిల్ భవన నిర్మాణానికి నిధులు కేటాయించారు.

అలసత్వం వీడితేనే మేలు

ధర్మారం పట్టణాభివృద్ధికి విరివిగా నిధులు మంజూరైనా పనులు చేయించడంలో ఆయా శాఖల ఇంజినీరింగ్ అధికారులు తాత్సారం చేస్తున్నారనే విమర్శలున్నాయి. గుత్తేదారులతో సకాలంలో పనులు పూర్తి చేయించడంలో అధికారులు విఫలమవుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారిస్తే పనులు నాణ్యతతో సకాలంలో పూర్తవుతాయి.

మారనున్న బస్టాండు రూపురేఖలు

పరిసర మండలాలకు కూడలిగా ఉన్న ధర్మారం పట్టణంలోని బస్టాండు నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉంటుంది. వివిధ అవసరాలకు, సామగ్రి కొనుగోలుకు వివిధ గ్రామాల నుంచి నిత్యం అధిక సంఖ్యలో ఇక్కడికి వస్తుంటారు. బస్టాండు అభివృద్ధికి రూ. 1.50 కోట్లు మంజూరు కావడంతో రూపురేఖలు మారనున్నాయి. ప్రధాన రహదారిని ఆనుకొని రెండు వైపులా దుకాణ సముదాయాలు నిర్మించనున్నారు. దీంతో చిరు వ్యాపారులకు మడిగెలు అందుబాటులోకి రానుండగా ఆర్టీసీకి ఆదాయం వస్తుంది. దీనికి తోడు ప్రయాణ ప్రాంగణంలో అపరిశుభ్రత తొలగనుంది.

# అక్రమ దందా.. కొరవడిన నిఘా..!

ఆలేరు : యాదాద్రి భువనగిరి జిల్లాలో పేలుడు పదార్థాల తయారీ, నిల్వలు, రవాణాపై స్థానిక పోలీసుల నిఘా కొరవడిందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఎస్వోటీ పోలీసులు దాడుల చేస్తూ కేసులు నమోదు చేస్తున్నప్పటికీ.. కొద్ది రోజుల అనంతరం మళ్లీ యథావిధిగా కొనసాగుతున్నాయి. క్వారీలు, వెంచర్లలో బండరాళ్లను తొలగించేందుకు నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాలను వినియోగిస్తున్నారు.

కొందరికే ..జిల్లాలో పేలుడు పదార్థాలతో పాటు, అమ్మోనియం నైట్రేట్ స్టోరేజీ పాయింట్లు ఉన్నాయి. కొన్నింటికి అనుమతులు ఉండగా..మరికొన్నింటికి అనుమతులు లేనట్లు సమాచారం. గతంలో వరంగల్, రంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో పట్టుబడిన కొన్ని పేలుడు పదార్థాలు యాదాద్రి జిల్లా నుంచి సరఫరా అయ్యాయి. ఆత్మకూరు(ఎం) మండలం పల్లెర్లలో కుక్క పేలుడు పదార్థాన్ని కొరకడంతో మృత్యువాత పడిన ఘటనలు అప్పట్లో సంచలనం కల్గించాయి. రాష్ట్రంలో ఏ ప్రాంతంలో పేలుడు పదార్థాలు పట్టుబడినా..వీటిలో కొన్నింటికి యాదాద్రి భువనగిరి జిల్లా మూలాలు ఉంటుండటం గమనార్హం. జిలెటిన్‌స్టిక్స్, డిటోనేటర్లు, మేగ్జిన్ బాక్సులు, కనెక్టింగ్ తీగ, బ్లాస్టింగ్ వైరు లాంటివి జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు తరలుతున్నాయి.

లెక్కలేవీ?జిల్లా నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తున్న పేలుడు పదార్థాలపై పోలీసుల నిఘా కొరవడింది. డీలర్ల నుంచి క్షేత్రస్థాయికి తరలుతున్న పేలుడు పదార్థాలపై లెక్కలు సరిగా ఉండటం లేదని సమాచారం. రవాణా చేసే వాహనం, ఆయా మార్గంలో ప్రయాణించేందుకు అనుమతులు ఉండాలి. కానీ కొన్ని సమయాల్లో అనుమతులు లేకుండానే పేలుడు పదార్థాలను తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

దరఖాస్తు చేయాలి..పేలుడు పదార్థాల వినియోగానికి పోలీసుల నుంచి విధిగా అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. రైతులు, భూమి యజమాని తమ పొలంలోని బండరాళ్లను తొలగించేందుకు ముందుగా పోలీసు కమిషనర్, జిల్లా ఎస్పీకి దరఖాస్తు చేయాలి. సదరు ప్రాంతం బ్లాస్టింగ్‌కు అనుకూలంగా ఉందా? అనే విషయాన్ని ఏసీపీ లేదా సీఐ ర్యాంకు స్థాయి అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి నివేదిక ఇస్తారు. నివేదిక ఆధారంగా బ్లాస్టింగ్‌కు అనుమతి ఇస్తారు. ఇందుకు రైతులు, వ్యక్తులు కొంత రుసుం చెల్లించాల్సి ఉంటుంది. బ్లాస్టింగ్ చేయాలనుకునే సంస్థ, వ్యక్తులకు లైసెన్సు ఉండాలి. అనుమతి లేనివారు బ్లాస్టింగ్ చేస్తే ఎక్స్‌ప్లోజివ్స్ చట్ట ప్రకారం శిక్షార్హులు.

2023 సెప్టెంబరు 8న యాదగిరిగుట్టలో పోలీసులు తనిఖీలు చేస్తుండగా.. డి.వినోద్ అనే వ్యక్తి వద్ద ఆరు జిలెటిన్‌స్టిక్స్, 5 డిటోనేటర్స్ దొరికాయి. విచారణలో శివరాత్రి మహేష్ తనకు విక్రయించాడని చెప్పడంతో.. రాయిగిరిలోని మహేష్ ఇంటిని సోదా చేయగా 239 జిలెటిన్‌స్టిక్స్, 666 డిటోనేటర్లు దొరికాయి. ఇద్దరి పైనా కేసులు నమోదు చేశారు.

2019 ఆగస్టులో శంషాబాద్ సమీపంలో బిల్లు, వేబిల్లు లేకుండా అమ్మోనియం నైట్రేట్ తరలిస్తున్న వాహనాన్ని అక్కడి పోలీసులు పట్టుకున్నారు. సోడియం నైట్రేట్ పేరుతో పేలుడుకు ఉపయోగించే అమ్మోనియం నైట్రేట్‌ను అక్రమంగా రవాణా చేశారు. విచారణలో భువనగిరి మండలంలోని ఒక ఎక్స్‌ప్లోజివ్స్ కంపెనీ నుంచి అక్రమంగా తరలినట్లు తేలింది.

జిల్లాలోని బొమ్మలరామారం మండలం మైలారం, రాంలింగంపల్లి, నాగినేనిపల్లి, పెద్దపర్వతాపూర్, బీబీనగర్ మండలం జమీలాపేట, నెమరగొమ్ముల, జియాపల్లి, ఆలేరు మండలం శ్రీనివాసపురంలోని క్రషర్స్‌లో పేలుడు పదార్థాలను వినియోగిస్తూ కొండలు, గుట్టలను పేల్చివేస్తున్నారు. దీంతో సమీపంలోని ఇళ్లకు బీటలు ఏర్పడుతున్నాయి.

# గ్రామాల సమగ్రాభివృద్ధికి పునాది



జగిత్యాల : కూడు, గుడ్డ, విద్య, వైద్యం, ఉపాధి, మౌలిక వసతుల కల్పనతోపాటు ఆదాయాభివృద్ధి సాధిస్తే ఆ గ్రామం అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినట్లే.. గతంతో పోల్చితే రోజురోజుకు గ్రామాలు వృద్ధి చెందుతుండగా రాష్ట్రంలో గంగిదేవిపల్లి, అంకాపూర్ గ్రామాలు మరింత ప్రత్యేకత చాటుకున్నాయి. అన్ని గ్రామాలు తమ ప్రత్యేకత చాటుకునేలా పంచాయతీరాజ్ డెవలప్‌మెంట్ ఇండెక్స్ తయారీకి శ్రీకారం చుట్టింది. జిల్లాకు ఒక గ్రామాన్ని ఎంపిక చేసి గ్రామ స్వరూపం, అవసరాలు, సమస్యలు, అభివృద్ధికి మార్గాలు ఇలా అన్ని శాఖల సమన్వయంతో 646 ప్రశ్నలతో కూడిన పట్టికతో ఒక ఇండెక్స్ తయారు చేయనున్నారు. ఇందుకోసం ఉమ్మడి జిల్లాలోని నాలుగు గ్రామాలను ఎంపిక చేశారు. జగిత్యాల గ్రామీణ మండలం చల్‌గల్, పెద్దపల్లి జిల్లాలోని ఎలిగేడు మండలం సుల్తాన్‌పూర్, కరీంనగర్ జిల్లాలోని తిమ్మాపూర్, రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ఇల్లంతకుంట, జంగంరెడ్డిపల్లె గ్రామాలను ఎంపిక చేశారు.

646 ప్రశ్నలతో నివేదిక తయారు..ఎదైనా పనిని ఒక ప్రణాళిక తయారు చేసుకుంటే సులువుగా పూర్తి చేయవచ్చు. అలాగే గ్రామాన్ని అన్నిశాఖల సమన్వయంతో తీర్చిదిద్దు కుంటే అన్ని రంగాల్లో అభివృద్ధి చేయవచ్చు. ఉదహరణకు గ్రామంలో రైతులు ఎంత మంది ఉన్నారు..రుణాలు తీసుకున్న వారు ఎంత మంది.. రుణాలు ఏ విధంగా ఉపయోగపడ్డాయి. రుణాలు సరిపోతు న్నాయా లేదా? పంటల పరిస్థితి, ఎలాంటి పంటలు వేస్తే లాభదాయకంగా ఉంటుంది. నీటి వినియోగం, సూక్ష్మసేద్యం, రైతు వేదికల ఉపయోగం, తెగుళ్లు, విపత్తు జరిగినప్పుడు కలిగే నష్టం, భవిష్యత్‌లో ఏం చేయాలి, ఉద్యాన, ఆర్గానికి పంటలు ఇలా వ్యవసాయానికి సంబంధించి పూర్తి సమాచారాన్ని వ్యవసాయధికారులు రూపొందిస్తారు. గ్రామంలో రహదారుల పరిస్థితి, ఎంత దూరం ఉన్నాయి, ఇంకా ఎంత అవసరం అనే విషయాన్ని రూపొందిస్తారు. అలాగే శిశు సంక్షేమశాఖ ద్వారా గ్రామంలో గర్భిణులు ఎంత మంది, అందులో వయసుల వారీగా నమోదు, పౌష్టికాహారం అందుతుందా లేదా.. అందని వారు ఎంత మంది, ఒక్కరు కూడా పౌష్టికాహార లోపం లేకుండా ఉండాలంటే ఏం చేయాలి.. ఇలా ప్రతి అంశంతో కూడిన ప్రశ్నలకు సమాధానాలు వెతకనున్నారు. విద్య, వైద్యం, ఉపాధి, తాగునీటి పరిస్థితి, పశు వైద్యం, గ్రామంలో గ్రంథాలయం, ఎస్సీ, ఎస్టీల కుటుంబాల ఆర్థిక పరిస్థితి, వారికి అందుతున్న ఉపాధి, మొక్కల పెంపకం, పారిశుద్ధ్యం, పరిశ్రమలు, విద్యుత్తు అవసరాలు, మరుగుదొడ్ల వినియోగం, విపత్తు నిర్వహణ, పిల్లలకు టీకాల పంపిణీ, చేపల ఉత్పత్తి, చెరువులు వాటి పరిస్థితి, కుటుంబాల ఆర్థిక పరిస్థితి, ఉపాధి అవకాశాలు, పింఛన్ ఇలా ప్రతి అంశంపై 646 ప్రశ్నలతో నివేదికను తయారు చేయనున్నారు. పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ నుంచి ఆదేశాలు అందగా రెవెన్యూ, విద్య, వైద్యం, వ్యవసాయం, శిశు సంక్షేమం, సెర్ప్, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ 29 శాఖలఈ నివేదికను రూపొందిస్తారు. వారంలోపు ఈ నివేదికను కమిషనర్ కార్యాలయానికి పంపనున్నారు.

# కార్యాలయాల కేంద్రం ధరూర్‌క్యాంపు



జగిత్యాల : శ్రీరామసాగర్ జలాశయం పరిధి జగిత్యాలలోని ధరూర్‌క్యాంపు స్థలాలు ప్రస్తుతం ప్రభుత్వ కార్యాలయాలకు నెలవుగా మారి కొత్తశోభను సంతరించుకున్నాయి. 1963 జులై 26న భారత మొదటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ చేతులమీదుగా శ్రీరామసాగర్ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభంకాగా తదుపరి ప్రాజెక్టు పరిధిలోని చాలా ప్రాంతాల్లోనూ స్థలాలను సేకరించారు. ఈ క్రమంలో జగిత్యాల పట్టణ, ధరూరు గ్రామ శివారులోని రైతులు, స్థానికుల నుంచి దాదాపు 250 ఎకరాల వరకు స్థలాన్ని సేకరించి ధరూర్‌క్యాంపు పేరిట ప్రాజెక్టు పరిపాలన భవనాలు, అధికారులు, సిబ్బంది నివాస గృహాలను నిర్మించారు. ఎస్సారెస్పీ సీఈ కార్యాలయాన్ని జగిత్యాలలో చాలా సంవత్సరాలు నిర్వహించగా తదుపరి కరీంనగర్‌కు తరలించారు. ప్రభుత్వం అన్ని నీటి పారుదల అనుబంధ శాఖలను విలీనంచేసి జలవనరుల శాఖను ఏర్పాటు చేయగా జగిత్యాలకు సీఈ పోస్టును కేటాయించి కార్యాలయాన్ని ధరూర్‌క్యాంపులోనే ఏర్పాటు చేశారు.

ఎస్సారెస్పీ ఇతర ప్రభుత్వ స్థలాల్లో గతంలోనే బస్‌డిపో, కేంద్రరాష్ట్ర గోదాములు, ఆగ్రోస్, పాలకేంద్రం, ప్రధాన విద్యుత్ ఉపకేంద్రం, సబ్‌డివిజన్ పోలీసు, రూరల్‌ఠాణా, న్యాయమూర్తుల నివాసగృహాలు, రిజిస్ట్రేషన్ కార్యాలయం, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ భవనం, వాటర్ పంపింగ్‌స్టేషన్, రెండు విద్యార్థుల వసతిగృహాలు, ఉన్నత పాఠశాల తదితరాలను ఏర్పాటు చేశారు. తదుపరి నర్సింగ్ కళాశాల, ప్రభుత్వ ఐటీఐ, పోలీసు శిక్షణ కేంద్రం ఏర్పరచగా ఐఎంఏ భవన్, అంబేద్కర్ భవన్ తదితరాలకు స్థలాన్నిచారు. 2016లో జగిత్యాల జిల్లాకేంద్రంగా ఏర్పడగా ధరూర్‌క్యాంపులోని ఎస్సారెస్పీ భవనాలు, ఇతర భవనాల్లోనే ప్రభుత్వ జిల్లా కార్యాలయాలను ఏర్పాటుచేశారు. ఎస్సారెస్పీ నుంచి గతంలో కొంతస్థలాన్ని గృహనిర్మాణశాఖకు ఇవ్వగా హౌజింగ్‌బోర్డు పేరిట ఈ స్థలంలో ఇళ్లను నిర్మించి విక్రయించారు. ప్రస్తుతం ఆగ్రోస్,

గోదాముల స్థలంలో వైద్యకళాశాలను నిర్మిస్తున్నారు.

రాష్ట్రంలోని చాలా జిల్లాల్లో నూతన కలెక్టరేట్లు పట్టణాలకు దూరంగా ఉండగా జగిత్యాలలో మాత్రం ఎస్సారెస్పీ స్థల లభ్యతతో పట్టణంలోనే నిర్మిచటంతో ప్రజలకు అత్యంత సౌకర్యవంతంగా మారింది. పోలీసుశాఖ జిల్లాకేంద్ర భవనాలు, మాతాశిశు ఆరోగ్య కేంద్రం, డయగ్నోస్టిక్ కేంద్రం, విద్యుత్ ప్రగతిభవన్, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం, కలెక్టర్, అదనపు కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారుల నివాస గృహాలు, జడ్పీ భవనం, పంచాయతీరాజ్, విద్యాభవన్, ఈవీఎంలను భద్రపరిచే గోదాము, అమరవీరుల స్థూపం, పార్కు తదితరాలను ఏర్పాటు చేశారు. బీఆర్‌ఎస్ ప్రగతిభవన్‌ను ధరూర్‌క్యాంపులోనే నిర్మించారు. ధరూర్‌క్యాంపులోనే జిల్లాకోర్టు భవనాలకు స్థలాన్ని కేటాయించారు. క్యాంపును ఆనుకుని వెళ్తున్న ఎస్సారెస్పీ కాలువలో పైపులువేసి మూసివేసి రహదారి విస్తరిస్తుండగా ఇంకనూ మరికొన్ని ప్రభుత్వ విభాగాలను కూడా ధరూర్‌క్యాంపులోనే ఏర్పాటుచేయనుండటం ప్రజలకు అత్యంత సౌకర్యంగా మారనుంది.

# అడ్డగోలు దోపిడీ

జగిత్యాల : జిల్లాలో జ్వరాలు వణికిస్తున్నాయి. ఇంటికొకరు చొప్పున జ్వరాల బారినపడుతున్నారు. మలేరియా, టైఫాయిడ్, డెంగీ కేసులు రోజురోజుకూ పెరుగుతున్నాయి. మూడు నెలల కిందట పది కేసులు కూడా లేని జిల్లాలో ప్రస్తుతం డెంగీ కేసులు వంద దాటాయి. అనధికారికంగా జ్వర పీడితుల సంఖ్య అధికంగానే ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల ఓపీ, ఇన్ పేషంట్ల విభాగాలు జ్వరపీడితులతో నిండిపోతున్నాయి. జిల్లా కేంద్ర ఆసుపత్రిలో నిత్యం 350 నుంచి 400 మంది జ్వరాలతో బాధపడుతూ చికిత్స కోసం వస్తున్నారు. జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ ప్రతిరోజూ 50పైనే జ్వరాల కేసులు నమోదవుతున్నాయి. జ్వరాల నేపథ్యంలో కొన్ని ప్రైవేటు ఆసుపత్రులు, పరీక్ష కేంద్రాలు రోగుల నుంచి అత్యధిక ఫీజులు వసూలు చేస్తున్నాయి. తీవ్ర జ్వరంతో బాధపడుతూ ప్రైవేటు ఆసుపత్రులను ఆశ్రయించిన వారికి అవసరం లేకపోయినా పరీక్షలు నిర్వహిస్తున్నారు. సీబీపీ, డెంగీ, టైఫాయిడ్, మలేరియా పరీక్షల కోసం రూ. 1000, ఓపీ ఫీజు రూ. 300, మందుల పేరిట మరో రూ. 1000 వరకూ వసూలు చేస్తున్నారు. అవసరాన్నిబట్టి ఇతర స్కానింగ్ పరీక్షలకు సిఫార్సు చేస్తుండటంతో ఒక్కో రోగిపై కనీసం రూ. 3 వేల పైనే భారం పడుతోంది. సాధారణ జ్వర పీడితులకు సైతం వైద్య పరీక్షల పేరిట కొన్ని ఆసుపత్రులు ముక్కు పిండి ఫీజులు వసూలు చేయడం పరిపాటిగా మారింది. కొన్ని ఆసుపత్రులైతే సాధారణ జ్వరాలకు సైతం ఇన్‌పేషంట్‌గా చేర్చుకుని మూడు రోజులకే రూ. 25 వేల నుంచి రూ. 30 వేల వరకు రోగుల నుంచి వసూలు చేస్తున్నారు. ప్లేట్‌లెట్లు తగ్గాయని, డెంగీ జ్వరమని చెప్పి ఇన్‌పేషంట్లుగా చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు.

వసూళ్లపై చర్యలేవీ..?

జిల్లాలో వైద్యాన్ని కొందరు వ్యాపారంగా మార్చుకున్నారు. చిన్న జ్వరానికే లేనిపోని పరీక్షలు నిర్వహించి రోగులపై అధిక భారం మోపుతున్నా.. అడ్డగోలు ప్రైవేటు వైద్య పరీక్ష కేంద్రాలు, ఆసుపత్రులపై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ చర్యలు తీసుకోవడంలో వెనుకంజ వేస్తోంది. జిల్లాలో 250 వరకు ప్రైవేటు ఆసుపత్రులున్నాయి. 75 రోగ నిర్ధారణ కేంద్రాలు, 67 స్కానింగ్ కేంద్రాలున్నాయి. వీటిలో కొన్నింటికి అనుమతి కూడా లేవు. నిబంధనల మేరకు ఆయా కేంద్రాల్లో వైద్య పరీక్షలు చేపట్టడంలేదనే విమర్శలు సైతం ఉన్నాయి. జ్వర పీడితుల అవసరాన్ని కొందరు ఇలా సొమ్ము చేసుకుంటున్నారు. వీరిని నియంత్రించాల్సిన అవసరం ఉంది.

వైద్య పరీక్షలపై అవగాహన కల్పిస్తున్నాం

జిల్లాకేంద్రంలో ఏర్పాటు చేసిన రోగ నిర్ధారణ పరీక్ష కేంద్రం(టీహబ్) ద్వారా నిత్యం వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నాం. రూ. 5 వేల విలువ చేసే 64 పరీక్షలు ఇక్కడ ఉచితంగా లభిస్తాయి. దీనిపై గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోనూ ఆశా కార్యకర్తల ద్వారా ప్రజలకు అవగాహన కల్పించాం. జ్వరాల సర్వేలోనూ జ్వరపీడితుల రక్త నమూనాలు సేకరించి టీహబ్‌కు పంపటం జరిగింది. జ్వరపీడితులు ఆందోళనలు వీడి వైద్య పరీక్షల పేరిట డబ్బులు వృథా చేసుకోవద్దు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించే పరీక్ష కేంద్రాలపై చర్యలు తీసుకుంటాం.డాక్టర్ శ్రీనివాస్, జిల్లా ఉప వైద్యాధికారి

# నిర్వహణపై నిర్లక్ష్యం.. వృథాగా ప్రజాధనం

పెద్దపల్లి: ప్రజావసరాల కోసం ప్రభుత్వం సమకూర్చిన యంత్రాల నిర్వహణపై స్థానిక సంస్థలు చేతులెత్తేయడంతో రూ. లక్షల విలువైన ఆస్తులు పాడవుతున్నాయి. పట్టణాలు, గ్రామాల్లో ప్రజారోగ్య పరిరక్షణలో కీలకంగా మారిన పారిశుద్ధ్య నిర్వహణ కోసం కొనుగోలు చేసిన యంత్రాలు తుప్పు పడుతున్నాయి. పెద్దపల్లి పురపాలికలో అయిదేళ్ల కిందట రూ. 8 లక్షల విలువైన స్వీపింగ్ యంత్రం కొనుగోలు చేశారు. కొన్నాళ్లు వినియోగించిన తరువాత సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మూలన పడేశారు. మరమ్మతు చేయించేందుకు చొరవ తీసుకోకపోవడం, స్థలాభావం.. వెరసి పాడయిన యంత్రాలను శ్మశానవాటిలో పడేశారు. ఇక పెద్దపల్లి మండలం ముత్తారం పంచాయతీలో పల్లెప్రగతి నిధులతో ట్రాక్టరును కొనుగోలు చేశారు. మొక్కలకు నీటిని పోసే ట్యాంకరును దానికి అనుసంధానించి వినియోగించారు.



నీటి అవసరం లేని సమయంలో ట్యాంకరును సురక్షిత స్థలంలో భద్రపరచాల్సి ఉండగా నిర్లక్ష్యంగా శ్మశానవాటిక సమీపంలో ఉంచడంతో దొంగలు టైర్లు ఎత్తుకుపోయారు. దీనిపై స్థానిక అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెద్దపల్లి పురపాలక సంఘానికి చెందిన యంత్రాలు, ట్రాక్టరు ట్రాలీలు ఎండకు ఎండి, వానకు తడిసి తుప్పు పడుతున్నాయి. ఈ రెండు ఉదంతాల్లోనూ అధికారుల నిర్లక్ష్యమే స్పష్టంగా కనిపిస్తోంది. ఉదాత్తమైన ఆశయంతో ప్రభుత్వం కొనుగోలు చేసిన యంత్రాలు క్షేత్ర స్థాయిలో నిర్లక్ష్యంతో వృథా అవుతున్నాయి.

# చెత్త సమస్యకు పరిష్కారమేదీ!

వేములవాడ : ఆధ్యాత్మిక పట్టణంగా పేరుగాంచిన వేములవాడ పట్టణంలో చెత్త సమస్యకు సరైన పరిష్కారం లభించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో సేకరించిన చెత్త వ్యర్థాల నుంచి వర్మీకంపోస్టు ఎరువును తయారు చేసేందుకు ఉద్దేశించిన డంపింగ్ యార్డు ఏళ్లు గడుస్తున్నా వినియోగంలోకి రావడం లేదు. ఫలితంగా ప్రతీ రోజు సేకరించిన చెత్త డంపింగ్ యార్డు వద్ద గుట్టలు గుట్టలుగా పేరుకు పోతోంది. ప్రతి ఏటా భారీ వర్షాలకు డంపింగ్ యార్డువద్ద నిల్వ చేసిన వ్యర్థాలు వరద నీటిలో కొట్టుకు పోయి సమీప ప్రాంతాల్లో వ్యవసాయ క్షేత్రాలకు ముంచెత్తడంతో రైతులు నష్టపోతున్నారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని వార్డుల్లో సేకరించిన వ్యర్థాలను నిల్వ చేసేందుకు అగ్రహారం గుట్టల్లోని ప్రభుత్వ స్థలంలో మున్సిపల్ 14వ ఆర్థిక సంఘం నిధులు రూ. 1.50 కోట్ల అంచనాలతో 2019 సంవత్సరంలో డంపింగ్ యార్డు నిర్మాణం పనులు చేపట్టారు. ఈ నిధులతో పనులు కొంత వరకు పూర్తి చేయగా నిధులు చాలక పోవడంతో తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధులు రూ.కోటి వెచ్చించారు. డంపింగ్ యార్డులో డ్రై రిసోర్స్ కలెక్షన్ సెంటర్ (డీఆర్‌సీసీ) షెడ్ల నిర్మాణాలు, వర్మీకంపోస్టు షెడ్లు, ప్రహరీ నిర్మాణం వంటి పనులు పూర్తి చేశారు. మరో షెడ్డు నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. అధికారుల పర్యవేక్షణ లోపం, గుత్తేదారు నిర్లక్ష్యం కారణంగా ఏళ్లు గడుస్తున్నా డంపింగ్ యార్డు నిర్మాణం పనులు పూర్తి కావడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

చివరి దశలో నిలిచిన పనులు

అగ్రహారం గుట్ట ప్రాంతంలోని మున్సిపల్ డంపింగ్ యార్డులో చేపట్టిన షెడ్ల నిర్మాణం పనులు దాదాపు అన్నీ పూర్తి కాగా ఓ షెడ్డు నిర్మాణం పనులుపూర్తి కాక డంపింగ్ యార్డు వినియోగంలోకి రావడం లేదు. ఈ యార్డులో పనులు చివరి దశకు చేరుకొని నిలిచి పోయాయి. మిగులు పనులు పూర్తిచేస్తే డంపింగ్ యార్డు వినియోగంలోకి వచ్చే అవకాశం ఉన్నప్పటికీ ఆయా అంశాలపై అధికారులు, పాలకులు దృష్టి సారించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. డంపింగ్ యార్డును ఇటీవల క్షేత్రస్థాయిలో పరిశీలించిన జిల్లా కలెక్టర్ అనురాగ్



జయంతి నిర్మాణం పనులు త్వరిత గతిన పూర్తి చేయాలని మున్సిపల్ అధికారులు, గుత్తేదారును ఆదేశించినప్పటికీ పనులు ముందుకు సాగడం లేదు. యార్డువద్ద నిల్వచేసిన చెత్తను తగుల బెట్టడంతో కాలుష్యం ఏర్పడుతోంది.

నాణ్యతపై అనుమానాలు

డంపింగ్ యార్డు నిర్మాణంలో అధికారుల పర్యవేక్షణ అంతంత మాత్రంగానే ఉందనే విమర్శలున్నాయి. నిర్మాణ పనుల నాణ్యతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సిన ఇంజినీరింగ్ అధికారులు చుట్టపు చూపుగా వచ్చి వెళ్లడంతో పనులు ఇష్టారాజ్యంగా జరిగాయనే విమర్శలున్నాయి. ఓ షెడ్డు బేస్మెంట్‌కు అప్పుడే పగుళ్లు రావడంతో నిర్మాణంలో నాణ్యత పాటించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మరోవైపు ప్రహరీ కొంతమేర కూలి పోయింది. జేసీబీ వాహనం తగలడంతో కూలినట్లు సిబ్బంది చెబుతున్నారు. కోట్ల రూపాయలతో చేపట్టిన నిర్మాణాలు పది కాలాల పాటు మన్నికగా ఉండాల్సి ఉండగా ప్రారంభానికి ముందే పగుళ్లు రావడం విమర్శలకు తావిస్తోంది.

నెలాఖరు వరకు పూర్తి

డంపింగ్ యార్డులో షెడ్ల నిర్మాణాలు దాదాపు పూర్తయ్యాయి. ఇంకా ఒక షెడ్డు నిర్మాణం పూర్తి కావాల్సి ఉంది. నెలాఖరులోగా పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. మిగులు పనులు పూర్తి కాగానే డంపింగ్ యార్డును వినియోగంలోకి తీసుకు వస్తాం. అన్వేష్, మున్సిపల్ కమిషనర్, వేములవాడ

# కేటీపీపీలో ఇంటి దొంగలు

జయశంకర్ : ఇంటి దొంగను ఈశ్వరుడైనా పట్టలేడంటారు.. బాధ్యాతాయుతమైన హెూదాలో ఉంటూ సంస్థ మనుగడను కాపాడాల్సిన వారే వక్రబుద్ధితో తప్పటడుగులు వేశారు. సంస్థ ఉప్పు తింటూ.. కన్నతల్లి లాంటి పరిశ్రమకే ద్రోహం చేశారు. అవినీతికి పాల్పడి సంస్థను అప్రదిష్ఠ పాలు చేశారు. జిల్లాకే తలమానికమైన చెల్పూరులోని కాకతీయ థర్మల్ పవర్ ప్రాజెక్టులో మూడు నెలల క్రితం దొంగతనం జరగడం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ చోరీ కేసులో అందులో పనిచేస్తున్న ఉద్యోగులే సూత్రధారులని తేలడంతో సర్వత్రా విస్తుపోతున్నారు.

అక్రమార్జనకు ఆశపడి..కొందరు అధికారులు అక్రమార్జనకు ఆశపడి.. బయటివారితో సంబంధాలను ఏర్పర్చుకొని నేరాలకు తెరలేపారు. కొందరు ఉద్యోగులు ఓ బృందంగా ఏర్పడి ప్లాంటులో అందరితో కలివిడిగా ఉంటూ ఎలాంటి అనుమానాలకు తావివ్వకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇతర అధికారులను మచ్చిక చేసుకుని వారు ఏది చెబితే అది జరిగేలా చక్రం తిప్పారు. ప్లాంటులో ఉద్యోగులు, అధికారులతో పాటు అవసరమైన సామగ్రిని తెచ్చేందుకు, ఇతర పనులు చేసేందుకు బయటివారు కూడా వస్తుంటారు. ప్లాంటుతో కార్యకలాపాలు నెరిపే వ్యక్తుల సహకారంతో ఈ తతంగం నడిపినట్లు తెలుస్తోంది. టర్బైన్, జనరేటర్, బాయిలర్, కూలింగ్ టవర్, తదితర వాటి విడిభాగాలు భద్రపర్చే స్టోర్‌రూములకే కన్నం వేశారు. పరిశ్రమలో ఏదైనా సామగ్రి చెడిపోతే దాని స్థానంలో కొత్తది ఇచ్చి రికార్డుల్లో నమోదు చేసుకుంటారు. అక్కడి నుంచే పెద్దఎత్తున సామగ్రి బయటకు తరలించినట్లు సమాచారం. ఆడిట్‌లో విషయం బహిర్గతమైంది.

ఇద్దరి అరెస్టు..

చోరీ విషయం వెలుగులోకి వచ్చిన తర్వాత జెన్కో విజిలెన్స్ అధికారులు, స్థానిక పోలీసులు విచారణ జరిపారు. దాదాపు మూడు నెలల తర్వాత మరోసారి అనుమానితులను విచారించారు. ఇటీవల ఈ చోరీ కేసులో వెల్డింగ్ పనులు చేసే గుత్తేదారు, ఓ ఏడీఏను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కొంత సామగ్రిని కూడా స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. ఈ కేసులో పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు. ఇంకా ఎవరెవరి పాత్ర ఉంది...? సూత్రధారులు ఎవరు..? తరలించిన సామగ్రిని ఎక్కడ విక్రయించారు..? తదితర సమాచారాన్ని తెలుసుకుంటూ విచారణ సాగిస్తున్నారు. కేసులో పలువురిని అరెస్టు చేసే అవకాశం ఉంది.

భద్రత ప్రశ్నార్థకమే..

కేటీపీపీలో దాదాపు రూ. 80.32 లక్షల సొత్తు మాయమైనట్లు సంస్థ ప్రతినిధులు తేల్చారు. అయితే ప్లాంటు వద్ద కట్టుదిట్టమైన భద్రత ఉంటుంది. ప్లాంటు లోపలికి వెళ్లాలన్నా, బయటకు రావాలన్నా భద్రతా సిబ్బంది తనిఖీలు, విచారణ చేపడతారు. బయటివారు ఎవరైనా వస్తే తగిన అనుమతులు ఉంటేనే లోపలికి వెళ్లనిస్తారు. ఉద్యోగుల కాలనీలో ఉన్న బ్యాంకుకు వెళ్లాలన్నా స్థానికులను విచారించిన తర్వాతే అనుమతిస్తారు. కానీ రూ.లక్షల విలువైన సామగ్రి బయటకు తరలిస్తుంటే భద్రత సిబ్బంది ఏం చేశారని..? అనుమానాలు వస్తున్నాయి. కేటీపీపీ భద్రత లోపభూయిష్టమని అర్థమవుతోంది. కేటీపీపీ భద్రతపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

# నిట్ నియామకాల్లో గందరగోళం

వరంగల్ : వరంగల్ జాతీయ సాంకేతిక విద్యా సంస్థ (నిట్)లో బోధనేతర పోస్టుల భర్తీలో అయిన వారికి అందలమేసేందుకు అనేక నిబంధనలు ఉల్లంఘన జరిగినట్టు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తాజాగా మిషన్ మోడ్ కింద భర్తీ చేసిన 23 గ్రూప్-డి పోస్టుల నియామకంలో అందరికీ సమాన అవకాశం ఇవ్వకుండా పోస్టులను నింపారని నిట్ 'బోర్డ్ ఆఫ్ గవర్నర్స్' గుర్తించి, ఆ పోస్టులను రద్దు చేయాలని ఆదేశించింది. అయితే గతంలో గ్రూప్ ఎ, బి, సి విభాగాల కింద భర్తీ చేసిన 129 పోస్టుల్లోనూ అనేక నిబంధనలు తుంగలో తొక్కి భర్తీ ప్రక్రియ చేపట్టినట్టు ఓ బాధితుడు ఇటీవల సమాచార హక్కు చట్టం ద్వారా పొందిన వివరాలతో బహిర్గతమైంది. నిట్లో 129 బోధనేతర పోస్టులను భర్తీ చేసేందుకు 2021లో నోటిఫికేషన్ వెలువడింది. 2022 ఫిబ్రవరిలో ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. ఇందులో గ్రూప్-ఎ లోని సహాయ రిజిస్ట్రార్, సూపరింటెండెంట్లతోపాటు, మెడికల్ ఆఫీసర్, ఇతర గ్రూప్ బి, సి పోస్టుల కోసం అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. పోటీ ప్రవేశ పరీక్షలతోపాటు అన్ని రకాల పరీక్షలకు హాల్ టికెట్పై అభ్యర్థుల ఫొటో, పేరు, వివరాలు ఉంటాయి. గతేడాది నిర్వహించిన ఈ పరీక్షకు 'కాల్ లెటర్' పేరుతో ఇచ్చిన హాల్ టికెట్లో అభ్యర్థి పేరు, ఫొటో లేకపోవడం గమనార్హం. పరీక్ష జరుగుతున్న సమయంలో కూడా ఒకరికి బదులు మరొకరు రాస్తుండగా ఆ వ్యక్తిని గుర్తించినా ఈ విషయం బయటకు రాకపోవడం గమనార్హం. ఫలితాల్లో సైతం ఉత్తీర్ణులైన వారి పేరు కాకుండా దరఖాస్తు ఐడీతో మాత్రమే జాబితా ప్రకటించిడం విమర్శలకు తావిస్తోంది.

ఎంపికైన వారి జాబితాలో యథేచ్ఛగా మార్పు చేర్పులు చేసినట్టు స్పష్టమైంది. ఆర్టీఐ కింద సేకరించిన సమాచారంలో జూనియర్ సహాయకుల పోస్టులో ఒక అభ్యర్థి పేరు ఉండగా, కొన్నాళ్ల తర్వాత నిట్ అధికారిక వెబ్‌సైట్లో అదే స్థానంలో మరో వ్యక్తి పేరు ప్రత్యక్షమవ్వడం వెనకాల ఆంతర్యం అంతుబట్టకుండా ఉంది.

ఈ పరీక్షలో ఈడబ్ల్యూఎస్ కోటాను అమలు చేశారు. ఇది అమలు చేయాలంటే సీట్లను పదిశాతం పెంచి పదిశాతం ఆ కేటగిరీ వారికి ఇవ్వాలి. కానీ పోస్టులను పెంచకుండానే కోటా అమలు చేయడం వల్ల అర్హులు నష్టపోయారని బాధితులు అంటున్నారు. ఒక ఎస్టీ అభ్యర్థి తనకు అన్యాయమైందని అప్పట్లో క్యాంపస్‌లో నిరసనకు దిగారు.

పోస్టుల భర్తీలో కొందరు పెద్దలు అయిన వారిని నియమించడంతో ఉద్యోగంలో చేరాక నైపుణ్యాలు లేక పలువురిని తొలగించడం గమనార్హం. ఒక అభ్యర్థి వయోపరిమితి ఎక్కువైనా పోస్టుకు దరఖాస్తు చేయడంతో స్క్రుటినీలో కమిటీ అతని దరఖాస్తును తిరస్కరించింది. అయినా కూడా ఆ వ్యక్తికి 'కాల్ లెటర్' పంపి అతను పరీక్ష రాసేలా చక్రం తిప్పి చివరకు అతని నియామకం జరిగింది. స్క్రుటినీ కమిటీలో ఉన్న ఒక అధికారి ఇది గుర్తించడంతో ఇది వివాదాస్పదమయ్యేలా ఉందని రాజీనామా చేయించారు. మరో ఇద్దరు జూనియర్ సహాయకులు, ఒక గ్రంథాలయ సహాయకుడిని కూడా పోస్టుకు తగ్గ నైపుణ్యం లేదని చేరిన కొన్ని రోజులకే తొలగించడం గమనార్హం.

ప్రకటన ఇచ్చిన పోస్టులకన్నా ఎక్కువ సంఖ్యలో ఉన్నా వాటిని ప్రకటనలో పొందుపరచకుండా తర్వాత భర్తీ చేయడం వెనక మతలబేంటని ప్రశ్న ఉత్పన్నమవుతోంది. నియామకాలు పారదర్శకంగా జరగనందున వీటిపై తగిన విచారణ జరపాలనే డిమాండు వస్తోంది.

వాటి గురించి తెలియదు

– ఆచార్య సీఎస్ఆర్‌కె ప్రసాద్, నిట్ ఇన్‌ఛార్జి రిజిస్ట్రార్

నిట్లో జరిగే అన్ని నియామకాలు ఎంతో పారదర్శకంగా జరుగుతాయి. ఒక్కరి నిర్ణయం మేరకు కాకుండా కమిటీ ద్వారానే ఉంటాయి. ఇప్పుడు తొలగించిన 23 మంది ఎన్నో ఏళ్లుగా దినసరి వేతనంతో పనిచేస్తున్నారు. మానవతా దృక్పథంతో వారిని రెగ్యులరైజ్ చేయాలనుకున్నాం. కానీ పాత విధానంలో కొనసాగుతారు. ఇటీవల బాధ్యతలు తీసుకున్నందున గతంలో భర్తీ చేసిన 129 పోస్టుల గురించి నాకు తెలియదు.

# బస్తీమే సుస్తీ..!



ఖమ్మం : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో విషజ్వరాలు పంజా విసురుతున్నాయి. దగ్గు, జలుబు, శరీర పొక్కులు, నీరసం, తలనొప్పి వంటి లక్షణాలతో వేలాదిమంది బాధపడుతున్నారు. ఖమ్మం జిల్లాలో వైరల్ జ్వరాల బారినపడ్డ బాధితుల సంఖ్య దాదాపు లక్షకు చేరువలో ఉంది. డెంగీ కేసుల తీవ్రత ఆందోళన కలిగిస్తోంది. గతేడాదితో పోల్చితే (2022లో 21,265 నమూనాలు సేకరించగా.. పాజిటివ్ కేసులు 711) డెంగీ కేసులు తక్కువే నమోదవుతున్నా రోజుల తరబడి రోగులు ఆసుపత్రుల్లోనే చికిత్స పొందాల్సి వస్తోంది. భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ తదితర జిల్లాల నుంచి చికిత్స కోసం వచ్చే బాధితులతో ఖమ్మం సర్వజన ఆసుపత్రి (పెద్దాసుపత్రి) కిటికిటలాడుతోంది.

పెద్దాసుపత్రి కిటకిట

జ్వరాల తీవ్రత అంతకంతకూ పెరుగుతుండటంతో పెద్దాసుపత్రి కిక్కిరిసిపోతోంది. సాధారణ రోజుల్లో ఓపీ 1,200–1,500 చొప్పున ఉంటుంది. జ్వర బాధితులు భారీగా పెరగడంతో ఓపీ 2వేలకు పెరిగింది. వార్డుల్లో ఒక్కో మంచంపై ఇద్దరేసి రోగులకు చికిత్స అందించాల్సిన పరిస్థితి నెలకొంది. మరికొందరికి నేలపైనే వైద్యమందిస్తున్నారు. ఐసీయూలో ప్రత్యేకంగా పది పడకలు ఏర్పాటుచేశారు. ఉభయ జిల్లాల్లోని సీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లోనూ రోగుల తాకిడి కనిపిస్తోంది.

సిరంజిల కొరతమరోవైపు ఉభయ జిల్లాల్లోని ప్రభుత్వాసుపత్రుల్లో సిరంజిల కొరత వేధిస్తోంది. మూడు నెలలుగా 2 సీసీ, 5 సీసీ, 10 సీసీ సిరంజిలు అరకొరగా సరఫరా అవుతున్నట్లు తెలిసింది. కొంతమేర స్థానికంగా కొంటున్నా రోగులకు సరిపోవటం లేదనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. జిల్లా స్థాయిలో ప్రతినెలా సిరంజిల కొరతపై ఉన్నతాధికారులకు నివేదికలు పంపినా సరఫరా కాకపోవడంతో ఉన్నవాటితో సరిపెడుతు న్నారు.

ఖమ్మం జిల్లాలో..

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి

సీహెచ్‌సీలు- 7

పీహెచ్‌సీలు- 26

బస్తీ దవాఖానాలు-7

యూపీఎస్‌లు- 5

రెండుపూటలా ఓపీ..తరుణ వ్యాధుల తీవ్రత నేపథ్యంలో ఖమ్మం సర్వజన ఆసుపత్రిలో ఓపీ వేళల్లో మార్పులు జరిగాయి. వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు ఆదేశాల మేరకు ఉదయంతో పాటు సాయంత్రం 4 గంటల నుంచి 6 వరకు ఔట్ పేషెంట్ సేవలందించేందుకు ఏర్పాట్లు చేశారు. గురువారం నుంచి ఓపీ సేవలు అందుబాటులోకి వచ్చాయి. జ్వరాల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నాం. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు డ్రై డే ఫ్రైడే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నాం. జ్వరాల తీవ్రత ఉన్న ప్రాంతాల్లో సర్వే చేపట్టి నమూనాలు సేకరిస్తున్నాం. అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలు, బస్తీ, పల్లె దవాఖానాల్లో చికిత్సలందిస్తున్నాం.

మాలతి, డీఎంహెచ్ఓ, ఖమ్మం

# హృదయం.. పదిలం



ఖమ్మం : వయసుతో సంబంధం లేకుండా హృద్రోగ సమస్యలు వెలుగు చూస్తున్నాయి. కొవిడ్ తర్వాత అకాల మరణాలు సంభవిస్తున్నాయి. వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ అంచనా ప్రకారం కార్డియో వ్యాస్కులర్ డిసీజ్(సీవీడీ) కారణంగా 85 శాతం మరణాలు నమోదవుతున్నాయి. ఈ క్రమంలో ప్రతి ఒక్కరూ తమ హృదయాలను జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరం ఉంది. గుండె ఆరోగ్యంపై సరైన పరిజ్ఞానం లేకపోవడం వల్ల సంబంధిత వ్యాధుల బారిన పడుతున్నట్లు నిపుణులు హెచ్చరిస్తున్నారు. జీవన విధానంలో మార్పులు, అవగాహనతో ముప్పును అధిగమించవచ్చని సూచిస్తున్నారు. సెప్టెంబరు 29న వరల్డ్ హార్ట్ డే సందర్భంగా ఈ ఏడాది 'యూజ్ హార్ట్.. నో హార్ట్'(గుండె గురించి తెలుసుకో..) థీమ్‌ను ప్రకటించారు. జిల్లాలో పరిస్థితులపై కథనం...

గుండె జబ్బులకు కారణాలెన్నో..

శారీరక వ్యాయామం లేకపోవడం, అధిక రక్తపోటు, మద్యపానం, బయటి ఆహారం, అధిక కొవ్వు, మధుమేహం, వాయు కాలుష్యం, ఊబకాయం, పొగాకు వాడకం మూత్ర పిండాల వ్యాధులతో పాటు సామాజిక, ఆర్థిక ప్రవర్తన, పర్యావరణ ప్రమాద కారకాల కలయిక వల్ల గుండె జబ్బులు సంభవిస్తున్నాయి. ఒత్తిడి, కుటుంబ చరిత్ర, నేపథ్యం కూడా హృద్రోగ సంబంధ వ్యాధుల ప్రమాదాన్ని ప్రభావితం చేస్తున్నాయి. గుండె రక్తనాళాలు దెబ్బతినకుండా క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రాణహాని లేకుండా జాగ్రత్త పడవచ్చు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో హృద్రోగ సమస్యల బారిన పడుతున్న వారి సంఖ్య పెరుగుతోంది. ఇటీవల యువత, పిల్లలు సైతం గుండెపోటుతో చనిపోతుండటం ఆందోళన కలిగిస్తోంది.

వైద్య సేవల విస్తరణ తప్పనిసరి..

గుండె జబ్బుల నివారణపై ప్రజల్లోనూ అవగాహన పెరగాలి. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వైద్యరంగం కూడా మరింత విస్తరించాల్సిన అవసరం ఉంది. ముఖ్యంగా నిరుపేద వర్గాలు గుండె వ్యాధులకు చికిత్సలు తీసుకోవాలంటే ఆర్థిక భారం మోయాల్సిన పరిస్థితి. ఉమ్మడి జిల్లాలో కేవలం ఖమ్మం సర్వజనాసుపత్రిలో మాత్రమే క్యాథ్‌లాబ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. గత ఏడాది ఫిబ్రవరిలో ఈ సేవలను ప్రవేశపెట్టగా ఇప్పటివరకు 15,198 మంది ఇక్కడ సేవలు పొందారు. వారిలో 966 మందికి పలు రకాల గుండె చికిత్సలు అందించారు. భద్రాద్రి కొత్తగూడెం ఆస్పత్రిలో కనీసం వైద్య నిపుణులు కూడా లేరు. దీంతో బాధితులు అత్యవసర సమయంలో ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీయాల్సిన పరిస్థితి. ప్రభుత్వ వైద్య రంగంలో స్థానికంగా వైద్య నిపుణులు, సదుపాయాలు లేకపోవడంతో హృద్రోగ సమస్యలను ప్రాథమిక దశలో తెలుసుకునే అవకాశాలు లేవు. ఈ నేపథ్యంలో గుండె జబ్బులకు సకాలంలో చికిత్స లభించడం లేదు. కార్డియాలజీ సేవల విస్తరణ మరింత పెరిగితేనే ఇది సాధ్యమవుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

గుండె జబ్బులకు అనేక కారకాలు

గుండె జబ్బులకు అనేక కారకాలు ఉన్నాయి. హృద్రోగాల ప్రమాదాన్ని తగ్గించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ముఖ్యంగా ఈ సమస్యలపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెరగాలి. సమతుల ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, శరీర బరువు నియంత్రణ ముఖ్యం. మద్య, ధూమపానాలు హానికరం.. వాటికి దూరంగా ఉండాలి. గుండె జబ్బుల్లో హెచ్చరిక సంకేతాలను ముందుగా గ్రహిస్తే ప్రాణాపాయ స్థితి నుంచి తప్పించుకోవచ్చు.

డాక్టర్ సీతారాం, హృద్రోగ వైద్య నిపుణుడు

# ముక్కోటి వేడుకలకు ముందస్తు ఏర్పాట్లు

ఖమ్మం : భద్రాద్రి రామయ్య ముక్కోటి ఉత్సవాలకు అధికారులు ముందస్తు ఏర్పాట్లకు సంసిద్ధమవుతున్నారు. డిసెంబరులో ముక్కోటి ఏకాదశి మహెూత్సవాలను నిర్వహించనున్నారు. వేడుకల వివరాలను అధికారికంగా వెల్లడించనప్పటికీ ఆ నెల 23న ప్రధాన ఉత్సవం ఉంటుందని నిర్ణయించారు. ఉత్తర ద్వారంలో సీతారాముల వారికి పూజలు చేసే వేడుక కావడంతో భక్తులు పెద్ద సంఖ్యలో తరలి రానున్నారు. ఇందుకు సెక్టార్లను సిద్ధం చేయనున్నారు. టిక్కెట్లను విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ముక్కోటి ఏకాదశికి ముందు రోజున గోదావరిలో హంస వాహనంలో తెప్పోత్సవం ఉంటుంది. దీన్ని వీక్షించేందుకు విశేష సంఖ్యలో భక్తులు తరలి వస్తారన్న అంచనాతో సదుపాయాలను కల్పించనున్నారు. ఈసారి అన్ని శాఖలు కలిపి రూ. 1.50 కోట్ల వరకు వెచ్చించే వీలుంది. దేవస్థానం ద్వారా భద్రాచలం, పర్ణశాలల్లో 15 పనులకు రూ. 83.70 లక్షలు ఖర్చు చేయాలని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో హెచ్చుతగ్గులకు ఆస్కారం ఉంది. రంగులను తీర్చిదిద్దడం, విద్యుత్తు దీపాల ఏర్పాటు, చాందినీ వస్త్రాల అలంకరణ, పుష్పాలంకరణ, క్యూ లైన్ల ఏర్పాటు, చలువ పందిరి నిర్మాణాలు, ఎల్ఈడీ తెరలు, సీసీ కెమెరాలు, బాణాసంచా, ఆహ్వాన పత్రికల తయారీ, ప్రచార గోడ పత్రికలు,



స్వాగత ద్వారాల ఏర్పాటు వంటివి ఈ పనుల్లో ముఖ్యమైనవి.

ఎన్నికల తరుణంలో ఉత్సవాలు..

రామాలయంలో ఏటా శ్రీరామ నవమి తర్వాత అదే స్థాయిలో ఘనంగా చేసే ఉత్సవం ముక్కోటి ఏకాదశి. కొవిడ్ తరుణంలో నిరాడంబరంగా కొనసాగించినప్పటికీ ఆ తర్వాత నుంచి వేడుకల వైభవం రెట్టింపు అవుతూనే ఉంది. ఈసారి ఎన్నికల తరుణంలో పండుగ ఉండడంతో ఎన్నికల కోడ్ ఉంటుందా లేదా అన్న విషయమై స్పష్టత రావాల్సి ఉంది. కోడ్ అమల్లో ఉంటే ప్రొటోకాల్ రగడ తగ్గనుంది. ఆన్‌లైన్ అందుబాటులో ఉన్నందున సెక్టార్ టికెట్లతోపాటు పాటు వసతి గదులనూ భక్తులు బుక్ చేసుకునే అవకాశాలను కల్పించనున్నారు.

# సింగరేణి ఎన్నికలపై సందిగ్ధం

జయశంకర్ : సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలపై సందిగ్ధత నెలకొంది. కొన్నేళ్ల నుంచి వాయిదాలు పడుతూ వస్తున్న నేపథ్యంలో తాజాగా మళ్లీ అదే పరిస్థితి తలెత్తుతుందా..? అనే అనుమానాలు కలుగుతున్నాయి. ఈ నెల 22న కేంద్ర డిప్యూటీ లేబర్ కమిషనర్ వద్ద జరిగిన సమావేశంలో అన్ని కార్మికుల సంఘాలు గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని ముక్తకంఠంతో డిమాండ్ చేశాయి. దీంతో ఈ నెల 27న మరోసారి సమావేశం ఏర్పాటు చేసుకొని షెడ్యూల్ ప్రకటించుకుందామని నిర్ణయించుకున్నారు. కానీ, బుధవారం జరిగిన సమావేశానికి ఏఐటీయూస్మీ, బీఎంఎస్ కార్మిక సంఘాలు మినహా ఇతర సంఘాలు తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం, ఐఎన్‌టీయూస్మీ, హెచ్ఎంఎస్, స్మీఐటీయూ, ఐఎఫ్‌టీయూ వంటి సంఘాలు, యాజమాన్యం హాజరుకాలేదు. హైకోర్టు తీర్పు మేరకు, రెండు సంఘాల ఒత్తిడితో డీఎల్స్మీ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేశారు.

నిర్వహణ సాధ్యమేనా..?

రాష్ట్రంలో అక్టోబర్ 1న ప్రధానమంత్రి మోదీ పర్యటన, 3న కేంద్ర ఎన్నికల సంఘం పర్యటన ఉన్నాయి. 4, 5 తేదీల్లో ఎన్నికల సంఘం సమావేశమవుతుందని సమాచారం. అప్పుడే ఎన్నికల ప్రకటన వెలువడితే సింగరేణిలో ఎన్నికల నిర్వహణ సాధ్యం అవుతుందా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. సింగరేణిలో శాంతిభద్రతల పర్యవేక్షణ, ఎన్నికల విధులకు సిబ్బంది, బ్యాలెట్ బాక్సులను సమకూర్చుకోవడం వంటివి యాజమాన్యానికి సవాల్‌గా మారే అవకాశం ఉంది.

వాయిదా వేయాలని..సాధారణ ఎన్నికలు పూర్తయ్యే వరకు గుర్తింపు ఎన్నికలను వాయిదా వేయాలంటూ 12 కార్మిక సంఘాలు డిప్యూటీ స్మీఎల్స్మీకి వేర్వేరుగా లేఖలు రాసినట్లు తెలుస్తోంది. యాజమాన్యం సైతం ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో రెండు సంఘాల సమక్షంలో తీసుకున్న నిర్ణయాన్ని అమలు చేయడం సాధ్యమవుతుందా..? అన్న ప్రశ్న తలెత్తుతోంది. మరోవైపు కార్మిక శాఖ తీసుకున్న నిర్ణయాన్ని డివిజన్ బెంచికి అప్పీలు చేయడానికి యాజమాన్యం ఆలోచిస్తున్నట్లు తెలుస్తోంది.

షెడ్యూల్ ప్రకారమే నిర్వహించాలి

సింగరేణిలో షెడ్యూల్ ప్రకారమే గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. స్థానిక కొంరయ్య భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేంద్ర డిప్యూటీ లేబర్ కమిషనర్ ఏర్పాటు చేసిన సమావేశానికి సింగరేణి యాజమాన్యం, ఇతర కార్మిక సంఘాలు హాజరుకాకపోవడం శోచనీయమన్నారు. ఏఐటీయూసీ, బీఎంఎస్ సంఘాలు మాత్రమే హాజరయ్యాయని తెలిపారు. గత సమావేశంలో అన్ని సంఘాలు ముక్తకంఠంతో ఎన్నికలు జరపాలని కోరాయని, ఇప్పుడు యాజమాన్యం ధోరణిని ఏకీభవించడం సరైందికాదన్నారు. ఎన్నికల్లో జాప్యం మూలంగా కార్మికుల సమస్యలపై యాజమాన్యంతో చర్చలు జరగడం లేదన్నారు. గుత్తేదారులతో బొగ్గు వెలికితీత చేస్తున్నారని.. గుర్తింపు సంఘం అడ్డుకోవడం లేదని మండిపడ్డారు. సమావేశంలో ఏఐటీయూసీ బ్రాంచి కార్యదర్శి ఎం.రమేశ్, నాయకులు శ్రీనివాస్, జగన్, రవి పాల్గొన్నారు.

# గుడ్డిగా సంతకాలు చేశారా..!

వరంగల్ : గ్రేటర్ వరంగల్‌లో సాధారణ ప్రజల పౌరసేవల దస్త్రాలు పరిష్కరించేందుకు ఉద్యోగులు సవాలక్ష అనుమానాలు వ్యక్తం చేస్తారు. అనేకసార్లు తిప్పించుకుంటారు.. అలాంటిది సీనియర్ అసిస్టెంటు బండా అన్వేష్ తయారు చేసిన బోగస్ దస్త్రాలపై అక్కౌంట్స్, ప్రీ-అడిట్ విభాగాల అధికారులు సంతకాలెలా చేశారు?.. ఒకటి రెండు కాదు.. 21 బిల్లుల చెల్లింపుల దస్త్రాలపై గుడ్డిగా సంతకాలు చేశారా.. ముందస్తు ఒప్పందంలో భాగంగానే అన్వేష్ పంపించిన దస్త్రాలు చకచకా కదిలించరా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నా యి. రూ. 2.31 కోట్ల ప్రజాధనాన్ని కొల్లగొట్టిన వైనం వెనుక ఎవరెవరున్నారు? అన్వేష్‌కు సహకారం అందించిన అధికారుల పాత్రపై ఎందుకు విచారణ చేపట్టలేదు?, అకౌంట్స్, ప్రీ-అడిట్ విభాగాల పాత్ర ఎందుకు విస్మరించారనేది ప్రశ్నార్థకంగా మారింది. గురువారం 'ఈనాడు'లో ప్రచురితమైన 'దస్త్రాలు సృష్టించి.. సంతకాలు ఫోర్జరీ చేసి..' కథనం సంచలనం సృష్టించింది. విశ్రాంత అధికారులు, ఉద్యోగులు.. బల్దియా నిర్లక్ష్యాన్ని తప్పు పట్టారు. పూర్తిస్థాయి విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయంటున్నారు.

చిరుద్యోగి పరిశీలనతో వెలుగులోకి: సీనియర్ అసిస్టెంటు అన్వేష్ సృష్టించిన బోగస్ దస్త్రాలు, గత కమిషనర్ సంతకాల ఫోర్జరీ వ్యవహారం పోస్టు అడిట్ పరిశీలనలో బయట పడినట్లు తెలిసింది. ఓ చిరుద్యోగి 2020-21 ఆర్థిక సంవత్సరం అభివృద్ధి పనులు, ఇతర బిల్లుల చెల్లింపుల దస్త్రాలను పరిశీలిస్తుండగా అప్పటి కమిషనర్ పమేలా సత్పతి సంతకాల్లో తేడాను గుర్తించారు. దీంతో ఆయన 2021 మే, జూన్ నెలల దస్త్రాలన్నీ సమగ్రంగా పరిశీలించగా కమిషనర్ సంతకాలు రెండు రకాలుగా కనిపించాయి. అన్వేష్ సృష్టించిన దస్త్రాల పూర్తి వివరాలపై ఆరా తీశారు. టౌన్‌ప్లానింగ్ సెక్షన్ జీ-2 క్లర్క్ ద్వారా దస్త్రాలు రాలేదని, నేరుగా ప్రీ అడిట్, అకౌంట్స్ విభాగాలకు వెళ్లాయని గుర్తించి ప్రస్తుత కమిషనర్ రిజ్వాన్ భాషా దృష్టికి తీసుకెళ్లారు. ఆయన గత కమిషనర్, ప్రస్తుతం రాష్ట్ర పురపాలక శాఖ సంచాలకురాలు పమేలా సత్పతితో మాట్లాడి నకిలీ దస్త్రాలు, సంతకాలు ఫోర్జరీ జరిగిందని తేల్చారు. శాఖాపరమైన విచారణ కోసం మున్సిపల్ శాఖ హైదరాబాద్ ప్రాంతీయ ఉపసంచాలకుడు శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ఆడిట్ విభాగం అధికారులను గ్రేటర్ వరంగల్‌కు పంపించగా.. విచారణలో తప్పులు బయట పడ్డాయి.

21 బోగస్ దస్త్రాలు..బండా అన్వేష్ రూపొందించిన బోగస్ దస్త్రాల సంఖ్య పెరిగింది. తొలుత 15-16 అనుకున్నారు.. సమగ్ర విచారణలో 21 నకిలీ దస్త్రాలు సృష్టించినట్లు తేలింది. దస్త్రాలన్నీ టౌన్‌ప్లానింగ్ సెక్షన్ జీ-2 క్లర్క్ పేరుతో తయారు చేశారు. అన్నింటికీ గత కమిషనర్ పమేలా సత్పతి నిధుల మంజూరుకు పరిపాలన అనుమతులు ఇచ్చినట్లుగా ప్రొసీడింగ్ కాపీలు రూపొందించి, ఆమె సంతకాలు అన్వేష్ ఫోర్జరీ చేశారు. 21 దస్త్రాలు కమిషనర్ పేషి నుంచి నేరుగా ప్రీ అడిట్, అకౌంట్స్ విభాగాలకు వెళ్లాయి. నిబంధనల ప్రకారం అభివృద్ధి పనులు, ఇతర అత్యవసర చెల్లింపుల దస్త్రాలు వింగ్ అధికారి సూచనతో సెక్షన్ క్లర్క్ తయారు చేయాలి. క్లర్క్ నుంచి సెక్షన్ సూపరింటెండెంటు ద్వారా వింగ్ అధికారి వద్దకు, అక్కడి నుంచి నిధుల మంజూరుకు చివరగా కమిషనర్ వద్దకు వెళ్లాలి. ఆ తర్వాతే ప్రీ అడిట్, అకౌంట్స్ విభాగాలకు వెళ్లాలి. అన్వేష్ సృష్టించిన బోగస్ దస్త్రాలు నేరుగా చెల్లింపుల విభాగాల అధికారుల వద్దకు వెళ్లాయి.సాధారణంగా పరిశీలిస్తే అత్యవసరం, ఇతర బిల్లుల చెల్లింపులన్నీ ఇంజినీరింగ్, ప్రజారోగ్య విభాగాలు చేస్తాయి. టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచి చెల్లింపులు తక్కువగా ఉంటాయి. అన్వేష్ సృష్టించిన 21 దస్త్రాలు టౌన్‌ప్లానింగ్ విభాగం పేరుతో ఉన్నాయి. ఇదే కోణంలో ప్రీ అడిట్, అకౌంట్స్ విభాగం అధికారులు ఆలోచించి ఉంటే కుంభకోణం జరిగి ఉండేది కాదని సీనియర్ అధికారులంటున్నారు.

గతంలోనూ జరిగాయా..?

సీనియర్ అసిస్టెంట్ అన్వేష్ 12 ఏళ్ల పాటు పలువురు కమిషనర్ల వద్ద క్యాంపు క్లర్క్‌గా పనిచేశారు. గతంలోనూ ఏమైనా అక్రమాలకు పాల్పడ్డారా అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. 12 ఏళ్ల చెక్కులు, క్యాష్ బుక్కులు పరిశీలించాలని ఓ సీనియర్ అధికారి సూచించారు. అన్వేష్ గతంలో ఇద్దరు కమిషనర్ల పేరుతో కూడా నకిలీ దస్త్రాలు సృష్టించాడని, అవి వెలుగులోకి రాకుండా అధికారులను మేనేజ్ చేశారని తెలిసింది. ఓ ఐఏఎస్ అధికారి, మరో నాన్ ఐఏఎస్ కమిషనర్ల హయాంలో రెండుసార్లు ప్రజాధనాన్ని మాయం చేసినట్లు సమాచారం. ప్రస్తుతం బయటపడిన కుంభకోణం మూడోదని కొందరు ఉద్యోగులంటున్నారు.

## ఉపాధి పని దినాలు ఖరారు

కామారెడ్డి : జిల్లాలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం కూలీలకు కల్పించాల్సిన పని దినాల వార్షిక ప్రణాళికను రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఖరారు చేశారు. క్షేత్రస్థాయిలో గ్రామీణాభివృద్ధి శాఖ సిబ్బంది పర్యటించి పంచాయతీల వారీగా కూలీలను గుర్తించి పని దినాలకు సంబంధించి తీర్మానాలు చేశారు. ఎంపీడీవోలు, ఏపీవోలు సాంకేతిక కంప్యూటర్ సహాయకులు, సర్పంచ్‌లు అంతా ఈ ప్రక్రియలో భాగస్వాములయ్యారు. అయితే జిల్లాలో గత ఏడాది నుంచి ఉపాధి హామీ పనుల లక్ష్యం చేరుకోవడం లేదు. ఉపాధి హామీ పథకానికి కేంద్రం విధించిన పలు నియమ నిబంధనలు, చేసిన పనులకు సకాలంలో కూలీ డబ్బులు రాకపోవడంతో పనులు చేసేందుకు ఆసక్తి చూపడం లేదనే వాదన వినిపిస్తోంది. ఈ నేపథ్యంలో గత ఆర్థిక సంవత్సరంలో నిర్దేశించిన ఉపాధిహామీ పని దినాలకు సంబంధించి లక్ష్యాన్ని ఇప్పటికీ చేరుకోలేకపోయారు. ప్రస్తుతం వచ్చే ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రూపొందించిన లక్ష్యాన్ని చేరుకుంటారో లేదో చూడాలి.

2023-24 ఆర్థిక సంవత్సరానికి 72.80 లక్షల పని దినాలు

జిల్లాలోని కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ డివిజన్‌ల పరిధిలో 526



గ్రామ పంచాయతీల్లో గత ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 68 లక్షల పని దినాలకు గాను 42 లక్షల పని దినాలు పూర్తి చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో లక్ష్యానికి చేరుకోలేకపోయారు. 2023-24 ఆర్థిక సంవత్సరం జిల్లాలో మొత్తం 2,60,780 ఉపాధి జాబ్‌కార్డులు ఉన్నాయి. ఈ జాబ్‌కార్డులలో 5,80,621 కూలీలు ఉన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు 42 లక్షల పని దినాల పనులు కూలీలకు కల్పించారు. ఉపాధి పనులకు వచ్చిన వారికి రూ.257 నిర్ధారించగా ప్రస్తుతం రూ.170 వరకు లభిస్తుందని ఉపాధి కూలీలు చెబుతున్నారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలోనైన కూలీలకు పూర్తిస్థాయిలో పనులు కల్పించి సకాలంలో ఉపాధి డబ్బులు చెల్లిస్తే లక్ష్యం చేరుకునే అవకాశం ఉంటుందని సంబంధిత శాఖ అధికారులు చెబుతున్నారు.

ప్రణాళిక ఆధారంగానే..

2023-24 ఆర్థిక సంవత్సరానికి 72.80 లక్షల పని దినాలను ఖరారు చేశారు. వచ్చే ఏప్రిల్ నుంచి గ్రామసభల్లో ఖరారు చేసిన ప్రణాళిక ఆధారంగానే చర్యలు తీసుకున్నారు. ఉపాధి పథకం ద్వారా 90 రకాల పనులను చేపట్టనున్నారు. ప్రధానంగా రైతులకు ప్రయోజనం కల్పించే సాగు కాల్వలు నిర్మించడం, పూడికతీత, ముళ్లపొదల తొలగింపు, నీటి కుంటల నిర్మాణం, సమగ్ర భూ అభివృద్ధి పనులు, రహదారుల నిర్మాణం, హరిత హారం, భూమి చదును చేయడం వంటివి చేయనున్నారు.

గ్రామ యూనిట్‌గా..

ఉపాధి హామీ పథకానికి సంబంధించి చేపట్టనున్న పనుల అమలులో సమూల మార్పులకు కేంద్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. నూతన సాఫ్ట్‌వేర్ మార్పుతో ఇక నుంచి గ్రామం యూనిట్‌గా ఉపాధి పనులు జరగనున్నాయి. ఇప్పటి వరకు రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో టీఎస్‌రాగాస్ సాంకేతికత ద్వారా ఉపాధి పనులు చేపట్టే వారు ప్రస్తుతం ఉన్న సాఫ్ట్‌వేర్ ఎన్ఐసీ(నేషనల్ ఇన్‌ఫేర్టటిక్ సెంటర్) ద్వారా పనులు చేపట్టనున్నారు. ఈ ఏడాది జనవరి నుంచి ఉపాధి హామీ పథకం క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులు పనుల వద్దకు వెళ్లి కూలీల హాజరును ఫొటోలతో నమోదు చేసి ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేయాల్సి ఉంది. ఉదయం, మధ్యాహ్నం కూలీల హాజరును క్షేత్రస్థాయిలో పరిశీలించి ఫొటోలతో సహా నమోదు చేస్తారు. దీంతో నిజంగా పనులు చేసిన కూలీల వివరాలే నమోదై వారికి వేతనం అందనుంది. ఆర్థికపరమైన అవకతవకలను కూడా నివారించవచ్చని అధికారులు భావిస్తున్నారు.

కూలీలందరికీ పని కల్పిస్తాం

- సాయన్న, డీఆర్‌డీవో, కామారెడ్డి

జాబ్‌కార్డు కలిగి పని కావాలని అడిగిన వారందరికీ ఉపాధి పని కల్పిస్తాం. ప్రస్తుతం ఆర్థిక సంవత్సరంలో పనుల పూర్తికి చర్యలు చేపట్టాం. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టే ఉపాధి పని దినాలు ఖరారు అయ్యాయి. ప్రణాళిక ప్రకారం గ్రామంలో పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటాం.

## మాయా ధరణి

యాచారం : ధరణి పోర్టల్ గ్రామాల్లో రైతులను అష్ట కష్టాలకు గురిచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం 'ధరణి' పోర్టల్‌ను ఆవిష్కరించిన మేడ్చల్ జిల్లా మూడుచింతల పల్లి మండలంలోనే ఇంకా సమస్యలు పరిష్కారం కాలేదు. ఇదొక్క మండలమే కాదు రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని పలుమండలాల్లో వందలమంది రైతులు, భూముల యజమానులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వంద ఫిర్యాదులొస్తే. వీటిల్లో 65 ధరణి పోర్టల్‌కు సంబంధించినవే ఉంటున్నాయి. ఇప్పటికైనా కలెక్టర్లు స్పందించి సమస్యలు పరిష్కరించాలంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఆరు ఎకరాల భూమి లేదు-సింగం రాజు, లక్ష్మాపూర్, మూడుచింతల పల్లి మండలంనా పేరు మీద లక్ష్మాపూర్‌లో 12 ఎకరాల భూమి పాత పట్టాదారు పుస్తకాల్లో నమోదైంది. ధరణి పోర్టల్‌లో కేవలం 6 ఎకరాల భూమి నమోదైంది. మరో 6 ఎకరాల నమోదుకు మండల స్థాయి నుంచి జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకు తిరుగుతూనే ఉన్నా. ప్రజావాణిలో ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా ఫలితం లేదు.

ఐచ్ఛికం(ఆప్షన్) లేదంటున్నారు-జంగయ్య, ఆరుట్ల, మంచాల మండలం పెద్దల నుంచి నాకు సక్రమించిన భూమి ఆరుట్ల సర్వేనంబర్ 371, 373లో 6ఎకరాల 9 గుంటలు ఉంది. తాతల కాలం నుంచి సాగు చేస్తున్నాం. పాసు పుస్తకంలో మాత్రం 3 ఎకరాల 5గుంటలు మాత్రమే వచ్చింది. మిగతా 3 ఎకరాల 4 గుంటల కోసం అధికారులను అడిగితే సమాధానం లేదు. ధరణి వెబ్‌సైట్‌లో మార్పులు చేర్పుల ఐచ్ఛికం లేదంటూ చెబుతున్నారు.

భూమిని మింగేసింది-తిరుపతయ్య, మాడ్గుల

నాకు, నా తమ్ముడికి 5 ఎకరాల 9 గుంటల భూమి వారసత్వంగా వచ్చింది. ఇద్దరం చెరిసగం తీసుకుని సాగు చేసుకుంటున్నాం. అనేక సార్లు బ్యాంకు రుణాలు కూడా తీసుకున్నాం. ధరణి వచ్చాక మా భూమి మాయమైంది. కొత్త పాసు పుస్తకాలు జారీ కాలేదు. అనేక సార్లు అధికారులకు అర్జీ పెట్టుకున్నా పట్టించుకోలేదు.

ఇళ్ల స్థలాలకు ఇచ్చినందుకు శిక్ష-మహమ్మద్ సాదత్, ఘట్టుపల్లి గ్రామం ఘట్టుపల్లి సర్వే నంబరు.12లో మా ఐదుగురు అన్నదమ్ములకు 8 ఎకరాల 22 గుంటల పట్టా భూమి ఉంది. 1972లో పేదల ఇళ్ల స్థలాలకు ఉచితంగా 1.10 ఎకరాలు ప్రభుత్వానికి ఇచ్చాం. మిగిలిన 7-12 ఎకరాల భూమి ధరణిలో నిషేధిత భూముల జాబితాలో చేరింది. పేదల ఇళ్ల స్థలాల కోసం భూమి ఉచితంగా ఇచ్చినందుకు మాకు అధికారులు శిక్ష వేశారు.

# బహుళ అంతస్తుల్లో భద్రత కరువు



మెదక్ : మెదక్ జిల్లాలో బహుళ అంతస్తుల భవన నిర్మాణాలు పెరుగుతున్నాయి. జిల్లా కేంద్రంలో అపార్ట్‌మెంట్ కల్చర్ విస్తరిస్తున్నది. కానీ బహుళ అంతస్తుల నిర్మాణాల్లో భద్రతా ప్రమాణాలు పాటించలేదనే విమర్శలున్నాయి. మెదక్ మున్సిపాలిటీ పరిధిలోని రెండు, మూడంతుస్తులకు అనుమతులు తీసుకుని ఐదారు అంతస్థులు నిర్మిస్తున్నారు. సెల్లార్లలో షాపులు ఏర్పాటు చేసుకొని అద్దెకిస్తున్నారు. అపార్ట్‌మెంట్లతో పాటు విద్యాసంస్థలు, సినిమా హాళ్లు, ఆసుపత్రులు, వాణిజ్య సముదాయాల్లో అగ్నిప్రమాదాలు చోటుచేసుకుంటే బయట పడటానికి మార్గాలు ఏర్పాటు చేసుకోవడం లేదు. ఇటీవల హైదరాబాద్‌లో ఓ షాపింగ్ కాంప్లెక్స్‌లో జరిగిన అగ్ని ప్రమాదంలో పెద్దఎత్తున ప్రాణనష్టం, ఆస్తినష్టం జరిగిన విషయం విధితమే. ఈ నేపథ్యంలో జిల్లాలోనూ బహుళ అంతస్థుల భవనాల్లో అగ్నిప్రమాదం చేటుచేసుకుంటే పరిస్థితి తీవ్రంగా ఉంటుందనే ఆందోళన వ్యక్తమవుతున్నది.

నిబంధనలకు నీళ్లుజీవో నంబర్ 168 ప్రకారం 15 మీటర్ల ఎత్తులో అపార్ట్‌మెంట్లు నిర్మించుకోవడానికి అగ్నిమాపక శాఖ, తదితర ప్రభుత్వ శాఖల నుంచి అనుమతులు అవసరం లేదు. కానీ వాణిజ్య భవనాలకు మాత్రం అనుమతులు తప్పనిసరి. ఆస్పత్రులు, హొటళ్లు, పాఠశాలలు, షాపింగ్‌మాల్స్, వాణిజ్య నిర్మాణాలు 15 మీటర్ల కంటే ఎత్తు తక్కువ ఎత్తులో నిర్మించినా జీవో నంబర్ 56 ద్వారా భద్రత పరమైన అనుమతులు తీసుకోవాలి. గదుల నుంచి రాకపోకలకు మెట్ల దారి, అత్యవసర పరిస్థితుల్లో బయటకు వెళ్లడానికి ఎమర్జెన్సీ ద్వారాలను ఏర్పాటు చేసుకోవాలి. ఐదంతస్తుల భవనం కనీసం 500 గజాల స్థలంలో నిర్మాణం చేపట్టాలి. 760 గజాలకు పైగా స్థలంలో నిర్మిస్తే సెల్లార్‌ను ఏర్పాటు చేయాలి. సెల్లార్‌ను కేవలం పార్కింగ్‌కే ఉపయోగించుకోవాలి. 15 మీటర్ల ఎత్తులో నివాస అపార్ట్‌మెంట్లు నిర్మించుకోవడానికి అనుమతులు అవసరం లేదనే మినహాయింపును ఆసరాగా చేసుకుని పదుల సంఖ్యలో వాణిజ్య భవన నిర్మాణాలు చేపడుతున్నారు. నివాస భవనాల పేరిట ఆస్పత్రులు, కళాశాలలు, పాఠశాలలు బహుళ అంతస్తుల్లో నిర్వహిస్తున్నారు. షాపింగ్ మాల్స్, లాడ్జ్‌లు, హొటళ్లు కూడా ఏర్పాటు చేస్తున్నారు. ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవడం లేదు. మెదక్ జిల్లాలో ఇప్పటి వరకు బహుళ అంతస్తుల భవనాల నిర్మాణ అనుమతులకు దరఖాస్తులు రాలేదని అగ్నిమాపకశాఖ అధికారి గౌతమ్ తెలిపారు.

# యాసంగిలోనూ వరి సాగుకే మొగ్గు



మెదక్ : యాసంగి సీజన్‌లో సంగారెడ్డి జిల్లాలో వరి సాగు రికార్డు స్థాయిలో పెరిగింది. ఆరుతడి పంటల సాగుకు ప్రాధాన్యమివ్వాలని వ్యవసాయశాఖ అవగాహన కల్పించినా రైతులు పట్టించుకోలేదు. జిల్లాలో కొన్నేళ్లుగా ప్రధాన పంటగా వరిని సాగు చేయడానికే రైతులు మొగ్గు చూపారు. వానాకాలంలో జిల్లాలో వర్షాలు సమృద్ధిగా కురియడం, భూగర్భ జలం పెరగడంతో యాసంగిలోనూ వరిసాగు చేయడానికి దోహదపడ్డాయి. గత వర్షాకాలంలో జూన్ నుంచి అక్టోబరు నెలాఖరు వరకు జిల్లా సగటున కంటే అధికంగా 200 మి.మీ.ల వర్షం అధికంగా కురిసింది. జిల్లాలో సగటున 831.2 మి.మీ.ల వర్షాలు కురియాల్సి ఉండగా, 1.040.4 మి.మీ.ల వర్షం కురిసింది. దీనికి తోడు కర్ణాటక నుంచి మంజీర నదికి వరదలు వచ్చి, సింగూరు ప్రాజెక్టు పూర్తిగా నిండింది. దీంతో జిల్లాలో మంజీరా నది ప్రవహించే మనూర్ మండలం నుంచి సింగూర్ ప్రాజెక్టు వరకు భూగర్భ జలమట్టం పెరిగింది. జిల్లాలో సగటున భూగర్భ జలమట్టం 11.04 మీటర్లుగా ఉన్నట్టు భూగర్భ జలశాఖ పేర్కొన్నది. వర్షాలు ఎక్కువగా కురిసిన ప్రాంతాలతోపాటు మంజీర నది పరీవాహక ప్రాంతాలైన అందోలు, పుల్కల్, నారాయణఖేడ్, మనూర్, వట్‌పల్లి, న్యాల్‌కల్, ఝరాసంగం, మొగుడంపల్లి, జిన్నారం, అమీన్‌పూర్ తదితర ప్రాంతాల్లో భూగర్భ జలాలు 10 మీటర్ల లోపే ఉన్నట్లు ఆ శాఖ తెలిపింది. బోర్లు, బావుల నుంచి నీళ్లు పుష్కలంగా వస్తుండడంతో రైతులు వరి పంటను ఎక్కువగా సాగు చేశారు. అయితే 2019-20 సంవత్సరం యాసంగి సీజన్ నుంచే వరి సాగును బాగా తగ్గించాలని, ఆరుతడి పంటల సాగుకు మొగ్గు చూపాలని ప్రభుత్వం రైతులను కోరింది. యాసంగి సీజన్‌లో సాగునీటి లభ్యత తక్కువగా ఉంటుందన్న కారణంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నది. ఆ మేరకు జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు కూడా రైతు సదస్సులు నిర్వహించి అవగాహన కల్పించారు. అయినా రైతులు పట్టించుకున్నట్టు కనిపించడం లేదు.

పుష్కలంగా నీటి లభ్యత

జిల్లాలో సాగునీటి లభ్యత ఉండడంతో రైతులు యాసంగి సీజన్‌లో వరిని సాగు చేయడానికి మొగ్గు చూపారు. జిల్లాలో సింగూరు, నల్లవాగు ప్రాజెక్టు కాల్వల ద్వారా సుమారు 50 వేల ఎకరాల వరకు సాగు నీళ్లు అందుతున్నాయి. మిగిలిన విస్తీర్ణంలో వరి సాగుకు వ్యవసాయ బోరు బావుల నీటినే వాడుతున్నారు. ఇందుకు బోరు బావుల్లో నీళ్లు ఎక్కువగా ఉండడం, కరెంట్ సరఫరాలో అంతరాయాలు లేకపోవడంతో వరిని అధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. గత రెండు సీజన్ల సగటును పరిశీలిస్తే 2020-21 యాసంగి సీజన్‌లో అన్ని పంటలు 1,39,587 ఎకరాల్లో సాగు చేశారు. ఇందులో అత్యధికంగా వరిని 81,507 ఎకరాల్లో సాగు చేశారు. 2021-22 యాసంగి సీజన్‌లో 1,39,352 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయగా వరి 35,252 ఎకరాల్లో సాగు చేశారు. వర్షాలు ఆశించిన స్థాయిలో లేకపోవడంతో వరి సాగు తగ్గిందని అధికార వర్గాలు తెలిపాయి. నీటి అవసరం తక్కువగా ఉండే ఆరుతడి పంటలైన శనగ, జొన్న పంటలను ఎక్కువగా సాగు చేశారు.

రికార్డుస్థాయిలో నాట్లుప్రస్తుత యాసంగి సీజన్‌లో సంగారెడ్డి జిల్లాలో 1,81,073 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేస్తున్నారు. ఇందులో అత్యధికంగా వరిని 1,08,796 ఎకరాల్లో సాగు చేశారు. యాసంగి సీజన్‌లో ఈస్థాయిలో వరి సాగు చేయడం జిల్లాలో గతంలో ఎప్పుడూ లేదని అధికారులు పేర్కొంటున్నారు. వాతావరణం అనుకూలించడంతో ఈ సీజన్‌లో ధాన్యం దిగుబడి కూడా ఎక్కువగానే ఉంటుందని అభిప్రాయపడుతున్నారు.

# దక్షిణమధ్య రైల్వేకు జలసిరి




హైదరాబాద్ : జలసంరక్షణకు దక్షిణమధ్య రైల్వే తీసుకుంటున్న చర్యలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. సహజవనరులను వినియోగించుకొని కరెంటును పొదుపు చేయడంలోనే కాదు.. పెద్ద ఎత్తున ఇంకుడుగుంతలు ఏర్పాటు చేసి వాన నీటిని ఇంకించడంలోనూ ముందుంది. గతంలో 24 బోగీలున్న రైలును శుభ్రం చేయడానికి 3600ల లీటర్ల నీటిని వినియోగించేవారు. 12 మంది 6 గంటలు పని చేసేవారు. ఇప్పుడు కాచిగూడ రైల్వే స్టేషన్లో ఏర్పాటు చేసిన ఆటోమేటిక్ కోచ్ వాషింగ్ ప్లాంటుతో కేవలం ఒకరి పర్యవేక్షణలో 1440 లీటర్ల నీటితో పని పూర్తవుతోంది. ఇలా అన్ని విభాగాల్లో 60 శాతం పొదుపును పాటించిందని ద.మ. రైల్వే ముఖ్య ప్రజాసంబంధాల అధికారి సీహెచ్. రాకేష్ తెలిపారు.

వర్షాకాలానికి సర్వం సిద్ధం..ద.మ.రైల్వే ఏటా వర్షాకాలానికి ముందు జలసంరక్షణపై సమీక్ష ఏర్పాటు చేసి.. పాత ఇంకుడుగుంతలను పునరుద్ధరించడం, కొత్తవి తవ్వించడం చేస్తోంది. ఈ ఏడాది నగరంలోని రైల్వే ఆధీనంలో ఉన్న కార్యాలయాలు, నివాసాలు, శిక్షణ కేంద్రాలు, మెకానిక్ షెడ్డులు ఇలా అన్ని చోట్ల 3 వేలకు పైగా కొత్తవి తవ్వాలని.. వాటిలోకి వర్షపు నీరు వెళ్లేందుకు ఇనుప జాలీలను పెట్టేందుకు సిద్ధమౌతోంది.

5 లక్షల లీటర్ల నీటి వినియోగానికి..

సికింద్రాబాద్ రైలునిలయం, హైదరాబాద్, సికింద్రాబాద్ రైల్వే డివిజన్ కార్యాలయాలు, వర్కుషాపులు..ఇలా అన్ని భవనాల పై కప్పుల నుంచి జారిపడే వర్షపు నీటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకుంటున్నారు. వీటికి తోడు రైల్వే నివాసాలు, కార్యాలయ ఆవరణలు, రైల్వే స్టేషన్ల పరిసరాల్లో ఇంకుడు గుంతలను తవ్వాలని నిర్ణయించింది. వీటి ద్వారా సాలార్‌జంగ్ బావి, హెరిటేజ్ మెట్ల బావి, జడ్ఆర్‌టీఐలోని పాత బావి, ఆలుగడ్డబావిలో 5 లక్షల లీటర్లను ప్రతి రోజు వినియోగించుకునేలా నీటిని ఇంకుడుగుంతల ద్వారా సమకూర్చాలని భావిస్తోంది.

జలసంరక్షణకు తీసుకోనున్న చర్యలు

17 పురాతన మెట్ల బావుల పునరుద్ధరణ.

రోజుకు 7.2 లక్షల లీటర్ల నీటి వినియోగం

ఏటా రూ. 5.2 కోట్ల ఆదా

34 పాత బోర్లకు పునరుజ్జీవం

17.79 హెక్టార్లలో 80 కొత్త నీటి కుంటల నిర్మాణం

39 ఎండిపోయిన కుంటలకు జీవం

# చెరువును చెరపట్టారు

హైదరాబాద్ :వందేళ్ల చరిత్ర గల చెరువును కబ్జాదారులు చెరబట్టారు. అందులోని దాదాపు 43.81 ఎకరాలు కొన్నేళ్లుగా కొందరి ఆధీనంలోకి వెళ్లిపోయింది. తాజాగా చెరువు చుట్టూ ఉన్న ఎఫ్‌టీఎల్ బఫర్‌జోన్‌లోని భూములను బండరాళ్లతో నింపేస్తున్నారు. ఇక్కడ నిర్మాణాలు చేయడానికి కొందరు ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగా పైభాగం నుంచి చెరువులోకి వచ్చే కాలువను కూడా పెద్ద పెద్ద బండరాళ్లతో పూడ్చివేసే పని మొదలు పెట్టారు. ఇది పూర్తయితే ఈ చెరువులోకి చుక్కనీరు కూడా రాదని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నగర శివారు పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం పరిధిలోని కుంట్లూరు పెద్ద చెరువు దుస్థితి ఇది. ఇంత జరుగుతున్నా రెవెన్యూ, సాగునీటి శాఖ అధికారులు కిమ్మనకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

సగం చెరువును పట్టా భూమిగా మార్చేసి..

కుంట్లూరు పెద్ద చెరువు 95.02 ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. కొన్నేళ్ల కిందట ఈ చెరువు కింద పెద్దఎత్తున రైతులు సాగు చేసేవారు. మారిన పరిణామాల నేపథ్యంలో సాగు నిల్చిపోయింది. దీంతో చెరువులో మత్స్యకార సంఘం చేపల పెంపకాన్ని మొదలుపెట్టింది. అనేకమంది మత్స్యకారులు దీనిపైనే ఆధారపడి జీవనం సాగిస్తున్నారు. కొన్నేళ్లుగా అటు సాగునీటి శాఖ.. ఇటు రెవెన్యూ అధికారులు చెరువు గురించి



పట్టించుకోకపోవడంతో ఆక్రమణదారుల కన్నుపడింది. చెరువులో నీటి ప్రవాహం తగ్గిన తరువాత అప్పట్లో కొందరు సాగు చేసుకునేవారు. అధికారులు ఈ వైపు చూడకపోవడంతో ఈ 43.8 ఎకరాలను నెమ్మదిగా తమ పరంచేసుకున్నారు. రెవెన్యూ అధికారులను కూడా తమకు అనుకూలంగా మార్చుకుని ఈ మొత్తం భూమిని పట్టా భూమిగా మార్చుకున్నారు. దీంతో ఇప్పుడు చెరువు కేవలం 51.21 ఎకరాల విస్తీర్ణానికే పరిమితమైంది. నిబంధనల ప్రకారం చెరువులోకి నీటి ప్రవాహన్ని అడ్డుకునేలా ఎఫ్‌టీఎల్‌లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీలులేదు. కేవలం వ్యవసాయం మాత్రమే చేసుకోవాలి. బఫర్ జోన్‌లో కూడా ఎటువంటి నిర్మాణాలు చేయకూడదు.

వరద చేరకుండా కల్వర్టులను మూసేసి..

స్థానికంగా పేరున్న కొందరు పెద్దలు పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో పెద్ద బండరాళ్లు తెచ్చి పూడ్చేస్తున్నారు. ఓ రసాయన కంపెనీలోని మట్టి తీసుకొచ్చి నింపేస్తున్నారు. రసాయనాలతో కూడిన మట్టి వల్ల చెరువులోని చేపలు చచ్చిపోయే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నాగోల్-పెద్దఅంబర్‌పేట్ రోడ్డులో చెరువులోకి వరదనీరు వెళ్లే కల్వర్టును సైతం బండరాళ్లతో పూడ్చేస్తున్నారు. జేసీబీతో పెద్దఎత్తున పనులు చేపట్టారు. హయత్‌నగర్ పరిధి భాగ్యలత కాలనీ, హైకోర్టు కాలనీ, లెటక్చరర్ కాలనీ మీదుగా హాతీగూడ చెరువు నుంచి కుంట్లూర్ పెద్ద చెరువులోకి వెళ్లే కల్వర్టులను మూసేశారు. వరదనీరు వెళ్లేందుకు వీలులేకుండా చేస్తున్నారు. దీంతో చెరువు ఉనికి ప్రశ్నార్థకంగా మారనుంది. ఇప్పటికైనా రెవెన్యూ, సాగునీటి శాఖ అధికారులు స్పందించి చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధులను గుర్తించే హద్దులను ఏర్పాటు చేయాలని స్థానికులు చెబుతున్నారు. ఈ కబ్జా తంతుపై మత్స్యకార సంఘం ఫిర్యాదు చేసినా అధికారులు స్పందించడం లేదు. ఈ పరిస్థితిపై చెరువునే నమ్ముకొని జీవనోపాధి పొందుతున్న కుంట్లూర్ గ్రామంలోని మత్స్యకారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

కేసులు నమోదు చేశాం- గంగ, సాగునీటి శాఖ ఏఈఈఫిర్యాదులు రావడంతో రెవెన్యూ అధికారులతో కలిసి పెద్ద చెరువును పరిశీలించాం. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయించాం. పెద్ద చెరువు ఎఫ్‌టీఎల్, బంఫర్ జోన్ పరిధిలో బండరాళ్లు, మట్టిపోస్తే పరిశీలించి తీయిస్తాం. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. పైస్థాయి నుంచి వచ్చే ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటాం.

## మత్తు ముఠాల కొత్త ఎత్తులు

హైదరాబాద్: గంజాయి స్మగ్లర్లు వాటి రవాణాకు హైదరాబాద్ కేంద్రంగా కొత్త ఎత్తులు వేస్తున్నారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ పోలీసులు మూకుమ్మడి దాడులతో ప్రధాన స్మగ్లర్ల ఆట కట్టించారు. దాంతో మహారాష్ట్ర, కర్ణాటకకు హైదరాబాద్ మీదుగా సరఫరాకు గండి పడింది. ఈ నేపథ్యంలో ఆంధ్ర-ఒడిశా సరిహద్దు (ఏవోబీ), విశాఖపట్టణం ఏజెన్సీ ప్రాంతాల్లో లక్షల టన్నుల గంజాయి పేరుకుపోయింది. దీన్ని వేసవి ముగిసే లోపు తరలించేందుకు స్మగ్లర్లు సిద్ధమయ్యారు. ధూల్‌పేట్, మంగళ్‌హాట్, రాజేంద్రనగర్, శేరిలింగంపల్లి, మేడ్చల్ తదితర ప్రాంతాల్లోని దళారులతో మంతనాలు జరిపి, ఏపీ నుంచి హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని గోదాములకు సరకు తరలిస్తే వాహనానికి రూ.1 - 1.50 లక్షల కిరాయి చెల్లించేలా ఒప్పందాలు చేసుకుంటున్నారు. ఇక్కడి గోదాముల నుంచి మరో



వాహనంలో మహారాష్ట్రకు సరకు చేరవేస్తారు. దాని కోసం రూ.2 లక్షలు కిరాయి ఇస్తున్నారు.

ఖాళీ బండి.. ఆదాయం దండిఏదైనా సరకు దిగుమతి చేశాక లారీలు, డీసీఎంలు వందల కిలోమీటర్లు ఖాళీగా తిరిగి వెళ్లేందుకు మక్కువ చూపరు. కిరాయి దొరికే వరకు వేచిచూస్తారు. ఇందుకు భిన్నంగా ఖాళీగా ప్రయాణిస్తున్న లారీలను పోలీసులు తనిఖీ చేసినప్పుడు అసలు విషయం బయటపడింది. వాహనాల్లో క్యాబిన్, డీజిల్‌ట్యాంకర్, ట్రక్కు భాగాల్లో 100-500 కిలోల సరకు నిల్వ చేసేలా ప్రత్యేకంగా బాక్సులు తయారు చేయించి వాటిలో గంజాయి తరలిస్తున్నారు. రాజేంద్రనగర్ వద్ద పట్టుబడిన 2 ఖాళీ డీసీఎంల్లో 700 కిలోల గంజాయితో అంతరాష్ట్ర ముఠాలు పట్టుబడ్డాయి.

# గాంధీ కలలు కన్న గ్రామస్వరాజ్యాన్ని నిజం చేశాం: సీఎం జగన్



గుంటూరు: జాతిపిత మహాత్మాగాంధీ 154వ జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎక్స్ అకౌంట్‌లో ఆయన నివాళి సందేశం ఉంచారు. "మహాత్మా గాంధీ గారి మాటలు ఆదర్శంగా... రాష్ట్ర ప్రజలందరి సంక్షేమమే లక్ష్యంగా పాలన చేస్తున్నాం. గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థ ద్వారా గాంధీ గారు కలలు కన్న గ్రామ స్వరాజ్యాన్ని నిజం చేశాం. మునుముందు కూడా ఆయన చూపిన మార్గంలోనే నడుస్తాం. నేడు మహాత్మా గాంధీ గారి జయంతి సందర్భంగా నివాళులు" అని పేర్కొన్నారాయన.

**జై జవాన్, జై కిసాన్.. పిలుపు నేటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంది:** భారత దేశ మాజీ ప్రధాన మంత్రి లాల్ బహదూర్ శాస్త్రి 119వ జయంతి సందర్భంగా నివాళులర్పిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ట్వీట్ చేశారు. స్వాతంత్ర్య సమర యోధుడిగా, మాజీ ప్రధానిగా లాల్ బహదూర్ శాస్త్రిగారు దేశానికి అందించిన సేవలు చిరస్మరణీయమని ఈ సందర్భంగా గుర్తు చేశారాయన.

'జై జవాన్, జై కిసాన్' అంటూ ఆయన ఇచ్చిన పిలుపు నేటికీ ప్రతిధ్వనిస్తూనే ఉంది. ఆయన తీసుకున్న ఎన్నోవిప్లవాత్మక సంస్కరణలు దేశాన్ని శిఖరాగ్రాన నిలిపాయి.

నేడు లాల్ బహదూర్ శాస్త్రిగారి జయంతి సందర్భంగా నివాళులు అని సీఎం వైఎస్ జగన్ ట్వీట్ చేశారు.

# ఛారిటబుల్ ట్రస్ట్‌కు 25 ఏళ్లు.. చిరంజీవి ఆసక్తికర పోస్ట్



హైదరాబాద్: చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించి ఎంతోమందికి సేవలు అందిస్తున్నారు అగ్ర కథానాయకుడు చిరంజీవి. ఈ ట్రస్ట్‌ను మొదలుపెట్టి నేటితో పాతికేళ్లు అవుతోంది. ఈ సందర్భంగా ఆయన ట్రస్ట్‌ను ప్రారంభించిన నాటి రోజులను గుర్తు చేసుకున్నారు.

"దేశ ప్రజలకు ఈరోజు ఎంతో ముఖ్యమైనది. ఈ సందర్భంగా నేను చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ ప్రారంభించిన నాటి క్షణాలను గుర్తు చేసుకుంటున్నా. 25 ఏళ్ల అద్భుతమైన ప్రయాణమిది. ఇప్పటివరకూ 10 లక్షల బ్లడ్ యూనిట్లను సేకరించి అవసరమైన వారికి అందజేశాం. 10 వేల మందికి కంటిచూపు వచ్చేలా చేశాం. కరోనా సమయంలో వేల మందికి సాయం అందించాం. తోటి మానవాళికి సాయం చేయడం వల్ల పొందిన సంతృప్తిని మాటల్లో వర్ణించలేం. సీసీటీ వేదికగా మానవతా కార్యక్రమాల్లో భాగమై తమ వంతు సాయం చేస్తున్న వారందరికీ సెల్యూట్ చేస్తున్నా. మన దేశానికి మనం చేస్తున్న చిరు సాయం ఇది" అంటూ చిరు తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ పెట్టారు. సాధారణ నటుడి నుంచి స్టార్ హీరోగా ఎదిగిన క్రమంలో తోటివారికి తన వంతు సాయం చేయాలనే గొప్ప సంకల్పంతో చిరంజీవి.. సీసీటీని ప్రారంభించారు. 1998 అక్టోబర్ 2 నుంచి ఇది మొదలైంది. సీసీటీలో భాగంగా బ్లడ్, ఐ బ్యాంకులను మొదలుపెట్టారు. కరోనా సమయంలో ఆక్సిజన్ సిలిండర్లను సైతం సరఫరా చేశారు. సినిమాల విషయానికొస్తే.. చిరంజీవి ప్రస్తుతం వశిష్ఠ దర్శకత్వంలో వర్క్ చేస్తున్నారు. ఈ సినిమా ప్రీ ప్రొడెక్షన్ పనులు జరుగుతున్నాయి.



# హైదరాబాద్‌లో ఎన్టీఆర్ కుటుంబసభ్యుల దీక్ష

హైదరాబాద్: తెదేపా అధినేత చంద్రబాబును అక్రమంగా అరెస్ట్ చేశారంటూ హైదరాబాద్‌లోని ఎన్టీఆర్ ట్రస్ట్ భవన్‌లో ఎన్టీఆర్ కుటుంబసభ్యులు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ దీక్షలో ఎన్టీఆర్ కుమార్తె గారపాటి లోకేశ్వరి, నందమూరి బాలకృష్ణ సతీమణి వసుంధర, గారపాటి శ్రీనివాస్, చలసాని చాముండేశ్వరి, నారా రోహిత్ తల్లి ఇందిర, తారకరత్న సతీమణి అలేఖ్యరెడ్డి, నందమూరి జయశ్రీ, సుధ, శిల్ప, దీక్షిత, రాహుల్, తారకరత్న కుమార్తె నిష్క తదితరులు పాల్గొన్నారు. తెలంగాణ తెదేపా రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌తో పాటు ఇతర ముఖ్యనేతలు, కార్యకర్తలు దీక్షకు కూర్చొన్నారు. సాయంత్రం 5 గంటల వరకు తెదేపా నేతల దీక్ష కొనసాగంది. మరోవైపు ఎన్టీఆర్ ఘాట్‌లో నందమూరి హరికృష్ణ కుమార్తె సుహాసిని దీక్ష చేపట్టారు. ఆమెతో పాటు కేంద్రమాజీ మంత్రి పనబాక లక్ష్మి తదితరులు పాల్గొన్నారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని ఈ సందర్భంగా కార్యకర్తలు డిమాండ్ చేశారు. 'సైకో పోవాలి.. సైకిల్ రావాలి' అంటూ నినాదాలు చేశారు.




# సూర్యోదయాన్ని ఆపడానికి చేతులు అడ్డుపెట్టడం మూర్ఖత్వమే!: మురళీమోహన్

హైదరాబాద్‌లో హైటెక్ సిటీ ప్రారంభానికి అమెరికా ఆనాటి అధ్యక్షుడు బిల్ గేట్స్‌ను తీసుకొచ్చిన ఘనత చంద్రబాబుదే అని మురళీమోహన్ కొనియాడారు. అలాంటి గొప్ప వ్యక్తిని అక్రమంగా అరెస్టు చేసి జైల్లో నిర్బంధించడం బాధాకరమన్నారు. ఉదయించే సూర్యోదయాన్ని ఆపడానికి చేతులు అడ్డుపెట్టడం మూర్ఖత్వం అవుతుందని వ్యాఖ్యానించారు. చంద్రబాబు తిరిగి బయటకు వస్తారని.. ఆయన సారథ్యంలో ఏపీ అభివృద్ధి జరుగుతుందని మురళీమోహన్ చెప్పారు.




దిల్లీ: నేరాలను దర్యాప్తు చేసిన అనుభవమో ఏమోగానీ.. ఓ పోలీసే స్వయంగా హత్య చేసి రెండేళ్లు చట్టానికి దొరక్కుండా తప్పించుకున్నాడు. పైగా హత్యకు గురైన వ్యక్తి బతికే ఉన్నట్లు అందరినీ నమ్మించాడు. అంతటితో ఆగకుండా బాధితురాలి కుటుంబంతో సత్సంబంధాలు కొనసాగించాడు. చివరకు పోలీసులకు చిక్కి.. ఊచలు లెక్కపెడుతున్నాడు. ఈ ఘటన దేశ రాజధాని దిల్లీలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సురేంద్ర రాణా (42) దిల్లీ పోలీసు విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. తాజా కేసులో బాధితురాలైన మోనా 2014లో కానిస్టేబుల్‌గా చేరారు.

అప్పట్లో వీరిద్దరూ కంట్రోల్ రూమ్‌కు డిప్యుటేషన్‌పై వెళ్లారు. అక్కడే వీరి మధ్య పరిచయం ఏర్పడింది. కొంతకాలం తర్వాత యూపీ పోలీసు విభాగంలో మోనాకు ఎస్ఐగా ఉద్యోగం వచ్చింది. కానిస్టేబుల్‌గా మానేసి దిల్లీలోనే సివిల్స్‌కు సన్నద్ధమవడం ప్రారంభిం చింది. సురేంద్ర మాత్రం ఆమెను ఫాలో అవుతూనే ఉన్నాడు. దీన్ని గమనించిన మోనా.. అతణ్ని వారించింది. 2021 సెప్టెంబరు 8న వీరి మధ్య గొడవ జరిగింది. తర్వాత ఆమెను సురేంద్ర ఓ నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి గొంతు నులిమి చంపేశాడు. శవాన్ని మురుగు కాల్వలో పడేశాడు. పైకి తేలకుండా శవంపై పెద్ద బండరాళ్లను పెట్టాడు.

**కరోనా టీకాను ఆయుధంగా చేసుకొని కట్టుకథ..** ఇక్కడి నుంచి సురేంద్ర చిన్నగా కట్టుకథ అల్లడం ప్రారంభించాడు. మోనా కుటుంబ సభ్యులకు ఫోన్ చేశాడు. అర్వింద్ అనే వ్యక్తితో ఆమె వెళ్లిపోయినట్లు తెలిపాడు. మోనా కోసం తాను గాలిస్తున్నట్లు వారిని నమ్మించాడు. వారితో కలిసి పలుసార్లు పోలీస్ స్టేషన్‌కు కూడా వెళ్లాడు. ఆమె బతికే ఉన్నట్లు నమ్మించడం కోసం.. ఓ మహిళకు కరోనా వ్యాక్సిన్ వేయించాడు. ఏదోలా మేనేజ్ చేసి మోనా పేరిట వ్యాక్సిన్ సర్టిఫికెట్ పుట్టించాడు. మోనా బ్యాంకు ఖాతా నుంచి తరచూ లావాదేవీలు జరిపాడు. సిమ్ కార్డును కూడా ఉపయోగించాడు. మొత్తానికి ఆమె బతికే ఉన్నట్లు కుటుంబ సభ్యులను, పోలీసులను నమ్మించాడు. ఈ క్రమంలో మోనా ఎక్కడుందో తనకు సమాచారం వచ్చిందంటూ మోనా కుటుంబ సభ్యులను సురేంద్ర వివిధ నగరాలకు తీసుకెళ్లాడు. అక్కడితో ఆగకుండా తన బావమరిది రాబిన్‌నూ ఇందులోకి దింపాడు. అతనితో అర్వింద్‌లా మాట్లాడిస్తూ ఆ కుటుంబాన్ని ఏమార్చే ప్రయత్నం చేశాడు. ఓసారి రాబిన్ ఫోన్‌లో మాట్లాడుతూ.. తాను మోనాతో కలిసి గురుగ్రామ్‌లో ఉన్నట్లు చెప్పాడు. తన కుటుంబ సభ్యులు తమని గాలిస్తున్నారని.. మరో 15 రోజుల్లో మీ దగ్గరకు వస్తామని మోనా కుటుంబ సభ్యులకు నమ్మబలికాడు. మోనాతో మాట్లాడించమని వారు కోరగా.. తను మీతో మాట్లాడడానికి భయపడుతోందని సర్దిచెప్పాడు.




రోడ్డు ప్రయాణాల సమయంలో టెక్నాలజీని నమ్ముకొని సొంతంగా ఆలోచించడం మానేస్తే.. అది ప్రాణాంతకంగా మారుతుందని కేరళలో జరిగిన ఈ ఘటన చెబుతోంది. ఇద్దరు యువ డాక్టర్లు జీపీఎస్‌ను నమ్ముకొని కారు నదిలోకి నడిపించి ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి కేరళలోని ఎర్నాకుళం జిల్లాలో చోటు చేసుకొంది. కొల్లాంకు చెందిన డాక్టర్ అద్వైత్ (28), త్రిశూర్‌కు చెందిన డాక్టర్ అజ్మల్ (28) ఓ ప్రైవేటు వైద్యశాలలో పనిచేస్తున్నారు. వీరు కొడుంగల్లూరుకు చెందిన ఆస్పత్రిలో విధులు ముగించుకొని శనివారం రాత్రి ఇళ్లకు బయల్దేరారు. వీరితోపాటు డాక్టర్ తబ్సిర్, ఎంబీబీఎస్ విద్యార్థిని తమన్నా, నర్స్ జిస్మాన్ కూడా హోండా సివిక్ కారులో ఎక్కారు. డాక్టర్ అద్వైత్ డ్రైవింగ్ సీట్లో కూర్చొన్నాడు. మర్నాడు అతడి పుట్టిన రోజు. దీంతో వారు కొంచెం షాపింగ్ చేసి తిరుగు ప్రయాణమయ్యారు. ప్రయాణ సమయంలో భారీ వర్షం పడుతుండటంతో రోడ్డు మార్గం సరిగా కనిపించడంలేదు. అద్వైత్ జీపీఎస్ అనుసరించి డ్రైవింగ్ చేస్తున్నట్లు అతడి పక్కన కూర్చొన్న ఎంబీబీఎస్ విద్యార్థిని తమన్నా చెప్పింది. ఈ క్రమంలో జీపీఎస్ రీరూటైంది. దానిని అనుసరించిన అతడు మార్గం మధ్యలో నీరు నిలిచి ఉన్న ప్రాంతాన్ని రోడ్డుగా భ్రమించాడు. కారును నేరుగా నీటిలోకి తీసుకెళ్లాడు. అది నది అని గుర్తించేలోపే వారి కారు నీటిలో మునిగిపోయింది. ఈ ఘటన అర్ధరాత్రి 12.30 సమయంలో చోటు చేసుకొంది. స్థానికులు స్పందించి ముగ్గురిని రక్షించారు. అద్వైత్, అజ్మల్ ఈ ఘటనలో ప్రాణాలు కోల్పోయారు. జీపీఎస్ సాధారణంగా తక్కువ ట్రాఫిక్ ఉన్న వైపు మార్గాన్ని సూచిస్తుంటుందని.. ఆ మార్గాలు అంత సరక్షితమైనవి కాదని నిపుణులు చెబుతున్నారు.




తెలుగు రాష్ట్రాల్లో 60కి పైగా ప్రాంతాల్లో ఎన్ఐఏ సోదాలు జరుగుతున్నాయి. ఏపీ, తెలంగాణలోని పౌరహక్కుల నేతలు, అమరబంధు మిత్రుల సంఘం నాయకుల ఇళ్లలో అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. మావోయిస్టు సంఘాలతో సంబంధాల కేసులో ఈ సోదాలు చేస్తున్నారు. హైదరాబాద్‌లో భవాని, న్యాయవాది సురేశ్ ఇళ్లలో తనిఖీలు జరుగుతున్నాయి. వరంగల్‌లోని హంటర్ రోడ్డులో చైతన్య మహిళా మండలి సభ్యులు అనిత, శాంతమ్మ ఇళ్లల్లో సోదాలు నిర్వహిస్తున్నారు. నెల్లూరులోని ఉస్మాన్ సాహెబ్‌పేటలో ఎల్లంకి వెంకటేశ్వర్లు, తిరుపతిలో క్రాంతి చైతన్య, గుంటూరులో డాక్టర్ రాజారావు ఇళ్లలో ఎన్ఐఏ అధికారులు తనిఖీ చేశారు. తిరుపతి జిల్లా చిల్లకూరు మండలంలో కుల నిర్మూలన పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కావలి బాలయ్య ఇంటిలో సోదాలు జరుగుతున్నాయి. గతంలో బాంబు పేలుళ్ల కేసులో బాలయ్య కుమార్తె పద్మ, అల్లుడు శేఖర్ నిందితులుగా ఉన్నారు. గుంటూరు జిల్లా కొండపాటూరులో తమలపాకుల సుబ్బారావు, ప్రకాశం జిల్లా చీమకుర్తిలో కుల నిర్మూలన పోరాట సమితి నాయకుడు దుడ్డు వెంకట్రావు, సంతమాగులూరులో ఓరు శ్రీనివాసరావు, రాజమహేంద్రవరంలోని బొమ్మేరులో పౌర హక్కుల నేత నాజర్, హార్లిక్స్ ఫ్యాక్టరీ ఉద్యోగి కోనాల లాజర్, శ్రీకాకుళంలో మిస్కా కృష్ణయ్య ఇళ్లలోనూ సోదాలు జరుగుతున్నాయి. కృష్ణయ్య ఆమదాలవలస మండలం తోటవాడ ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. అనంతపురంలో ఉపాధ్యాయుడు శ్రీరాములు ఇంట్లోనూ ఎన్ఐఏ అధికారులు సోదాలు నిర్వహించారు.

# మాజీ మంత్రి నారాయణకు మరోసారి సీఐడీ నోటీసులు



అమరావతి: అమరావతి ఇన్నర్ రింగ్‌రోడ్డు కేసులో మాజీ మంత్రి నారాయణకు మరోసారి సీఐడీ నోటీసులు ఇచ్చింది. ఈనెల 4న తెదేపా జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌తో పాటు విచారణకు హాజరుకావాలని నోటీసుల్లో పేర్కొంది. నోటీసులపై నారాయణ స్పందించారు. "సీఐడీ నోటీసుల ప్రకారం ఈనెల 4న విచారణకు హాజరవుతాను. వివరాలన్నీ అధికారులకు వెల్లడిస్తాను. ప్రస్తుతం ఈ వ్యవహారం కోర్టులో ఉండటంతో అంతకుమించి దీనిపై స్పందించను" అని నారాయణ తెలిపారు.

# గ్రామ స్వరాజ్యాన్ని వైకాపా ప్రభుత్వం చంపేసింది: పవన్



విజయవాడ: అవినీతి, దౌర్జన్యంతో ప్రజల కష్టాన్ని, శ్రమను వైకాపా నేతలు దోచుకుంటున్నారని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆరోపించారు. రాష్ట్రంలో జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా మచిలీపట్నం సువర్ణ కల్యాణ మండపంలో రెండు గంటల పాటు పవన్ మౌన దీక్షకు కూర్చున్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడుతూ.."రాష్ట్రంలో జరుగుతున్న దోపిడీ, అవినీతికి అడ్డుకట్ట వేయాలి. జనసేన ప్రభుత్వం వచ్చాక గాంధీ జయంతిని బందరులో చేసుకుందాం. రాజకీయాల్లో అభిప్రాయ భేదాలు ఉండటం సహజం. జగన్ మాదిరిగా కేసులు పెట్టి, జైళ్లకు పంపే ఆలోచన సరికాదు. జగన్‌పై నాకు వ్యక్తిగత ద్వేషం లేదు. జగన్ ఆలోచన, పాలన నిర్ణయాలను వ్యతిరేకించాను. గ్రామ స్వరాజ్యాన్ని ఈ ప్రభుత్వం చంపేసింది. రాజకీయాల్లో బురద పడుతుందని తెలుసు.. అయినా ముందుకే సాగుతాం" అని పవన్ కల్యాణ్ అన్నారు.

## టైగర్ పిల్లకు.. హిట్టొస్తే ఆగేనా..

బాలీవుడ్ బ్యూటీ కృతి సనన్ తెలుగులో రెండు సినిమాలు చేసింది. కానీ, ఇక్కడ స్టార్ హీరోయిన్ రేంజ్ కి అందుకోలేకపోయింది. ఇప్పుడు ఆమె చెల్లెలు నుపుర్ సనన్ టాలీవుడ్ లో సత్తా చాటడానికి రెడీ అవుతోంది. ప్రస్తుతం నుపుర్ సనన్ మాస్ మహారాజా రవితేజ సరసన టైగర్ నాగేశ్వరరావు మూవీలో నటిస్తోంది. ఈ మూవీపై మంచి అంచనాలే ఉన్నాయి. కచ్చితంగా ఈ మూవీ తో రవితేజ బ్లాక్ బస్టర్ హిట్ అందుకుంటాడనే నమ్మకంతో ఉన్నాడు. కాగా, ఈ



మూవీ కనుక హిట్ అయితే, హీరోయిన్ నుపుర్ సనన్ కెరీర్ కి ఇక తిరుగులేనట్లే. ఎందుకంటే, అందంలో నుపుర్ తన అక్క కృతికి ఏ మాత్రం తీసిపోదు. రీసెంట్ గా మూవీ నుంచి ఓ పాట విడుదల చేయగా, అందులోనూ నుపుర్ చాలా అందంగా కనపడింది. దీంతో, ప్రస్తుతం అందరి కళ్లు నుపుర్ మీదే ఉన్నాయి. మూవీకి పాజిటివ్ టాక్ వస్తే, ఆఫర్లు క్యూ కట్టడం ఖాయం. ప్రస్తుతం టాలీవుడ్ లో శ్రీలీల జోరు నడుస్తోంది. ఆ తర్వాతి స్థానాన్ని నుపుర్ అందుకుంటుందో లేదో చూడాలి.ఇక, సోషల్ మీడియాలో కూడా నుపుర్ చాలా చురుకుగా ఉంటుంది. ఎప్పటికప్పుడు తన ఫోటోలను పంచుకుంటూ ఉంటుంది. తాజాగా, బ్లాక్ కలర్ డ్రెస్ లో ఉన్న ఫోటోలను షేర్ చేసింది. ఆ నలుపు రంగు డ్రెస్ లో పద్దతిగా కనపడుతూనే, తన క్లీవేజ్ అందాలు కనిపించేలా, ఫోటోలకు ఫోజులు ఇవ్వడం విశేషం. ఇక, టైగర్ నాగేశ్వరరావు మూవీ విషయానికి వస్తే, స్టూవర్టుపురం గజదొంగ టైగర్ నాగేశ్వరరావు జీవితం సినిమా తీయాలని చాలా మంది చాలా సార్లు అనుకున్నారు. ఎట్టకేలకు మాస్ రాజాతో అది పూర్తౌతోంది.

ఈ సినిమాకు వంశీ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాని ఐదు భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా విడుదల చేయనున్నారు. గజదొంగగా రవితేజ లుక్ ఆకట్టుకుంది. ఆయన కళ్లల్లో ఇంటెన్సిటీ క్లియర్ గా కనపడుతోంది. రావణాసుర ఫ్లాప్ తో ఉన్న రవితేజ కు ఈ సినిమా హిట్ అవ్వడం చాలా అవసరం. ఆ హిట్ ఈ సినిమా అందిస్తుందనే ఆశతో చిత్ర బృందం ఉంది. దసరా కానుకగా టైగర్ నాగేశ్వరరావు అక్టోబర్ 20న విడుదల కానుంది.

## మెగా హీరోతో ఒరేయ్ అనేంత స్నేహం ఆమెకి ఉందా?

నవీన్ చంద్ర, స్వాతి ముఖ్య పాత్రలో నటించిన 'మంత్ ఆఫ్ మధు' చిత్రం అక్టోబర్ ఆరో తారీఖున ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్ హైదరాబాదులో జరిగింది. ఆ కార్యక్రమానికి మెగా హీరో సాయిధరమ్ తేజ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆ సందర్భంగా తేజ్ ని హీరోయిన్ కలర్స్ స్వాతి చేసిన వ్యాఖ్యలు అందరి దృష్టిని ఆకర్షించాయి. ముఖ్యంగా సాయిధరమ్ తేజ్ ని ఒరేయ్ అంటూ ఆమె సంబోధించడం షాకింగ్ గా ఉంది. స్వాతి మాట్లాడుతూ.. జనాలు అంతా కూడా నేను తేజ్ కంటే పెద్ద అనుకుంటారు. కానీ మేమిద్దరం ఒకే క్లాస్... కలిసి చదువుకున్నాం. ఇద్దరి పేర్లలో మొదటి అక్షరం



ఎస్ కనుక మాకు ఎగ్జామ్ ఎక్కువ శాతం ఒకేసారి, ఒకే చోట ఉండేది. ప్రాక్టికల్ ఎగ్జామ్ కలిసి రాశాము, నా దాంట్లో చూసి రాశాడు అంటూ సరదాగా వ్యాఖ్యలు చేసింది. సాయి ధరంతేజ్ కూడా స్వాతి తో పాటు తమ స్నేహాన్ని చెప్పకనే చెప్పాడు. మొత్తానికి ఇద్దరి మధ్య ఇంత మంచి స్నేహం ఉందా అంటూ అంతా షాక్ అవుతున్నారు. స్వాతి ఇండస్ట్రీలో చాలా సంవత్సరాల క్రితం అడుగు పెట్టింది. కనుక ఆమె వయసు చాలా పెద్దదై ఉంటుందని అంతా భావిస్తున్నారు.

సాయి ధరంతేజ్, ఆమె ఒకే క్లాస్ అని తెలిసి అందరూ అవాక్కవుతున్నారు. వీరిద్దరూ ఇప్పటి వరకు కలిసిన నటించింది లేదు. అలాగే స్టేజ్ పై కలిసి సందడి చేసింది లేదు. మొదటి సారి స్వాతి సినిమా ట్రైలర్ రిలీజ్ కార్యక్రమానికి హాజరయ్యి సాయి ధరమ్ తేజ్ అందర్నీ ఆశ్చర్యపరిచారు. ముందు ముందు వీరి కాంబినేషన్లో ఏమైనా సినిమా వస్తుందో చూడాలి.




## పిక్ టాక్ : ఎట్టకేలకు వారిని చూపించిన నయన్



లేడీ సూపర్ స్టార్ నయనతార ఎట్టకేలకు తన కవల పిల్లల ఫోటోలను రివీల్ చేసింది. ఇటీవల తన భర్త విఘ్నేష్ శివన్ తో కలిసి కొడుకులతో కలిసి ఫోటో షూట్ తో సందడి చేసింది. ఇప్పటి వరకు కొడుకులకు సంబంధించిన ఫేస్ ను చూపించకుండా ఫోటోలు వీడియో లు షేర్ చేసిన నయనతార మొదటి సారి కొడుకు ల యొక్క ఫేస్ లను రివీల్ చేసింది. విఘ్నేష్ శివన్ మరియు నయన్ ల జోడీ గురించి ఎంత చెప్పినా తక్కువే అన్నట్లుగా ఫ్యాన్స్ వారి వైవాహిక జీవితం గురించి మాట్లాడుకుంటూ ఉన్నారు. ఇలాంటి సమయంలో వారిని కొడుకులతో కలిసి చూడటం మరింత అందంగా ఈ జంట కనిపిస్తుంది అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. చూస్తుండగానే నయన్, విఘ్నేష్ శివన్ ల కొడుకులు పెద్ద వారు అయ్యారు అన్నట్లుగా పిల్లలను చూసిన వారు సోషల్ మీడియా ద్వారా కామెంట్స్ చేస్తున్నారు. వైట్ షర్ట్, బ్లాక్ పాయింట్ ధరించిన ఉయిర్ రుద్రోనిల్ ఎన్ శివన్ మరియు ఉలగ్ ధైవాగ్ ఎన్ శివన్ లు అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. హీరోయిన్ గా నయనతార ఇటీవల జవాన్ సినిమా తో భారీ విజయాన్ని సొంతం చేసుకుంది. మరో వైపు ఆమె నటించిన తమిళ్ మూవీ ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. హీరోయిన్ గా ఆమె ఎంత బిజీగా ఉన్నా కూడా కొడుకులకు సాధ్యం అయినంత ఎక్కువ సమయం కేటాయిస్తుంది. దర్శకుడిగా విఘ్నేష్ శివన్ బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేస్తున్న విషయం తెల్సిందే.

## మామా మశ్చీంద్ర ట్రైలర్.. థ్రిల్లింగ్ ట్విస్ట్



టాలీవుడ్ హీరో సుధీర్ బాబు తాజాగా నటిస్తున్న కొత్త సినిమా మామా మశ్చీంద్ర. పరశురామ్(మామ పాత్ర), దుర్గా(భారీకాయుడుగా), డీజే(స్టైలిష్‌గా) అనే మూడు విభిన్న పాత్రల్లో సుధీర్ బాబు త్రిపాత్రాభినయం చేస్తున్న చిత్రమిది. సినిమా రిలీజ్ డేట్ దగ్గరపడడంతో ప్రమోషన్స్‌లో జోరు పెంచి క్యూరియాసిటీ పెంచేందుకు ప్రయత్నిస్తున్న మూవీటీమ్ తాజాగా ట్రైలర్‌ను రిలీజ్ చేసింది. ఈ సృష్టిలో నువ్వు ఒక్కడివే నిజం. నీ ఫీలింగ్స్ ఎవరితో పంచుకోకు. ఒకవేళ పంచుకోవాల్సి అనిపించే డైరీ రాయి. ఓల్డ్ కాన్సెప్ట్ అనుకోకు. బ్రహ్మాండంగా వర్కౌట్ అవుతది. ఒకవేళ ఎవరూ చదవకూడదని అనుకుంటే ఒకసారి రాసి కాల్చి పడేయ్. అంటూ సుధీర్ బాబు చెప్పే డైలాగ్‌తో ప్రారంభమైందీ ట్రైలర్. ఆ తర్వాత తమ నాన్న పోలికలున్న దుర్గా, డీజేను.. ఈషా రెబ్బా, మృణాళిని రవి ప్రేమించడం, అది తెలుసుకున్న హీరోయిన్స్ తండ్రి పరశురామ్(సుధీర్ బాబు).. గతం నన్ను వెతుక్కుంటూ వస్తోంది, కానీ దానికి తెలీదు దానీ కోసం నేను ఎదురుచూస్తున్నానని అంటూ తన రూపం పోలీ ఉన్న సొంత మేనళ్లులనే చంపాలనుకోవడం వంటీ సీన్స్?ను చూపించారు. దీని బట్టి పరశురామ్‌కు ఏదో ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్ ఉన్నట్లు తెలుస్తోంది. హీరోహీరోయిన్స్ మధ్య కెమిస్ట్రీ బాగానే ఉంది. విజువల్స్ కూడా ఇంటెన్స్‌గానే కనిపిస్తున్నాయి. పీజీ విందా మ్యూజిక్ కూడా బాగుంది.

చైతన్ భరద్వాజ్ కూడా ఇంట్రెస్టింగ్ స్కోర్‌ను అందించాడు. డైలాగ్స్ కూడా ఇంట్రెస్టింగ్?గా ఉన్నాయి. మరి నెగటివ్ టచ్ ఉన్న పాత్రలో కనిపించిన పరశురామ్.. తన చెల్లి కొడుకులను ఎందుకు చంపాలనుకున్నాడు అసలు గతంలో తన చెల్లి కుటుంబంతో వైరం ఎందుకు ఏర్పడింది తెలుసుకోవాలంటే సినిమా రిలీజయ్యాక తెరపై చూడాల్సిందే. సినిమాలో ఈషా రెబ్బా, మృణాళిని రవి హీరోయిన్లుగా నటిస్తున్నారు. హర్షవర్ధన్ దర్శకత్వం వహిస్తున్నారు. సృష్టి సెల్యూలాయిడ్ సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సునీల్ నారంగ్, పూస్కూర్ రామ్మోహన్‌రావు నిర్మిస్తున్నారు. అక్టోబర్ 6న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. తెలుగు, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ సినిమాకి రాజీవ్ – కళ పి.జి.విందా – ఛాయాగ్రహణం, చైతన్ భరద్వాజ్ – సంగీతం అందిస్తున్నారు. ఇకపోతే సితార ఎంటర్ టైన్మెంట్స్ నిర్మించిన మ్యాడ్, కిరణ్ అబ్బవరం రూల్స్ రంజన్ కూడా అక్టోబర్ 6నే విడుదల కానున్నాయి.

## అప్పటి వరకు రెస్ట్‌లోనే ప్రభాస్.. ఎందుకంటే..

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మోకాలి సర్జరీ కోసం యూరోప్ వెళ్లిన సంగతి తెలిసిందే. ఇప్పుడా శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తైనట్లు తెలిసింది. దీంతో కొంతకాలం పాటు డార్లింగ్ రెస్ట్ తీసుకోబోతున్నారట. దాదాపు అక్టోబర్ నెల మొత్తం ఆయన విశ్రాంతి తీసుకునే అవకాశం ఉందని అంటున్నారు. నవంబర్ నుంచి తిరిగి సెట్స్?లోకి అడుగుపెడతారట. వాస్తవానికి ప్రభాస్ చాలా కాలం నుంచే మోకాలి గాయంతో బాధపడుతున్నారు. ఆదిపురుష్ ప్రమోషన్స్ సమయంలోనే ఆయన నడిచే విధానంలో తేడా కనిపించింది. దీంతో ఆయన అభిమానులంతా ఎంతో బాధపడ్డారు. అయినా అప్పటి నుంచి గాయంతోనే షూటింగ్స్?లో పాల్గొంటూనే ఉన్నారు. అయితే ఆ సమయంలోనూ సర్జరీ కోసం ప్రభాస్ ఫారెన్ వెళ్లినట్లు వార్తలు వచ్చాయ. అయితే ఇప్పుడు ఎట్టకేలకు సలార్ మూవీ చిత్రీకరణ పూర్తైన తర్వాత ప్రభాస్ సర్జరీ చేయించుకున్నారు. ఈ సర్జరీ నుంచి కోలుకున్న తర్వాత ప్రభాస్.. నాగ అశ్విన్ ప్రతిష్టాత్మక



సైన్స్? ఫిక్షన్ ప్రాజెక్ట్ కల్కి 2898 ఏడీ , మారుతి హారర్ సినిమా సెట్స్?లో జాయిన్ అవుతారట. ఈ రెండింటిలో కల్కికి ఎక్కువగా డేట్స్? ఇచ్చి త్వరగా పూర్తి చేస్తారట. వచ్చే ఏడాది ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. అనంతరం ఈ రెండు చిత్రాలు పూర్తైన తర్వాత మళ్లీ ఒకేసారి రెండు చిత్రాలను సెట్స్?పైకి తీసుకెళ్తారట ప్రభాస్. సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో స్పిరిట్, హను రాఘవపూడితో ఓ ప్రేమ కథా చిత్రాన్ని సెట్స్ పైకి తీసుకెళ్లాలని అనుకుంటున్నారట. 2024 వేసవి తర్వాతే వీటిని పట్టాలెక్కించాలని భావిస్తున్నట్లు బయట కథనాలు వస్తున్నాయి. ఇకపోతే ప్రభాస్ పెళ్లి విషయం గురించి కూడా మరోసారి చర్చ తెరపైకి వచ్చింది. ఈ ఏడాది లేదా వచ్చే ఏడాది తప్పకుండా చేసుకుంటారని డార్లింగ్ కుటంబ సభ్యులతో పాటు అభిమానులు, సినీ వర్గాలు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాయి. చూడాలి మరి ప్రభాస్ ఏం చేస్తారో..

## వయసు నాలుగు పదులు... అందం పాతికేళ్లు

2001 సంవత్సరంలో తెలుగు లో ఇష్టం అనే సినిమా తో ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ముద్దుగుమ్మ శ్రియా సరన్. ఈ అమ్మడు దాదాపు రెండు దశాబ్దాలుగా సినీ ప్రేమికులను అలరిస్తూనే ఉంది. గత కొన్నాళ్లుగా సినిమా ఇండస్ట్రీలో కాస్త స్లో అయినా కూడా సోషల్ మీడియాలో అందాల ఆరబోత ఫోటో షూట్స్ తో స్టార్ హీరోయిన్స్ కి ధీటుగా పోటీ ఇస్తుంది అనడంలో సందేహం లేదు. హీరోయిన్ గా శ్రియా నటించిన సినిమాలు, దక్కించుకున్న సక్సెస్ ల నేపథ్యంలో ఆమెకు మంచి ఫాలోయింగ్ ఉండటం కామన్. అయితే నాలుగు పదుల వయసు దాటిన తర్వాత, బిడ్డకు జన్మనిచ్చిన తర్వాత కూడా అందం విషయంలో శ్రియా పాతికేళ్ల పడుచు అమ్మాయిలకు పోటీగా నిలవడం అనేది కేవలం ఈమెకు మాత్రమే సాధ్యం. ఇండస్ట్రీలో చాలా



మంది నాలుగు పదుల వయసు దాటిన హీరోయిన్స్ ఉన్నారు. వారిలో కొద్ది మంది మాత్రమే ఇంతగా అందంగా కనిపిస్తారు. కొందరు ఆంటీల మాదిరిగా మారిపోయి సెకండ్ ఇన్నింగ్స్ ను మొదలు పెట్టారు. కానీ శ్రియ ఇంకా కూడా హీరోయిన్ గా ఆఫర్లు దక్కించుకుంటూ కెరీర్ లో ముందుకు సాగుతుంది. తాజాగా మరోసారి చీర కట్టు లో క్లీవేజ్ షో చేస్తూ ఇచ్చిన ఫోటో షూట్ అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. చీర కొంగు పక్కకు జరిపి మరీ శ్రియా తన క్లీ వేజ్ షో ను చేయడం చూసి ఈమె వయసు నిజంగా నాలుగు పదులు అయి ఉంటుందా అంటూ ప్రశ్నించే వారు చాలా మంది ఉన్నారు అందాల విందు విషయంలో ఈ అమ్మడి వయసు పాతికేళ్ల వద్ద నిలిచి పోయినట్లుగా అనిపిస్తుందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు.

గరుడ వార్త






## భాజపా స్టీరింగ్ ప్రధాని చేతిలో లేదు.. అదానీ చేతిలో ఉంది: కేటీఆర్

హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టుకు ఒక్క రూపాయి కూడా కేంద్రం ఇవ్వలేదని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. నగరంలోని మలక్‌పేట్‌లో ఐటీ పార్కుకు మంత్రి శంకుస్థాపన చేసి భవన నమూనాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. మూసీ ఆధునీకరణ పనులు త్వరలో పూర్తి చేస్తామన్నారు. ఓల్డ్ సిటీకి మెట్రో తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని చెప్పారు. "దేశానికి తెలంగాణ ధాన్యాగారంగా మారింది. ధాన్యం ఉత్పత్తిలో పంజాబ్, హరియాణాను అధిగమించాం. కేసీఆర్ నాయకత్వంలో కాళేశ్వరం పూర్తి చేశాం. బెంగళూరు కంటే అధికంగా ఐటీ ఉద్యోగాలు కల్పిస్తున్నాం. గతంలో హైదరాబాద్‌లో తరచూ కర్ఫ్యూ పరిస్థితులు ఉండేవి. కేసీఆర్ పాలనలో తొమ్మిదేళ్లుగా రాష్ట్రం ప్రశాంతంగా ఉంది. భారాస స్టీరింగ్ కేసీఆర్ చేతిలో.. ఎంఐఎం స్టీరింగ్ అసదుద్దీన్ చేతిలో ఉంది.

భాజపా స్టీరింగ్ మాత్రం ప్రధాని మోదీ చేతిలో కాదు.. అదానీ చేతిలో ఉంది" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. ఈ కార్యక్రమంలో కేటీఆర్ సహా ఎంపీ అసదుద్దీన్, పలువురు ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. అంతకుముందు జరిగిన ఓ కార్యక్రమంలో జెండా ఊపి 162 సిల్ట్ కార్టింగ్ వాహనాలను కేటీఆర్ ప్రారంభిచారు. అనంతరం మాట్లాడుతూ.. "మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకుని కేసీఆర్ పాలన సాగిస్తున్నారు. కొంతమంది దిల్లీలో కూర్చొని గాంధీ ఫొటోలకు పోజులు ఇవ్వడం తప్ప ఆచరణలో ఏమీ చేయరు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు దళితబంధు పథకం పెట్టలేదు. ఈ పథకం అందాల్సిన వారు ఇంకా లక్షల్లో ఉన్నారు. భవిష్యత్తులో అర్హులందరికీ పథకాన్ని వర్తింప చేస్తాం" అని చెప్పారు. కేటీఆర్‌తో పాటు మంత్రి తలసాని, పలువురు ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## నా తండ్రి కేసీఆర్.. ఆనందభాష్పాలు రాల్చిన దళితబంధు లబ్దిదారురాలు



సూర్యాపేట : ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన దళితబంధు పథకం ఎన్నో దళిత కుటుంబాల్లో వెలుగులు నింపింది. దళితులను ఆర్థికంగా ఎదిగేలా చేసింది. తలెత్తుకొని బతికేలా చేసింది. దళితుల జీవితాల్లో వెలుగులు నింపుతున్న దళితబంధుపై కాంగ్రెస్ చేస్తున్న ఆరోపణలను ఓ లబ్దిదారురాలు తిప్పికొట్టింది. ఆనాడు ఇబ్బందుల్లో ఉన్న మాకు ఆ పదివేలు ఎందుకివ్వలేదు ఆ వెధవ అంటూ కాంగ్రెస్ పార్టీని ఆమె కడిగిపారేసింది. దళితబంధు ఇచ్చి ఆదుకున్న నా తండ్రి కేసీఆర్ అంటూ ఆమె ఆనందభాష్పాలు రాల్చారు. సూర్యాపేటలో దళిబంధు లబ్దిదారులకు మంత్రి జగదీశ్ రెడ్డితో కలిసి మంత్రి కేటీఆర్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా దళితబంధు లబ్దిదారురాలు చింతలచర్ల రత్నమ్మ ఆవేదనతో మాట్లాడారు.

**రత్నమ్మ ఆవేదన ఆమె మాటల్లోనే..** గతంలో 30 సంవత్సరాలు నేను, నా భర్త చెప్పులు కుట్టి బతికాం. డబ్బులు ఉన్నోళ్లకాడ బానిసత్వం చేశాం. ఈ బానిసత్వం నుంచి విముక్తి ఎప్పుడు కలుగతది దేవుడా..? ఏ ప్రభుత్వమైనా సహాయం చేయకపోతారా..? ఏ మంత్రైనా సహాయం చేయకపోతారా..? ముఖ్యమంత్రులున్నరు.. మంత్రులున్నరు. మంత్రి ఎట్ల ఉంటడో కూడా నాకు తెలియదు. ఓటు అడగడమే తప్పా.. వారికి మా బాధలు, కష్టాలు వాళ్లకు తెల్వదు. మాదిగోడు అంటేనే హీనమైన చూపు చూసిన ప్రభుత్వం అది(కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి). ఆ ప్రభుత్వాల్లో కరెంట్‌కు ఏడ్సినం.. నీళ్లకు ఏడ్సినం. ఇదే బిందెలు పట్టుకొనివచ్చి మున్సిపాలిటీ ఆఫీసుల కాడ ధర్నాలు చేసినం. అయ్యా మాకు పదివేల సహాయం చేయండి.. ఈ బానిసత్వం నుంచి మమ్ముల్ని విముక్తి చేయండని ఎన్నోసార్లు అర్సినం. ఈ కష్టం చేసుకుంటనే నా నలుగురి బిడ్డలను చదివిచ్చిన. నా భర్త తాగి తాగి చనిపోయిండు. నేను చేసిన పని నా బిడ్డలకు పెట్టకు అని చనిపోయేటప్పుడు నా భర్త చెప్పిండు. ఇప్పుడున్న ప్రభుత్వం మనకు చేయదు సహాయం. మన బతుకులు మార్చేందుకు ఏ దేవుడో వస్తే నా బిడ్డల బతుకు మారుతది అని నా భర్త అన్నడు. నా భర్త ఆశయానికి నా పిల్లలను పనికి పెట్టలేదు. రోడ్డు మీద ఎక్కి పని చేస్తుంటే.. ఏ మంత్రి కూడా, ఏ అధికారి కూడా మాకు సహాయం చెయ్యలే. పది రూపాయాల సహాయం చేసినోళ్లు లేరు. ఇప్పుడు ఇల్లు ఇస్తాం. మీకు పన్నెండు లక్షలిస్తాం అంటుండు. అప్పుడు ఆ పదివేలు ఎందుకు ఇవ్వలేదు ఆ వెధవ. ఆ బద్మాష్ ఎందుకివ్వలే మాకు. మాకు సహాయం చేయకుండా చాలా బాధ పెట్టిండ్రు. కేసీఆర్ వచ్చినంక ఒక దళిత కుటుంబానికి పది లక్షల రూపాయాలు ఇవ్వాలన్న ఆలోచన కలిగిన ఏకైక ముఖ్యమంత్రి మన కేసీఆర్. కేసీఆర్‌కు బతికినంత కాలం రుణపడి ఉంటాం. ఈ దళితబంధు సాయంతో చెప్పుల షాపు పెట్టుకుంటా. నా ఇద్దరు కొడుకులకు ఉపాధి కల్పిస్తా. నేను ఒకళ్ల మీద ఆధారపడకుండా బతుకుతా. నాకు సహాయం చేశారు నా తండ్రి కేసీఆర్ అని రత్నమ్మ ఆనందభాష్పాలు రాల్చారు.

## పేదల సొంతింటి కలను నిజం చేసిన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిది : మంత్రి తలసాని



సంగారెడ్డి : పేదల సొంత ఇంటి కలను నిజం చేసిన ఘన చరిత్ర బీఆర్ఎస్ ప్రభుత్వానిదని సంక్షేమ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. సోమవారం కొల్లూరులో 6,067 మంది లబ్ధిదారులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనల నుంచి పురుడు పోసుకుందే డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణ కార్యక్రమం అన్నారు. అన్ని సౌకర్యాలతో కూడిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను నిర్మించి పేదలకు ఉచితంగా అందిస్తున్న ఏకైక ప్రభుత్వం తెలంగాణ అని స్పష్టం చేశారు. దేశంలో ఎక్కడైనా ఉచితంగా పేదలకు అన్ని సౌకర్యాలతో కూడిన ఇల్లు ఉచితంగా ఇస్తున్నారా? ఉచితంగా ఇండ్లు నిర్మించి ఇస్తున్నట్లు నిరూపిస్తే వెంటనే నా పదవికి రాజీనామా చేస్తానని ప్రతి పక్షాలకు సవాల్ విసిరారు. ఇల్లు లేని పేద ప్రజలకు ఉచితంగా పంపిణీ చేయడం కోసం లక్ష ఇండ్లు నిర్మించాం. అవసరమైతే మరో లక్ష ఇండ్లను నిర్మిస్తాం. ఎవరు కూడా ఆందోళ చెందాల్సిన అవసరం లేదని భరోసానిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సిద్దిపేటకు రైలు.. త్వరలోనే తిరుపతి, బెంగళూరు నగరాలకు సేవలు : మంత్రి హరీశ్‌రావు

మనోహరాబాద్ – సిద్దిపేట మధ్య మంగళవారం రైలును ప్రారంభించనున్నట్లు మంత్రి హరీశ్‌రావు తెలిపారు. త్వరలోనే తిరుపతి – బెంగళూరు నగరాలకు ట్రైన్ సేవలు అందుబాటులోకి వస్తాయని ప్రకటించారు. సిద్దిపేటలో వీఎన్ఎస్ కన్వెన్షన్‌ను హరీశ్‌రావు సోమ వారం ప్రారంభించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావును మరోసారి సిద్దిపేట ఎమ్మెల్యేగా లక్షన్నర ఓట్లకుపైగా మెజారిటీతో గెలిపించాలని ఆర్యవైశ్యులు తీర్మానించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ కేదార్‌నాథ్, బద్రీనాథ్‌లో అన్నం పెట్టిన సిద్దిపేట సిద్దిపేట వైశ్యులదేనన్నారు. ఈ నెల 5న వెయ్యి పడకల ఆసుపత్రిని ప్రారంభిస్తామని, త్వరలోనే సిద్దిపేటలో వృద్ధాశ్రమం ఏర్పాటు చేస్తామని చెప్పారు.



## కరీంనగర్ పౌరుల గౌరవం పెంచేలా.. అభివృద్ధి చేస్తున్నాం : మంత్రి గంగుల

కరీంనగర్ : పార్టీలకు అతీతంగా కరీంనగర్ పట్టణాన్ని అభివృద్ధి చేస్తున్నామని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్‌లోని పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు మంత్రి సోమవారం భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..నగర పౌరుల గౌరవం పెరిగేలా అద్భుత నగరంగా తీర్చిదిద్దుతున్నామని, భవిష్యత్ తరాలకు గొప్ప నగరాన్ని అందించాలన్నదే తమ లక్ష్యం అని అన్నారు.

ఎన్నికలప్పుడు మాత్రమే రాజకీయాలు అని, గెలిచిన తరవాత అందరూ నావల్లేనని, తనని నమ్మి గెలిపించిన ప్రజల రుణం తీర్చుకునే ప్రయత్నం చేస్తున్నానని చెప్పారు. నగరంలో 50 ఏళ్లలో జరగని అభివృద్ధి పనులు నేడు జరుగుతున్నాయని, గతంలో ఉన్న నాయకులు కేవలం ఎన్నికలప్పుడు మాత్రమే రావడంతో నగర అభివృద్ధి కుంటుపడిందన్నారు. ఎక్కడ చూసినా గుంతల రోడ్లతో నగరానికి వచ్చేందుకు వెనుకాడే వారని, నేడు కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన పనులతో నగరం అద్భుతంగా మారిందని పేర్కొన్నారు. అభివృద్ధి ఇలాగే కొనసాగాలని కోరారు. ఎన్నికల వేళ..పచ్చని తెలంగాణలో విషం చిమ్మేందుకు కాంగ్రెస్..బీజేపీలు విషం చిమ్ముతున్నాయని మండిపడ్డారు. ఆయా పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ అభివృద్ధి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని, మరోసారి ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ సునీల్ రావు, నగర డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపరాణి, కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చేందుకు మోదీ తెలంగాణ పర్యటన: రేవంత్‌రెడ్డి

హైదరాబాద్: ప్రధాని నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటనతో ప్రజలకు నిరాశే మిగిలిందని కాంగ్రెస్ ఎంపీ, టీపీసీసీ చీఫ్ రేవంత్ రెడ్డి అన్నారు. గిరిజన యూనివర్సిటీ, పసుపు బోర్డు ఏదో కొత్త హామీలు అన్నట్లు మాట్లాడారని.. మోదీ చేసిన మోసానికి కిషన్‌రెడ్డి క్షమాపణలు చెప్పాలని రేవంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. అలాగే బీఆర్ఎస్ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావులపైనా ఆయన తీవ్రస్థాయిలో మండిపడ్డారు. "తెలంగాణ ఏర్పాటును అవమానించిన మోదీతో సభ నిర్వహించడం అనైతికం. వివేక్, కొండ విశ్వేశ్వరరెడ్డి, విజయశాంతి, రాజ్ గోపాల్ రెడ్డి అందుకే రాలేదు అనే చర్చ నడుస్తోంది. మోదీ పర్యటన ఖర్చు కూడా పాలమూరుకు ఇవ్వలేదు. కుటుంబ దోపిడీ(బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కుటుంబాన్ని ఉద్దేశించి..) గురించి మోదీ ఎందుకు మాట్లాడలేదు?. దీంతో.. బీఆర్ఎస్–బీజేపీల మధ్య చీకటి ఒప్పందం జరిగిందని తెలంగాణ ప్రజలకు అర్థమైపోయింది. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చేందుకు మోదీ తెలంగాణ పర్యటన.. అని రేవంత్ అన్నారు. కాంగ్రెస్‌ను ఓడించేందుకు ఇద్దరు ఏకమైన చేస్తున్న పర్యటనలు ఇవి. కేటీఆర్ ,హరీష్ రావు బిల్లా రంగాల్లా తిరుగుతున్నారు. 2004,2009 కాంగ్రెస్ మ్యానిఫెస్టో తో నేను వస్తా. 2014,18 మ్యానిఫెస్టోలతో చర్చలకు వస్తారా? రెండు ప్రభుత్వాల హయాంలో జరిగిన అభివృద్ధిపై చర్చకు సిద్ధమా? అని బీఆర్ఎస్‌కు సవాల్ విసిరారు టీపీసీసీ చీఫ్. 2004నుంచి 2014 వరకు దేశంలో కాంగ్రెస్ ఎన్నో రాష్ట్రాలలో అధికారంలో ఉన్నా..ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేసింది. కానీ, ఈ బిల్లా రంగాలు(కేటీఆర్, హరీష్ రావులను ఉద్దేశిస్తూ..) కాంగ్రెస్ పై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు. ఉచిత కరెంటు, ఇందిరమ్మ ఇండ్లు, ఆరోగ్యశ్రీ, రైతు రుణమాఫీ, ఫీజు రీయింబర్స్ మెంట్, మైనారిటీ రిజర్వేషన్ అమలు చేసింది కాంగ్రెస్. 2004 నుంచి 2014 వరకు ఇచ్చిన ఆరు హామీలను వైఎస్సార్ అమలు చేసి చూపించారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా ఉమ్మడి రాష్ట్రంలో ఈ పథకాలను అమలు చేసి చూపాం. రాష్ట్రాల ఆదాయం, ప్రజల అవసరాలనుబట్టి పథకాలు ఉంటాయి. కానీ, ఈ బిల్లా రంగాలకు రాజ్యాంగం విలువ తెలియదు. ఈ మాత్రం ఇంగిత జ్ఞానం లేని బిల్లా రంగాలు... ఇతర రాష్ట్రాల్లో అమలు చేయాలని మాట్లాడుతున్నారు. ఆ ఇద్దరికీ సూటిగా సవాల్ విసురుతున్నా. మా పదేళ్ల పాలన.. మీ పదేళ్ల పాలనపై చర్చకు సిద్ధమా?. మీరు ఏడ్చి పెడబొబ్బలు పెట్టినా మిమ్మల్ని తెలంగాణ ప్రజలు నమ్మరు. కాంగ్రెస్ లో బహునాయకత్వం ఉంటే తప్పేంటి?. బడుగు బలహీన వర్గాలకు అవకాశాలు ఇస్తే తప్పేముంది?. అయినా రాజస్థాన్, ఛత్తీస్ గడ్, కర్ణాటకలో సీఎం లు మారారా?. మాట ఇస్తే అమలు చేసే పార్టీ కాంగ్రెస్.. ఆనాడు అమలు చేశాం. ఇప్పుడూ ఆరు గ్యారెంటీలను అమలు చేసి చూపిస్తాం. కాంగ్రెస్ ను ప్రశ్నించే నైతికత బిల్లా రంగాలకు లేదు. తెలంగాణ సమాజం కేసీఆర్ ను నమ్మదు.. క్షమించదు. కర్ణాటక ప్రభుత్వం వసూళ్లపై కేటీఆర్ కి అనుమానం ఉంటే విచారణకి లెటర్ రాస్తే దాన్ని ఆమోదించి విచారణ చేయించాలని నేను కర్ణాటక ప్రభుత్వానికి డిమాండ్ చేస్తా. తెలంగాణ ప్రభుత్వం చేస్తున్న వసూళ్లపై విచారణ జరిపించాలని లెటర్ రాస్తాను. ఆమోదించి విచారణ జరిపిస్తారా? అని నిలదీశారు రేవంత్. అలాగే.. ఓట్ల కోసమే కేటీఆర్ స్వర్గీయ ఎన్టీఆర్ పేరును వాడుకుంటున్నాడంటూ విమర్శించారు రేవంత్. కాంగ్రెస్ వేవ్ ను ఆపడం ఎవరి తరం కాదు. కాంగ్రెస్ అధికారంలోకి రావడం పక్కా. భయం తో ఉచిత సిలిండర్లు ,సన్న బియ్యం రేషన్ , రైతు లకు పెన్షన్ లాంటి హామీ లు ఇచ్చేందుకు కేసీఆర్ సిద్ధం అవుతున్నారు. బీఆర్ఎస్ పనైపోయింది ,ప్రభుత్వం లో ఉన్న పార్టీ ఎన్నికల ముందు ఎన్ని హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మరు. టిక్కెట్ ల ప్రకటన సెంట్రల్ ఎలక్షన్ కమిటీ భేటీ తర్వాతే ఉంటుంది. టిక్కెట్ ల ప్రకటన నాటి కి చాలా మంది బీజేపీ, బీఆర్ఎస్ నేతల చేరిక ఉంటుంది. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే ,ఎమ్మెల్సీ లు మా పార్టీ లోకి వస్తున్నారంటేనే మా బలం ఏంటో అర్థం అవుతుంది. బీఆర్ఎస్ కు 25 సీట్లు దాటే ఛాన్స్ లేదు. రాష్ట్రంలో 19% ఓట్లు అన్ డిసైడ్ లో ఉన్నాయి..ఇందులో మెజారిటీ ఓటు షేర్ మాకే వస్తుంది. సౌత్ ,నార్త్ ఓట్ పల్స్ కు చాలా తేడా ఉంటుంది. సౌత్ లో ఇండివీజువల్ ఓటింగ్ ఎక్కువ ఉంటుంది. కాంగ్రెస్ లో బీసీ ఆశావాహుల కోసం పీసీసీ గా నేను కొట్లాడుతా. సర్వే లో ఓసి, బీసీ కి ఈక్వల్ వస్తే..బీసీ కే టిక్కెట్ ఇస్తాం. తమ కు ఎక్కువ సీట్లు ఇవ్వాలని బీసీ లు అడగడం లో తప్పులేదు. మేము కూడా బీఆర్ఎస్ బీసీ లకు ఇచ్చిన సీట్ల కంటే ఎక్కువ ఇస్తాం.

## తెలంగాణలో 32 చోట్ల జనసేన పోటీ.. జాబితా ఇదే




హైదరాబాద్: త్వరలో జరగనున్న తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి జనసేన(%జీుఖుంవఖు%) సిద్ధమైంది. రాష్ట్రంలో 32 చోట్ల పోటీ చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు పోటీచేసే స్థానాల జాబితాను సోమవారం సాయంత్రం విడుదల చేసింది. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలను నెరవేర్చడమే తమ పార్టీ లక్ష్యమని జనసేన తెలంగాణ శాఖ పేర్కొంది. తెలంగాణ ఎన్నికల్లో పోటీ అంశంపై పూర్తి సన్నద్ధతతో ఉన్నామని.. ఈసారి పోటీలో ఉంటున్నట్టు ఆ పార్టీ ఉపాధ్యక్షుడు బొంగునూరి మహేందర్ రెడ్డి తెలిపారు. ఒకవేళ చివరి క్షణంలో పొత్తులేమైనా ఉంటే ఈ స్థానాల్లో మార్పులు ఉండొచ్చన్నారు.

**జనసేన పోటీ చేసే 32 స్థానాలివే..** కూకట్‌పల్లి, ఎల్బీనగర్, నాగర్‌కర్నూల్, వైరా, ఖమ్మం, మునుగోడు, కుత్బుల్లాపూర్, శేరిలింగంపల్లి, పటాన్‌చెరు, సనత్‌నగర్, కొత్తగూడెం, ఉప్పల్, అశ్వారావుపేట, పాలకుర్తి, నర్సంపేట, స్టేషన్‌ఘన్‌పూర్, హుస్నాబాద్, రామగుండం, జగిత్యాల, నకిరేకల్, హుజూర్‌నగర్, మంథని, కోదాడ, సత్తుపల్లి, వరంగల్ వెస్ట్, వరంగల్ ఈస్ట్, మల్కాజిగిరి, ఖానాపూర్, మేడ్చల్, పాలేరు, ఇల్లందు, మధిర యువత, మహిళలకు ప్రాధాన్యం ఇవ్వాలనే ఉద్దేశంతోనే పవన్ కల్యాణ్ జనసేనను స్థాపించారని.. ఇందులో భాగంగా ఇప్పటికే నాయకత్వాన్ని తయారు చేసినట్టు మహేందర్ రెడ్డి చెప్పారు. దాదాపు 25 సీట్లలో పార్టీకి బలమైన ఓటు బ్యాంకు ఉందన్నారు. గెలుపోటములు నిర్ణయించే స్థాయిలో తమ ఓటింగ్ ఉందని.. గత ఎన్నికల్లో మల్కాజిగిరి పార్లమెంట్ ఎన్నికే ఇందుకు ఉదాహరణ అన్నారు. సింగిల్‌గా వెళ్లడానికి తాము సిద్ధంగా ఉన్నట్టు ఆయన తెలిపారు. గత పదేళ్లలో అనేక సమస్యలపై తెలంగాణ జనసేన పోరాటం చేసిందన్నారు. నల్లమల యురేనియం తవ్వకాలు, మహిళలపై దాడులు, డ్రగ్స్ సమస్య, ఆర్టీసీ కార్మికుల సమస్య, బీసీ, ఎస్టీ వర్గాలతో పాటు విద్యార్థుల సమస్యలు ఇలా.. అనేక అంశాలపై తాము పోరాటం చేసినట్టు ప్రకటనలో పేర్కొన్నారు.

## బీజేపీ పసుపు బోర్డు తెస్తే.. కవిత మాత్రం లిక్కర్ బోర్డు తెచ్చింది

నిజామాబాద్: ప్రధాని మోదీ హయాంలో పసుపు బోర్డు రావడం శుభ పరిణామం అని నిజామాబాద్ బీజేపీ ఎంపీ ధర్మపురి అర్వింద్ అన్నారు. ఆయన మీడియాతో మాట్లాడారు. పసుపు బోర్డు ప్రకటనతో రైతులు చాలా ఉత్సాహంగా ఉన్నారు. రైతుల శ్రేయస్సు, సామర్థ్యాలు మనకు ముఖ్యం అని మోదీ అన్నారు. పసుపు రైతుల ఉజ్వల భవిష్యత్ కోసం ఏమైనా చేస్తాం.. ఎంతవరకైనా వెళ్తాం అని ప్రకటించారు. పసుపు బోర్డు వల్ల ఇన్ఫ్రాస్ట్రక్చర్ పెరుగుతుంది." అని తెలిపారు.

**కవిత లిక్కర్ బోర్డు తెచ్చింది..** "కవిత.. కేసీఆర్ పేరు నిలబెట్టి లిక్కర్ బోర్డు తెచ్చారు. మోదీపై.. కేటీఆర్ వ్యాఖ్యలు అర్థరహితం. మోదీని ప్రపంచం కీర్తిస్తుంది. కేటీఆర్, కవిత ఉద్యమంలో లేరు.

ఎక్కడి నుంచో వచ్చి పదవులు అనుభవిస్తున్నారు. రేపో మాపో కవిత జైలుకు వెళ్తుంది. మీ చెల్లెల కంటే ముందే కేటీఆర్ జైలుకు పోయినా ఆశ్చర్య పోనవసరం లేదు. కేటీఆర్ ప్రధాని గురించి మాట్లాడేముందు ఒళ్ళు దగ్గర పెట్టుకొని మాట్లాడాలి. నిజామాబాద్ పార్లమెంట్ నుంచే మార్పు మొదలవుతుంది. పసుపు బోర్డు ఏర్పాటు చారిత్రాత్మక నిర్ణయం. చాలా చోట్ల పసుపు రైతు సంఘాలు రాజకీయాలకు అతీతంగా ఆశీర్వాద తీర్మానాలు చేస్తున్నారు. నిజామాబాద్‌లో జరిగే ప్రధాని సభకు పసుపు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరుతున్నాం." అని అర్వింద్ చెప్పుకొచ్చారు.



## పైసా ఖర్చులేకుండా పేదలకు ఉచితంగా డబుల్ బెడ్ రూం ఇండ్లు : మేయర్ విజయలక్ష్మి



హైదరాద్ : దేశంలో ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి పేద వారి నుంచి రూపాయి కూడా చెల్లించ అవసరం లేకుండా ఉచితంగా అందజేసిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కుతుందని, హైదరాబాద్ మేయర్ గద్వాల్ విజయలక్ష్మి తెలిపారు. రాజేంద్ర నగర్, నార్సింగిలో 3వ విడతలో ఎంపికైన లబ్ధిదారులకు 356 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పట్టాలను మేయర్విజయలక్ష్మి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పేదవారి సొంతింటి కలను ముఖ్యమంత్రి కేసీఆర్ నిజం చేశారన్నారు. లక్ష డబుల్ బెడ్ రూం ఇండ్లు నిర్మించి విడల వారీగా ఫపేదవారికి ఉచితంగా అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఇదంతా సీఎం కేసీఆర్ కార్యదక్షత వల్లే సాధ్యమైందని చెప్పారు. రాజకీయాలకు తావు లేకుండా పార్టీలకతీతంగా డ్రా నిర్వహించి లబ్ధిదారులకు అందజేస్తున్నామని గుర్తు చేశారు. ఈ నెల 5వ తేదీన నాలుగో విడత డబుల్ ఇండ్లనుపంపిణి చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. ఈ సమావేశంలో చేవెళ్ల ఎంపీ రంజిత్ రెడ్డి, ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, నార్సింగి మున్సిపల్ చైర్మన్ రేఖ, అడిషనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి, ఆర్డీవో మల్లయ్య, ఇతర అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com